ఆదివారం
గతి గారంగేజుల పై విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital


పృథ్వీ 2, అగ్ని-1 క్షిపణుల పరీక్ష విజయవంతం
2లో

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 168 పేజీలు: 12 వెల: 6.50


శుక్రవారం కురిసిన భారీ వర్షానికి విజయవాడలోని పలు ప్రాంతాలు జలమయమైన దృశ్యం

## రాష్ట్రంలో పలు చోట్ల
# భారీ వర్షాలు

విశాఖ, కాకినాడ, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో మోస్తరు వానలు

లోతట్టు ప్రాంతాలు జలమయం

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

24దాకా అధిక వర్షపాతానికి అవకాశం

**విజయవాడ,జూలై18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పలుచోట్లు భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణశాఖ ముందస్తు సూచనలకు తగినట్లు వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు ఖరీఫ్ పంటలకు అదునుగా ఉన్నాయని రైతులు అంటున్నా, ఆరంభంలోనే ఎడతెగని వర్షాల దెబ్బకు విత్తనాలు మొలక దశలోనే కుళ్ళుతున్నాయి. ఇక దాంతో మళ్ళలో వాన నీరు తీయడం వీలుగాని పరిస్దితి. ఆ తరువాత యూరియా వంటి ఎరువుల తప్పని సరిగ్గా వేయాల్సిన పరిస్దితులున్నాయి. రాష్ట్రంలో మరో మూడురోజులు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ ఫోర్‌కాస్ట్ చేసింది. అందుకు తగినట్లుగానే అనేక ప్రాంతాల్లో వేకువ జాముల్లోను, సాయం సమయంలో ఒక రకంగా జోరు వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రోజున పలు జిల్లాలలో భారీ వర్షాలు >>2

## ఉప్పాడ తీరం కోతకు
# శాశ్వత పరిష్కారం



### రూ.323 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు

ఎపి, కేంద్రం నుండి పూర్తి సహకారం: డి.సిఎం పవన్

**విజయవాడ,జూలై18,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప్పాడను చాలాకాలంగా వేధిస్తున్న తీర ప్రాంత కోత సమస్య రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ఎన్డీయే ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ ప్రాంతంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న సముద్ర తీర ప్రాంత కోత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని పవన్ కల్యాణ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ద్వారా ఉప్పాడలో తీర రక్షణ నిర్మాణాలను అభివృద్ధి చేసే ప్రతిపాదనను సుమారు రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందని తెలిపారు. "గత ఐదేళ్లలో సగటున ఏటా 1.23 మీటర్ల తీరం కోతకు గురైంది, దీంతో సుమారు 12 మీటర్ల తీరం కోల్పోయింది. ఇది సమీప గ్రామాలపై, ముఖ్యంగా మత్స్యకారుల గృహాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఎన్‌డీఏ ఎన్నికల వాగ్దానానికి కట్టుబడి, అవసరమైన అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం అని పవన్ కల్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌డీఎంఏ ద్వారా కేంద్ర హోం వ్యవహారాల >>2


శుక్రవారం గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఎపి

రెండు రోజుల్లో అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్

పరిశోధనలు చేయండి, పెట్టుబడులు పెట్టండి

సదస్సులో సిఎం చంద్రబాబు

రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సిఎం సమక్షంలో రూ.51వేల కోట్ల ఒప్పందాలు

**మంగళగిరి, జులై 18, ప్రభాతవార్త :** గ్లోబల్ వార్మింగ్ కారణంగా గ్రీన్ హైడ్రోజన్ కు ప్రాముఖ్యత పెరిగిందనీ, విద్యుత్ తయారీ సంస్థలు హరిత ఇంధనం తయారీ, నిల్వలపై దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. నీరుకొండలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ స్థాయి గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబునాయుడు సదస్సును ప్రారంభించి పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, గ్రీన్ హైడ్రోజన్ పై పరిశోధనలు చేస్తోన్న నిపుణులనుద్దేశించి ప్రసంగించారు. వాతావరణాన్ని కలుషితం చేస్తున్న శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయం గ్రీన్ హైడ్రోజన్ గా పేర్కొంటూ తక్కువ ఖర్చుతో హరిత ఇంధనం తయారీ విరివిగా జరగాలని సూచించారు. ప్రధాన మంత్రి మోడీ 2030 నాటికి 500 గిగావాట్ల నాన్ ఫాజిల్ ఫుయల్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలనీ, లక్ష్యాలను నిర్దేశించిన నేపథ్యంలో విద్యుత్ తయారీ సంస్థలు, పరిశోధకులు, పెట్టుబడిదారులు గ్రీన్ హైడ్రోజన్ పై దృష్టి సారించాల్సి ఉందన్నారు. సోలార్, విండ్ పవర్లను కూడా పెంచాలని సూచిస్తూ గ్రీన్ హైడ్రోజన్ సదస్సును ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం యూని వర్సిటీ యాజమాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా అభినందించారు. యూని వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణన్ స్వాగతోపన్యాసం చేస్తూ గ్రీన్ హైడ్రోజన్ పై పరిశోధనలతో పాటు ఉత్పత్తికి ముందుకు వచ్చే పరిశ్రమలకు సాంకేతిక సహకారం అందించేందుకు ఎస్ఆర్ఎం వర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. నీతి ఆయోగ్ మెంబర్ డాక్టర్ వీకే సారస్వత్ మాట్లాడుతూ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి కేంద్రం లక్ష్యాలను నిర్దేశించి నిధుల కేటాయింపు జరిపిందన్నారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీ, నిల్వలకు దోహదపడే సంస్థలకు కేంద్రం వివిధ రూపాల్లో సహకారం అందిస్తుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచారశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, హరిత ఇంధనం తయారీ విషయంలో మన దేశం అగ్రదేశాలతో పోటీపడాల్సి ఉందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున పెట్టుబడులతో ముందుకు రావాలని కోరారు. ఎస్ఆర్ఎంయూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి నారాయణరావు మాట్లాడుతూ, ప్రభుత్వ సహకారం యూనివర్శిటీలో ఇన్నోవేషన్ సెంటర్ను ప్రారంభించనున్నామనీ, >>2



## టిడిపికి అశోక్ గజపతి
# రాజీనామా

ఎంతో బాధగా ఉందంటూ భావోద్వేగం

**విజయనగరం, జులై 18 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయనగరం సంస్థానాధీశుడు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. తెలుగుదేశం పార్టీ ప్రాథమిక, శాశ్వత సభ్యత్వానికి, పార్టీ పోలిట్‌బ్యూరో పదవికి ఆయన శుక్రవారం రాజీనామా చేశారు. సింహాచలం అప్పన్న సన్నిధిలో రాజీనామా పత్రంపై సంతకం చేసిన ఆయన దానిని టీడీపీజాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడికి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు >>2

## పి-4తో పేదల
# భవిష్యత్తు బంగారం


శుక్రవారం పి-4 మార్గదర్శకులతో విందులో పాల్గొన్న సిఎం చంద్రబాబు

ఉన్నత స్థానాల్లోని వారు సమాజానికి కొంత తిరిగివ్వాలి

పి-4 మార్గదర్శులకు విందులో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 18,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రిగా ఇప్పటివరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా జీరోపావర్టీ పీ4 కార్యక్రమం తన మనసుకు దగ్గరగా ఉన్న కార్యక్రమమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా పేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన మార్గదర్శులకు శుక్రవారంరాత్రి తన క్యాంప్ కార్యాలయంలో సీఎం విందు ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో చంద్రబాబు మనసు విప్పి మాట్లాడారు. పీ4 కార్యక్రమంపై తన ఆలోచనలను.. తాను పెట్టుకున్న లక్ష్యాలను పంచుకున్నారు. పీ4పై మార్గదర్శుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సంపన్నులు చేస్తే.. పేదరికం తగ్గుతుంది. ఈఏడాది ఆగస్ట్ 15కల్లా 15 లక్షల మంది బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలనేది తన సంకల్పమని, ఇందుకు సంపన్నులు, కార్పొరేట్ సంస్థలు, పారిశ్రా >>2



## హరిత రాజధానిగా
# అమరావతి

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనలో భాగంగా 'గ్రీన్ కేపిటల్' నిర్మాణం

**విజయవాడ,జులై 18,ప్రభాతవార్త :**'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాల సాధనలో భాగంగా, 2040 నాటికి గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను శూన్యం చేసే లక్ష్యాన్ని సాధించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా రాజధాని అమరావతిని హరిత రాజధానిగా నిర్మించేందుకు సిఐఐ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజిబిసి) సంయుక్త సౌజన్యంతో ఏపీ సిఆర్డీఏ ఆధ్వర్యంలో విజయవాడలోని ఫార్చ్యూన్ మురళి పార్కులో కెపాసిటీ బిల్డింగ్‌పై వర్క్‌షాప్ జరిగింది. వర్క్‌షాప్‌లో సిఆర్డీఏ ఇంజినీర్ఇన్‌చీఫ్, చీఫ్ ఇంజినీర్ (హౌసింగ్ బిల్డింగ్), డైరెక్టర్ (ప్లానింగ్), డైరెక్టర్ (పర్యావరణం) సహా 50 మందికి పైగా సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఐజిబిసి గ్రీన్ బిల్డింగ్ రేటింగ్ విధానాలపై ప్రామాణిక శిక్షణ అందించడంతో పాటు, భవిష్యత్ ప్రాజెక్టుల్లో పర్యావరణహిత అభివృద్ధి సిద్ధాంతాలను అనుసరించేలా అధికారులకు అవగాహన కల్పించడం జరిగింది. సిఆర్‌డిఏ కమిషనర్ కమిషనర్ కె.కన్నబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి >>2

## పేర్ని నానికి
# బెయిలు తిరస్కృతి

**విజయవాడ.జూలై18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టు మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని)కి ఒక కేసులో ముందస్తు బెయిల్ అంశంలో ఊరట లభించలేదు. పామర్రుపోలీసులు నమోదు చేసిన కేసులో నాని దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 22కి వాయిదా వేసింది. వైసిపి కార్యకర్తల సమావేశంలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలపట్ల వైసిపి నేత, మాజీమంత్రి పేర్ని నాని >>2

# సత్యదేవునికే శఠగోపం!

**కాకినాడ, జూలై 18 ప్రభాతవార్త:** అన్నవరం దేవస్థానం పాలన గాడి తప్పుతోంది. 'వడ్డించే వాడు మనవాడైయితే కడ బంతిలో కూర్చున్నా ఆహార పదార్థాలు వాటంతట అవే వస్తాయి' అన్నచందంగా ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌కు కొమ్ము కాయడంతో లక్షల్లో దోపిడీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని దేవస్థానం దృష్టికి తీసుకొచ్చిన కార్మికులు ఉన్నతాధికారి రోజుకో పుణ్యక్షేత్రంలో గడుపుచున్నారు. పాలన కంటే ప్రొటోకాల్ కే అధిక ప్రాదాన్యత ఇస్తున్నారు. ఇది ఆసరా చేసుకుని క్రింద స్థాయి ఉద్యోగులు రాజ్యమేలుచున్నారు. తప్పుడు బిల్లులతో కూడిన ఫైల్స్ పంపినా ఇట కళ్ళు మూసుకొని సంతకం పెట్టేస్తారులే అన్న ధీమా ఉద్యోగులది అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం ఉద్యోగులు తప్పుడు ఫైల్స్ పెట్టినప్పటికీ, పసిగట్టాల్సిన ఆడిట్ అధికారులు సైతం పట్టించుకోక పోవడం



దేవస్థానంలో కిలాడీలు

కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్న ఉద్యోగులు

నిద్రావస్థలో ఆడిట్

వెనుక మతలబులేమిటో అనే విమర్శలు వినిపిస్తున్నాయి. అన్నవరం దేవస్థానం లో శానిటరీ కాంట్రాక్టర్ భాగోతం ప్రకంపనలు రేపుతోంది. 349 మంది పారిశుధ్య కార్మికుల ఈపిఎఫ్ కాంట్రాక్టర్ మింగేసాడు. ప్రతీ నెలా కార్మికులకు చెల్లిస్తున్నట్లు నకిలీ చలానాలు సృష్టించాడు. గుడ్డివాని ఎదుట దీపం పెట్టిన చందాన అధికారులు అవి అసలివా, నకిలీవా అని పరిశీలించకుండా కాంట్రాక్టర్‌కు పేమెంట్ మంజూరు చేసేసారు. కార్మికులు ఈ విషయం బయట పెట్టేవరకూ రాష్ట్రం లోనే పేరెన్నిక గన్న పెద్ద దేవస్థానం ఉన్నత అధికారులు గమనించక పోవడం శోచనీయం. అన్నవరం దేవస్థానంలో పారిశుధ్య నిర్వహణకు సంబందించి రెండు సంవత్సరాల క్రితం వరకూ హైదరాబాద్ కు చెందిన కెఎల్ టీఎస్ సంస్థ చూసేది. వాళ్ళ గడువు పూర్తయ్యాక, ఈ ఏడాది మార్చి 1 తేదీ నుండి గుంటూరుకు చెందిన కనకదుర్గ మ్యాన్ పవర్ సర్వీసెస్ వారికి నామినేటెడ్‌గా శానిటరీ నిర్వహణ బాద్యతలు అప్పగించారు. దేవస్థానంకు చెందిన అన్ని పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులు నిర్వహణకుగాను >>2

## ఎంపి మిథున్‌రెడ్డికి
# సుప్రీంలో చుక్కెదురు

**విజయవాడ,జూలై18,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణంకేసులో (ఏ4) నిందితుడు, వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మద్యం కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. అరెస్టు చేయకుండా ఛార్జిషీట్ ఎలా దాఖలుచేశారని జస్టిస్ మహదేవన్, జస్టిస్ పార్థివాలాల ధర్మాసనం సిట్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. >>2




శుక్రవారం గ్రీన్‌హైడ్రోజన్ సదస్సులో నీతిఆయోగ్ సభ్యుడు సారస్వత్‌కు జ్ఞాపికను అందచేస్తున్న సిఎం చంద్రబాబు

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఎపి

>> భవిష్యత్లో హైడ్రోజన్ పవర్ ట్రైన్, కార్లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నా మన్నారు. అనంతరం ఎమ్ను, జేకే ఎస్‌హెచ్, హిమ్ను కంపెనీలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుదుర్చుకున్న రెండు ఎంవోయూ పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు నాయుడు, రెన్యూవబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఎండీ కమలాకర్ బాబులు పత్రాలను అందుకోగా ఆయా కంపెనీల ప్రతినిధి గాల్ బాగిన్ ఎంవోయూ పత్రాలను స్వీకరించారు. మచిలీపట్నం కృష్ణపట్నంల మధ్య ఏర్పాటు చేయనున్న ఈ రెండు ప్రాజెక్టుల వల్ల 10 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా వేశారు. సదస్సుకు ఆరగంట ముందు సీఎం చంద్రబాబునాయుడు వివిధ పరిశ్రమల డైరెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమై గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, అనుకూల పరిస్థితులు, అవసరమైన సహకారంపై చర్చించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను ప్రదానం చేశారు. సీఎం చంద్ర బాబు నీతి అయోగ్ మెంబర్ డాక్టర్ సారస్వతు. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసానీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, యూనివర్సిటీ ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, సినర్జన్ గ్రీన్ ఎనర్జీ కంపెనీ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రణవ్ తంతి, సీఎస్ఐఆర్ డైరెక్టర్ ఆశిష్ లేలే, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, సబ్ కలెక్టర్ సంజన

## ఉప్పాడ తీరం కోతకు శాశ్వత పరిష్కారం

>> మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలను సమర్పించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తారని, హోం మంత్రి అమిత్ షా కాకినాడ ప్రజల ఆకాంక్షలను గుర్తిస్తారని ఆశిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉదారంగా సహకరిస్తున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్టు ఆమోదం పొంది, బాధితులకు వారు ఎప్పటి నుంచో కోరుకున్న ఊరట లభిస్తుందని పవన్‌కల్యాణ్ తన ట్వీట్‌లో ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ లో ప్రధాన భాగస్వామిగా ఉంటూనే ప్రజలకు తాను ఇచ్చిన హామీల్ని నిలబెట్టుకోవడంలో మాత్రం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. ముఖ్యంగా తనను తొలిసారి గెలిపించి అసెంబ్లీకి పంపిన పిఠాపురం నియోజకవర్గం విషయంలో అయితే అస్సలు రాజీపడటం లేదు. ఇదే క్రమంలో పవన్ కళ్యాణ్ పిఠాపురం పరిధిలోకి వచ్చే గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఏపీలో గత ఎన్నికల సమయంలో తాను పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఉప్పాడ గ్రామం వద్ద తీర ప్రాంతం భారీగా కోతకు గురవుతున్న విషయం పవన్ కళ్యాణ్ దృష్టికి వచ్చింది. దీంతో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తీర ప్రాంతం కోతకు గురి కాకుండా కాపాడతామంటూ పవన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు కేంద్రం వద్దకు ఇక్కడ తీర ప్రాంత రక్షిత గోడ కట్టాలని ప్రతిపాదనలు తయారు చేయించి పంపారు. ఉప్పాడ వద్ద తీర ప్రాంతం కోతకు గురవుతుండటంతో ఈ గ్రామ ప్రజల ఇళ్లు సముద్రంలో కలిసి పోతున్నాయి. అంతే కాదు సముద్రం ఎప్పుడు వచ్చి తమ ఇళ్లను ముంచేస్తుందో, తనలో కలిపేసుకుంటుందో తెలియక ఇక్కడి మత్స్యకారులకు నిద్రపట్టడం లేదు. ఈ సమస్యను గమనించిన పవన్ కళ్యాణ్ కేంద్రానికి ఉప్పాడ వద్ద రక్షణ గోడ నిర్మాణం కోసం రూ.323 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ పంపిన విజ్ఞప్తికి కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. పవన్ కళ్యాణ్ పంపిన ఉప్పాడ రక్షిత గోడ నిర్మాణానికి అవసరమైన రూ.323 కోట్ల నిధుల కేటాయింపుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జనసేన పార్టీ తన ఖీఎక్స్‌ఖీ హ్యాండిల్ ఈ విషయాన్ని సంతోషంగా షేర్ చేసింది. కేంద్రం ఇచ్చే నిధులతో ఉప్పాడ వద్ద రక్షిత గోడ నిర్మాణం జరిగితే ఇక అక్కడ గ్రామానికి సముద్ర ముప్పు తొలగిపోతుంది. ముఖ్యంగా తుఫానులు వచ్చినప్పుడు, సముద్ర ఆటుపోట్లకు సైతం తీరం కోతకు గురికాకుండా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## పి-4తో పేదల భవిష్యత్తు బంగారం

>> మిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి రావాలి. అంబేద్కర్ నుంచి అబ్దుల్ కలాం వరకు ఎంతోమందిని ఉన్నత స్థానానికి ఎదిగేలా చేసేందుకు వారి జీవితంలో ఎవరో ఒకరు సాయం చేశారు. సమాజంలో విజయం సాధించిన అందరూ సామాజిక బాధ్యతగా సమాజం కోసం తిరిగి ఖర్చు పెట్టాలి. గేట్స్ ఫౌండేషన్ ఈ విషయంలో స్ఫూర్తిగా నిలుస్తుంది. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చూసేందుకు కృషి చేస్తున్నాను. రాష్ట్రంలో ఇప్పటివరకు 5 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించాం. వీరికి సాయం చేసేందుకు 47 వేల మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారు, అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నాడు జన్మభూమి... నేడు పీ4:** 47 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. నేను ముఖ్యమంత్రి అయిన తర్వాత రెండో విడత సంస్కరణలు తీసుకురావడం జరిగింది. ఐటీకి పెద్దపీట వేశాను. విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాను. ఇవన్నీ మంచి ఫలితాలను ఇచ్చాయి. తెలుగు ప్రజలు అన్నింటా అభివృద్ధి చెందారు. సంపద సృష్టించ గలిగాం. దీంతో సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలు చేయగలిగాం. అలాగే, జన్మభూమి వంటి కార్యక్రమం ద్వారా అందరినీ అభివృద్ధిలో భాగస్వాముల్ని చేశాం. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకురావాలన్నదే నా సంకల్పం. పేదల భవిష్యత్ బంగారుమయం చేసేందుకు పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం, అని సీఎం అన్నారు. సీఎం చంద్రబాబు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు మార్గదర్శులు ప్రశంసించారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు.. ఆశయాలకు తాము అండగా ఉంటామని చెప్పారు. పేదల కోసం ఇంతగా ఆలోచన చేసిన నాయకుడ్ని గతంలో తామెప్పుడూ చూడలేదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్వర్ణాంధ్రపీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శ్రీని రాజు, రవి సన్నారెడ్డిశ్రీ సిటి, అనిల్ చలమలశెట్టిగ్రీన్కో, డాంగ్ లీకియా మోటార్స్, పీవీ కృష్ణారెడ్డిమెగా ఇంజనీరింగ్, ఏపీవీ రంగరాజుఎన్ సి సి, వీవీఎన్ రావుజీఎమ్మార్, సజ్జన్ కుమార్ గోయెంకా జయరాజ్ ఇస్పాత్ లిమిటెడ్, దొరైస్వామిబ్రాండిక్స్, సతీష్ రెడ్డిరెడ్డి ల్యాబ్స్, సుచిత్రా ఎల్లాభారత్ బయోటెక్, జయకృష్ణఅమర్ రాజా, శ్రీనివాసరావుబీఎస్సార్, పూజా యాదవ్‌హీరో మోటార్స్ కార్పొరేషన్, విక్రమ్ నారాయణరావు లాయడ్ హెల్త్ కేర్, ఇంద్రకుమార్అవంతి ఫీడ్స్, శివప్రసాద్ హెచ్సీఎల్, గురుసెల్ కాన్ మొబైల్స్, మాధవ్‌రిలయన్స్, పీవీ వెంకటరమణ రాజురామ్ కో, ఎం. శ్రీనివాసరావుజెమిని ఎడిబుల్స్ సంస్థల నుంచి విందు సమావేశానికి హాజరయ్యారు.

## వికసిత్ భారత్‌పైనే ఇపుడు ప్రపంచమంతా చర్చ: ప్రధాని మోడీ

**కోల్‌కత్తా,జూలై 18:** అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న భారత్ సంకల్పం గురించి ఇప్పుడు ప్రపంచమంతా చర్చ జరుగుతోందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. దేశంలో కనిపిస్తున్న మార్పులే అందుకు కారణమని, వాటిపైనే అభివృద్ధి చెందిన భారత్ అనే భవనం నిర్మితమవుతుందని చెప్పారు. బెంగాల్‌లో ఆయిల్, గ్యాస్, పవర్, రైల్, రోడ్డు రంగాలకు సంబంధించి ఐదువేల 4వందల కోట్ల వ్యయంతో కూడిన అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం దుర్గాపూర్‌లో జరిగిన సభలో పాల్గొన్న ప్రధాని మోడీ, మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆర్జీ కార్ ఆస్పత్రిలో జరిగిన హత్యాచార ఘటనలో టీఎంసీ ప్రభుత్వం నిందితులను కాపాడే ప్రయత్నం చేసిందని దుయ్యబట్టారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలు గౌరవించబడుతున్నట్లు చెప్పారు. తమకు బెంగాల్ అస్థిత్వమే ముఖ్యమని ప్రధాని మోదీ అన్నారు. దుర్గాపుర్, రఘునాథ్‌పుర్‌లోని ఉక్కు, విద్యుత్ ప్లాంట్లలో కొత్త సాంకేతికత నెలకొల్పాం. అందుకోసం రూ.15వేల కోట్ల పెట్టుబడులు పెట్టాం. ఆ ఫ్యాక్టరీలు ప్రపంచంతో పోటీపడేలా మరింత సమర్థంగా మారాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయినందుకు బెంగాల్ ప్రజలను అభినందిస్తున్నాను. పరిశ్రమలు లేదా వ్యవసాయం సహా అన్ని రంగాలు 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలనే సంకల్పంతో పనిచేస్తున్నాయి. అభివృద్ధి నుంచి స్వావలంబన, ఉపాధి నుంచి ఆత్మనిర్భరతా, సున్నితత్వం నుంచి సుపరిపాలన అనే విలువలతో ముందుకు సాగుతూ బంగాల్‌ను దేశాభివృద్ధి యాత్రలో గొప్ప చోదకశక్తిగా మార్చి తీరుతామని ప్రధానిమోడీ అన్నారు.

## పేర్ని నానికి బెయిలు తిరస్కృతి

>> అనుచిత వ్యాఖ్యలతో ప్రసంగించారంటూ మచిలీపట్నం టిడిపి పట్టణ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి పామర్రు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. దీనిపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోసం నాని హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఆయనకు హైకోర్టులో ప్రతికూలత ఎదురైంది. పోలీసులు అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలన్న ఆయన తరఫు న్యాయవాది అభ్యర్థనకు అనుగుణంగా ఉత్తర్వుల జారీకి కోర్టు నిరాకరించింది. కేసు వివరాలు సమర్పించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్‌తోపాటు పోలీసులు కఠిన చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ పేర్ని నాని వేసిన తన పిటిషన్‌లో కోరారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఆయన అభ్యర్ధనను తిరస్కరించింది.

# హరిత రాజధానిగా అమరావతి

>> ఉందని, ప్రజారాజధాని అమరావతిని దేశంలోనే అత్యంత ఆదర్శమైన హరిత రాజధానిగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంతో సిఆర్‌డిఏ పని చేస్తోందన్నారు. రాజధానిలోని ప్రతి ప్రాజెక్టులోనూ సుస్థిరాభివృద్ధి పద్ధతులను అనుసరిస్తున్నామని, నెట్ జీరో విధానాలతో అమరావతిలో నిర్మించిన ఏపీ సిఆర్ డి ప్రాజెక్ట్ కార్యాలయం దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. అమరావతి నిర్మాణంలో ఐ జి బి సి యొక్క భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌కు 2018లోనే ఐజిబిసి గ్రీన్ సిటీ ఖీప్లాటినం రేటింగ్‌ఖీ లభించిందని, దేశంలోనే మొట్టమొదటిసారిగా డిజైన్ దశలోనే ఈ రేటింగ్ సాధించిన నగరంగా మన అమరావతి నిలిచిందని ఆయన గుర్తు చేశారు. అమరావతి చాప్టర్ ఛైర్మన్ మేకా విజయ్ సాయి మాట్లాడుతూ ఏపీ సిఆర్ డి నిర్మిస్తోన్న ప్రాజెక్టులలో ఐజిబిసి గ్రీన్ రేటింగ్‌ను అనుసరించడం ద్వారా రాష్ట్రం పర్యావరణ పరిరక్షణలో ముందడుగు వేసిందన్నారు. ఈ భాగస్వామ్యం ప్రభుత్వ సంస్థలు, గ్రీన్ బిల్డింగ్ కౌన్సిళ్లు కలసి పని చేస్తే సాధ్యమయ్యే సానుకూల మార్పునకు ఉదాహరణ గా పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో భాగస్వామ్యం ద్వారా అమరావతిని సుస్థిరమైన, పర్యావరణహితమైన, ప్రపంచస్థాయి హరిత రాజధానిగా అభివృద్ధి చేయాలన్న లక్ష్య సాధనలో ఏపీ సిఆర్ డి మరో ముందడుగు వేసింది.

## రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు

>> కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్త హెచ్చరించింది. ఈ క్రమంలో వర్షాలు పడుతున్నాయి.. అలాగే కొన్ని చోట్ల మోస్తారు వర్షం కురుస్తుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ అంచనా వేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు జూలై 24 వరకూ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఉమ్మడి గోదావరి, కృష్ణా, ఉత్తరాంధ్ర, సీమలోని పలు జిల్లాలో వానలకు అస్సలే గతుకులుగా కీలక రహదారులు మరింతగా దెబ్బతింటున్నాయి. విజయవాడ, విశాఖ, కాకినాడ, విజయనగరం, గుంటూరు, ఏలూరు నగరాలపై రాత్రుళ్ళు వర్ష ప్రభావం తీవ్రంగానే ఉంటుంది. దీంతో చెట్లు, విద్యుత్తు స్థంభాలు ఒరగటం, తీగలు తెగిపడటంతో కరెంటు సరఫరా ఇబ్బంది కలుగుతుంది. పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ, ఉక్కపోతతో ఉన్నప్పటికీ.. సాయంత్రం ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. రహదారులపై వర్షం నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరికొన్ని చోట్ల బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి రాష్ట్రంలో మరో మూడు రోజులు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 19నుంచి శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా, వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. జూలై 24 వరకు ఏపీలో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. భారీ వర్షాల సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వీలైనంత మేరకు సురక్షిత ప్రదేశంలో ఉండాలని సూచిస్తున్నారు. భారీ వర్షం పడుతున్నప్పుడు వీలైతే ఇంట్లోనే ఉండాలని చెప్తున్నారు. లోతట్టు ప్రాంతాలు, నీటితో నిండే ప్రదేశాలకు దూరంగా ఉండాలంటున్నారు. మరో పక్క రాష్ట్రంలో గోదావరి, కృష్ణానదికి ఎగువ ప్రాంతాలనుంచి వరద నీరు చేరుతుంది. కొన్ని ప్రాంతాల్లో వాగులు పొంగుతున్నాయి. ఇక మరో పక్కరాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కాకినాడ, తుని, నరసాపురం, మచిలీపట్నం, నందిగామ, బాపట్ల, గన్నవరం, జంగమేశ్వరపురం, ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 6డిగ్రీలు ఎక్కువగా నమోదైనట్లు వాతావరణ శాఖ వివరించింది. అయితే సాయంత్రమయే సరికి ఒక్క చాలా ఆకాశంలో మొఘాలు కమ్ముకున్నాయి. చల్లటి గాలు వీచాయి. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, పల్నాడు, గుంటూరు, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాత్రి 8 గంటల వరకు అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లా ఉటుకూరులో 70.25 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదే సందర్భంలో దక్షిణ కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేకచోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు పలుచోట్ల చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది. రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు అనేకచోట్లకురిసే అవకాశమున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## ఎంపి మిథున్‌రెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

>> ముందస్తుబెయిల్ పొందడానికి ఎలాంటి కారణాలు ఉన్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం అడిగింది. విచారణ అనంతరం ముందస్తు బెయిల్ కోసం మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. లొంగిపోవడానికి సమయమిచ్చేందుకు కూడా సుప్రీంకోర్టు విముఖత చూపింది. మద్యం కేసులో ముందస్తు బెయిలు కోసం మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల ఏపీ హైకోర్టు కొట్టేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మద్యం కుంభకోణం కేసులో మిథున్‌రెడ్డిపై సిట్ అధికారులు ఇప్పటికే లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో విదేశాలకు పారిపోకుండా అడ్డుకునేందుకు ఈ ఎల్వోసీ ఇచ్చారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసే అవకాశముందని ముందే గ్రహించిన మిథున్‌రెడ్డి అప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన ఎక్కడ దాక్కున్నారో తెలుసుకునేందుకు సిట్ బృందాలను ఏర్పాటు చేసింది. మద్యం కుంభకోణం కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత మిథున్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోవటం ఇది రెండోసారి. ఈ కుంభకోణంలో తన ప్రమేయం సిట్ దర్యాప్తులో బయటపడిందని తెలియగానే మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం మార్చిలో హైకోర్టుకు వెళ్లారు. అప్పటికి ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చకపోవడంతో కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది. తనను అరెస్టు చేస్తారేమోననే భయంతో మిథున్‌రెడ్డి అప్పట్లో అజ్ఞాతంలో ఉంటూనే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టులో విచారణ కొనసాగినంత కాలం అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వటంతో బయటకొచ్చారు. ఇప్పుడు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మిథున్‌రెడ్డి ఆచూకీ తెలిస్తే ఆయన్ను సిట్ అధికారులు వెంటనే అరెస్టు చేసే అవకాశముంది.

# బలహీన వర్గాలపేరిట ఆర్జేడి, కాంగ్రెస్ రాజకీయాలు!

## బీహార్ ఎన్నికల ప్రచారంలో మోడీ ఘాటు వ్యాఖ్యలు

**పాట్నా,జూలై 18:** ప్రధాని మోడీ మరోసారి కాంగ్రెస్, ఆర్జేడీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు పేదలు, బలహీన వర్గాల పేరిట రాజకీయాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. పేదల నుంచి భూములు తీసుకున్నా ఇప్పటికీ వారికీ ఉద్యోగాలు ఇవ్వాలనే విషయాన్ని పట్టించుకోవట్లేదని ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో మోడీ ఎన్నికల ప్రచారాన్ని షురూచేసారు. యూపీఏ పాలనలో బీహార్‌పై ప్రతీకార రాజకీయాలు చేశారని విమర్శించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఆయన, మోతీహారిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఎన్నికల నేపథ్యంలో బనాయేంగే నయా బీహార్, ఫిర్ ఏక్ బార్ ఎన్డీఏ సర్కార్ అనే కొత్త నినాదాన్ని ఇచ్చి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. కేంద్రంలో కాంగ్రెస్, ఆర్‌జేడీతో కూడిన యూపీఏ ప్రభుత్వం ఉన్న 10ఏళ్ల కాలంలో బీహార్‌కు కేవలం రూ.2లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. ఇక్కడి నీతీశ్ కుమార్ ప్రభుత్వంపై ప్రతీకారం తీర్చుకున్నారు. అదే 2014లో నాకు కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఇచ్చారు. కానీ నేను అధికారంలోకి వచ్చాకా ఈ ప్రతీకార రాజకీయాలకు ముగింపు పలికాను. గత 10ఏళ్ల ఎన్డీఏ పాలనలో బీహార్ అభివృద్ధికి అనేక నిధులు కేటాయించాను. అంతకుముందు ఎన్నడూ లేని విధంగా బీహార్ అభివృద్ధి చెందింది. బీహార్ అభివృద్ధి చెందింతే దేశం కూడా ప్రగతి పథంలో నడుస్తుంది. అయితే, ఇక్కడి యువతకు ఉపాధి కల్పించినప్పుడే బీహార్ అభివృద్ధి చెందుతుందని ప్రధానిమోడీ అన్నారు. ఇప్పటి తరానికి రెండు దశాబ్దాల పాటు కాంగ్రెస్, ఆర్జేడీ పాలనలో బీహార్ ఎంత వెనుకబడిందనే విషయాలు తెలియాలని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. పేదలకు సంబంధించిన ధనం వారికి చేరడం అసాధ్యంగా మారిందని గుర్తు చేశారు. ఆనాటి పాలనలో పేదల నుంచి నిధులను ఎలా దోచుకోవాలనే ఆలోచన ఉండేదని ఆరోపించారు. 21 శతాబ్దంలో ప్రపంచ వాయువేగంతో ముందుకు దూసుకెళ్తుంది. ఒకప్పుడు పశ్చిమ దేశాల చేతుల్లోనే అధికారం ఉండేది. కానీ ఇప్పుడు తూర్పు దేశాలు సైతం తమ బలాన్ని చూపిస్తున్నాయి. తూర్పున ఉన్న దేశాలు అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నాయి. అలాగే మనం దేశంలో ఉన్న తూర్పు రాష్ట్రాలు కూడా ప్రగతి పథంలో నడవాలి. తూర్పు భారతం అభివృద్ధి చెందాలంటే తప్పకుండా బీహార్‌లో మార్పు రావాలి. అందుకు కావాల్సిన పనులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి ముమ్మరంగా చేస్తున్నాయని మోడీ అన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీలు పేదలు, దళితులు, అణగారిన వర్గాలు, ఆదివాసీల పేరుతో రాజకీయాలు చేశాయి. సమాన అవకాశాలే కాకుండా తమ కుటుంబం తప్ప ఇతరులను గౌరవించలేదు. వారి అహంకారాన్ని మొత్తం బిహార్ చూస్తోంది. వారి నుంచి బీహార్‌ను కాపాడాల్సి ఉంది. నితీశ్ బృందం, బిజెపి బృందంసహా మొత్తంగా ఎన్డీయే ఎన్నోఏళ్లుగా శ్రమిస్తున్నాయి. చంద్రమోహన్ రాయ్ వంటి వారు మార్గదర్శనం చేశారు. మనమంతా కలిసి బిహార్ అభివృద్ధిని వేగవంతం చేయాలి. మనమంతా కలిసి బీహార్ బంగారు భవిత కోసం ముందుకు సాగాలి. నవ బీహార్ చేద్దాం మరోసారి ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని సంకల్పం తీసుకుందామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు.

# టిడిపికి అశోక్ గజపతి రాజీనామా



>> పల్లా శ్రీనివాసరావుకి పంపించారు.

**అప్పన్నను దర్శించుకున్న అశోక్ గజపతి:** ముందుగా ఆయన తన సతీమణి సునీలా గజపతిరాజు, కుమార్తె, విజయనగరం శాసనసభ్యురాలు అదితి గజపతి రాజుతో కలిసి సింహాచలం అప్పన్నను దర్శించుకున్నారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అశోక్ గజపతి కుటుంబానికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అప్పన్న దర్శనానంతరం ఆయన కుటుంబానికి వేద పండితులు మంగళ హారతులతో వేదాశ్వీరచనం చేశారు. అప్పన్న దర్శనం అనంతరం అశోక్ గజపతి రాజు పాత్రికేయులతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. టీడీపీకి రాజీనామా చేయడం బాధాకరంగా ఉందని ఆయన కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు. ఏ పనైనా అప్పన్న దర్శనానంతరం చేయడం తనకు సెంటిమెంట్ అని ఆయన పేర్కొన్నారు. అదే క్రమంలో తాను టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికీ, పొలిట్‌బ్యూరో పదవికి అప్పన్న సన్నిధిలోనే రాజీనామా చేశానని ఆయనన్నారు. పార్టీకి రాజీనామా చేయడం బాధగా ఉన్నప్పటికీ అనివార్యమైన పరిస్థితుల నేపథ్యంలో తప్పలేదన్నారు. ఇకపై తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటానని చెబుతూ రాజ్యాంగబద్ధంగా చేపట్టబోయే గవర్నర్ పదవీ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడి వలనే తనకు గవర్నర్ పదవి వచ్చిందన్న ప్రగాఢ విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్రం, ఉత్తరాంధ్రా ప్రాంతం, తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపాడే విధంగా గవర్నర్ బాధ్యతలను నెరవేరుస్తానని ఆయన పేర్కొన్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మ కర్తగా తాను అవుతానని ఊహించలేదని, తన తండ్రి పీవీజీ రాజు, సోదరుడు ఆనంద గజపతి స్వర్గస్తు లైన నేపథ్యంలో ఆ బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చిందన్నారు. పూర్వ రాష్ట్రపతులు శంకర్ దయాళ్ శర్మ, జ్ఞానీ జైల్‌సింగ్ అప్పన్న దర్శనానికి వచ్చినప్పుడు వారికి ఎంతటి ఘన స్వాగతం లభించిందో ఇప్పుడు తనకు కూడా అదే తరహాలో అపూర్వ ఆదరణ లభించడం తనకెంతో ఆనందంగా ఉందని అశోక్ గజపతి రాజు వ్యాఖ్యానించారు.

# సత్యదేవునికే శఠగోపం!

>> 349 మంది పారిశుధ్య సిబ్బంది తో పనులు చేయించుటకు గాను శానిటరీ సంస్థకు నెలకు 52 లక్షల రూపాయలు దేవస్థానం చెల్లించుటకు ఒప్పందం. అందులో కార్మిక చట్టం ప్రకారం గుత్తేదారు 16.25 శాతం ఈపిఎఫ్ గా సిబ్బంది పేరున జమ చేయాలి. ముందుగా ఈపిఎఫ్ కట్టాకే దేవస్థానం బిల్లు మంజూరు చెయ్యాలనేది నిబంధన. ఇక్కడే అసలు కిటుకు దాగిఉంది. మార్చి నుండి మే నెలవరకూ కార్మికులకు ఈపిఎఫ్ చెల్లించినట్లు నకిలీవి సృష్టించి, కాంటాక్టర్ దేవస్థానం నుండి కోటి 60 లక్షల రూపాయలు బిల్లును పొందాడు. ఈ విషయంపై కొందరు పారిశుధ్య కార్మికులు ఇఓ కు ఫిర్యాదు చేసారు. కాంటాక్టర్ సమర్పించిన ఈపిఎఫ్ చలానాలు పరిశీలించి అధికారులు విస్తు పోయారు అవి నకిలీవని తేలింది. కాంటాక్టర్ ను పిలిపించి, దేవస్థానం ఇఓ దీనిపై ప్రశ్నించగా, కాంటాక్టర్ తప్పు సరిదిద్దుకొనే ప్రయత్నంలో భాగంగా మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఈ నెల 9 వ తేదీన 10 లక్షల 9 వేలు, 14 వ తేదీన 9లక్షల 90 వేలు, 15 వ తేదీన 9లక్షల 75 వేల రూపాయలు పారిశుధ్య కార్మికులకు ఈపిఎఫ్ గా చెల్లించిన చలానాలు అందజేసి చేతులు దులుపుకున్నారు. అంతకు ముందు సమర్పించిన చలానాలు నకిలీవన్న విషయం కాంట్రాక్టర్ ఒప్పుకున్నట్లేనన్నది స్పష్టమైంది. ఇటువంటి మోసాలు పసిగట్టాల్సిన ఆడిట్ అధికారుల తీరు అనుమానస్పదమేనని విమర్శలు వస్తున్నాయి. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి శానిటరీ కాంట్రాక్టర్ పైన, అందుకు సహకరించిన ఉద్యోగులపైనా క్రమ శిక్షణా చర్యలు చేపట్టాలని భవిష్యత్తులో ఏ ఉద్యోగి ఇటువంటి మోసపూ దోపిడీకి సహకరించకుండా ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని సత్యదేవుని భక్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ విషయమై దేవాదాయ శాఖ మంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

# జూరాలకు భారీ వరద

### 18గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 18, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం పెరుగుతున్నది. కర్ణాటక నుంచి గత నాలుగు రోజులుగా వరద తగ్గడంతో జూరాల గేట్లు మూసివేశారు. అయితే శుక్రవారం జలాశయానికి 1,15,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.264 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 30,498 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 71,604 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్ట్ -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 600 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,06,213 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## గడువుకు ముందే భారత్ అమ్ములపొదిలోకి కొత్త అస్సాల్ట్ రైఫిల్స్

**న్యూఢిల్లీ, జులై 18:** భారత సైన్యం అమ్ముల పొదిలోకి అత్యాధునిక ఏకే203 అస్సాల్ట్ రైఫిల్స్ వస్తున్నాయి. ఇవి సైనికుల పోరాట సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. భారత్, రష్యా సంయుక్తంగా ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలోని కోర్వా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఇండో రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఆర్ఆర్‌పీఎల్) కంపెనీలో ఈ రైఫిల్స్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. భారతదేశం, రష్యా మధ్య సుమారు రూ.5,200 కోట్ల ఒప్పందంలో భాగంగా 6 లక్షలకు పైగా ఏకే203 రైఫిల్స్‌ను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1,18,000 రైఫిల్స్ భారత సైన్యానికి అందాయి. డిసెంబర్ 2025 నాటికి ఈ రైఫిల్స్ ఉత్పత్తిలో 100 శాతం స్వదేశీకరణ సాధించాలని భారత్ యోచిస్తోంది. వాస్తవానికి ఒప్పందం ప్రకారం 2032 నాటికి 6 లక్షల రైఫిళ్లను సైన్యానికి అందించాల్సి ఉంది. అయితే, అనుకున్న సమయానికి 22 నెలల ముందే రైఫిళ్లను సైన్యానికి అందించేందుకు ఐఆర్ఆర్ పీఎల్ కృషి చేస్తోంది. ఈ రైఫిల్స్ నిమిషానికి 700 రౌండ్ల వేగంతో కాల్పులు జరపగలవు. ఇవి 7.62, 39ఎంఎం క్యాలిబర్ కలిగి ఉంటాయి. వీటి బరువు కేవలం 3.8 కిలోగ్రాములు, ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఇన్సాస్ రైఫిల్స్ 4.15 కిలోగ్రాములు కంటే తేలికైనవి. ప్రభావవంతమైన ఫైరింగ్ రేంజ్ 800 మీటర్ల వరకు ఉంటుంది.

## పృథ్వీ2, అగ్ని-1 క్షిపణులు పరీక్ష విజయవంతం

**చాందిపూర్,జూలై 18:** పృథ్వీ 2, అగ్ని 1 బాలిస్టిక్ క్షిపణుల పరీక్ష విజయవంతం అయింది. గురువారం ఒడిశా, చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వీటిని పరీక్షించారు. ది స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో వీటి పరీక్ష జరిగింది. గురువారం ఒడిశా, చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వీటిని పరీక్షి ంచారు. ది స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో వీటి పరీక్ష జరిగింది. పృథ్వీ 2, అగ్ని 1లు ఆపరేషనల్, టెక్నికల్ పారామీటర్స్‌ను అందుకున్నాయి. దీంతో పరీక్ష విజయవంతం అయింది. పృథ్వీ 2 మిస్సైల్ స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి. దీనిని భారతదేశ రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్డీఓ) అభివృద్ధి చేసింది. ఇది ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి. ది స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ దీనిని వాడుతుంది.

### వారం - వర్జ్యం

19-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
నవమి మ.2.41
భరణి రా.12.36
వర్జ్యం : ఉ.11.44-1.13
దు.తె.5.45-7.25
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** శ్రమానంతరం పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగులకు విధి నిర్వాహణలో ఆటంకాలు ఎదురైన చికాకులు పెడతాయి.

**వృషభం :** వివాహ, ఉద్యోగ యత్నాలు నిదానంగా పూర్తిచేస్తారు. చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మిథునం:** చాకచక్యంగా పట్టుదలతో కొన్ని కార్యక్రమాలు చివరికి పూర్తి చేస్తారు.

**కర్కాటకం :** ఎంత శ్రమించినా ఫలితం దక్కదు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు, చికాకు పరుస్తాయి.

**సింహం:** ముఖ్యవిషయాలలో పెద్దల సలహాలు తీసుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**కన్య:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి.

**తుల :** శుభవార్తలు అందుకొంటారు. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు.

**వృశ్చికం:** నూతన పెట్టుబడుల విషయాలలో తొందరపాటు వద్దు. స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**ధనుస్సు:** ఉద్యోగ, వివాహ యత్నాలు మందకొడిగా సాగుతాయి. ఇంటా బయటా ఒత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**మకరం:** ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా వుంటాయి.

**కుంభం:** చర్చగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు. వ్యవహారాలలో ఆటంకాలు చికాకు పరుస్తాయి.

**మీనం:** ఇతరుల విషయాలలో జోక్యం తగదు. సంతానం నుండి కీలక సమాచారం అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు: కె.విజయానంద్

**విజయవాడ,జూలై 18,ప్రభాత వార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో.. పి4 పౌండేషన్, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర, ఎంఎస్ఎంఇ పార్కులు, ర్యాంప్, పిఎం ఆదర్శ గ్రామ యోజన తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు దశల వారీగా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే అక్టోబరు నాటికి 17 మున్సిపల్ కార్పొరేషన్లను ప్లాస్టిక్ రహిత కార్పొరేషన్లుగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక సారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వస్తువుల వల్ల జల, వాయు కాలుష్యంతో పర్యావరణానికి కలుగుతున్న హానిని గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో పేదరిక నిర్మూలనకు, ఆర్థిక అసమానతలను తొలగించాలనే పవిత్ర లక్ష్యంతో ప్రభుత్వం స్వర్ణాంధ్ర పి4 పౌండేషన్‌ను ప్రారంభించిందని తెలిపారు. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ఇప్పటికే 19.17 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించగా, 5.20 లక్షల కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. పిఎం ఆదర్శ గ్రామ యోజన పథకం కింద 1,027 గ్రామాలను ఎంపిక చేయగా ఇప్పటికే 765 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ప్రకటించామన్నారు.

## పోలవరం ఎత్తు కుదింపు పాపం జగన్‌దే

### - ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల

**విజయవాడ,జూలై 18,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు ఎత్తు కుదింపు పాపం ముమ్మాటికీ మాజీ సిఎం జగన్‌దేనని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. భారతీయ జనతాపార్టీకి అమ్ముడుపోయి మోడీ కోసం పోలవరం ప్రయోజనాలు తాకట్టు పెట్టి...ఇప్పుడు ప్రాజెక్ట్ ఎత్తు పెంచాలని జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని" ఎక్స్ " వేదికగా ఆమె విమర్శించారు. వైఎస్సార్ కుమారుడై ఉండి ఐదేళ్ళ వైకాపా పాలనలో పోలవరంలో తట్టెడు మట్టి తీశారా? వైఎస్ ఆశయ సాధకుడివైతే పోలవరం ప్రాజెక్ట్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేశారు? 2022లో పోలవరం నీటి నిల్వ సామర్థ్యం 41.15 మీటర్లకు కుదించిన పాపం మీ ప్రభుత్వానిది కాదా? అంచనా వ్యయం రూ.55 వేల కోట్ల నుంచి రూ.37 వేల కోట్లకు తగ్గిస్తుంటే వేడుక చూసింది మీరు కాదా?' అని షర్మిల ప్రశ్నించారు. 'కూటమి ప్రభుత్వం బనకచర్ల ప్రయత్నాలు ఆపి...ముందు పోలవరం ప్రాజెక్టు సంగతి తేల్చాలి. పాత డీపీఆర్ ప్రకారమే పోలవరాన్ని 45.7 మీటర్ల ఎత్తులో నిర్వహించాలి'అని షర్మిల డిమాండ్ చేశారు.

### సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని

# రెవెన్యూ రాబడి పెరిగేలా చర్యలు

### - మంత్రి పయ్యావుల కేశవ్



వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌ల వర్క్‌షాపుల్లో ప్రసంగిస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ,జూలై 18,ప్రభాత వార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పనిచేస్తున్న వాణిజ్య పన్నుల శాఖఅధికారుల పనితీరు దేశానికే ఆదర్శమని వారు పనితీరులో ఎవ్వరికీ తీసిపోరని ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర వాణిజ్య పన్నుల సంస్థ కార్యాలయంలో జేసీ, డీసీ (జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లు) లతో ఏర్పాటు చేసిన రెవెన్యూ వర్క్ షాపు కార్యక్రమానికి ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ తమ అనుభవాన్ని ఉపయోగించి సంస్థ మరింత పురోభివృద్ధి చెంది ఆదాయాన్ని ఆర్జించేలా కృషి చేయాల్సిన ఆవశ్యకత మనందరి పై ఉందని మంత్రి అన్నారు. అధికారులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని వ్యాపారాలు చేసుకొనే ఏ ఒక్కరికీ ఇబ్బందులు కలగకుండా జీఎస్టీ పన్నుల రెవెన్యూను పెంచాలన్నారు. ఇందులో ఏ ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వ పరంగా అధికారులకు అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వానికి రాష్ట్రంలో పెట్టుబడులు ఎంతముఖ్యమో అదే విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కూడా అంతే ముఖ్యమన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈఏడాది పన్నుల వసూళ్లలో వృద్ధి సాధించామని ఇందుకు టీమ్ గా పనిచేసిన సిబ్బందిని అభినందిస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తిని ముమ్ముందు కూడా కొనసాగించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి అయ్యిందని ఇంకా మరింత బాధ్యతాయుతంగా అధికారులు, సిబ్బంది పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నెలలోపు శాఖ ప్రగతిలో మార్పులు తప్పనిసరిగా కనిపించాలన్నారు. మన డాటాని ఆధారం చేసుకుని వ్యవస్థలో లోపాలతో పన్నులను ఎగ్గొట్టేవారికి మనం అంటే చూపించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. అదే స్ఫూర్తిని తీసుకుని నేను కూడా ఎంతో ఇష్టంగా పనిచేస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు కూడా సమర్థవంతంగా తమ సేవలను రాష్ట్రాభివృద్ధి కోసం ఉపయోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరాల యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్లతుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి అక్రమంగా వచ్చే ఆయిల్ తదితర దిగుమతులు చేసుకునే వాళ్ల పన్ను వసూళ్ల నుంచి తప్పించుకోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వాటిని సమర్థవంతంగా అరికట్టాలన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్స్ ను సమర్థవంతంగా అరికట్టే విధంగా ఇతర శాఖలతో కలసి జాయింట్ కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసుకుని సంయుక్తంగా తనిఖీలతో వాటిని సరిచేయాలన్నారు. ఫీల్డ్ లో సమర్థవంతంగా పనిచేసినప్పుడే మనం ఆశించిన రిజల్ట్స్ వస్తాయన్నారు. గత ప్రభుత్వం విధానాల వల్ల ఆర్థిక ఇబ్బందులు మన ప్రభుత్వానికి అందించిందని, వాటిని సరిచేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వ్యాట్ పన్నులు పెంచేందుకు పనిచేసిన వారికి అవార్డులు అందిస్తామని మంత్రి తెలిపారు. యానాం నుంచి మన రాష్ట్రానికి డీజిల్ దిగుమతి అవుతుందనే సమాచారం ఉందని అలాంటి వాటిపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

## తెలుగు భాషా విధానంపై అంతర్జాతీయ లఘు చలన చిత్ర పోటీలు

### - ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్



**విజయవాడ,జూలై 18,ప్రభాతవార్తప్రతినిధి:** మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు-2026 సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్వర్యంలో తెలుగు భాషా వికాసంపై 'అంతర్జాతీయ లఘు చలన చిత్ర పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. తెలుగు భాష చారిత్రక వైభవం, ఆంధ్ర సారస్వత దీప్తి, తెలుగు భాషా వికాసం, తెలుగు వెలుగులు, తెలుగు భాషా రక్షణ ప్రాచుర్యం అంశాలుగా పోటీలు ఉంటాయని, చిత్ర ప్రదర్శన వేడుకకు భారతీయ విద్యా భవన్ ప్రాంగణం, గుంటూరు, అమరావతి వేదికగా 14 సెప్టెంబు 202=5 వరకు నిర్వహిస్తామన్నారు. లఘు చలనచిత్ర పోటీలలో పంపే ఎంట్రీలు నిడివి-5 నిముషాలు మాత్రమే ఉండాలని, 4 నిముషాలకు తక్కువగా ఉండరాదన్నారు. ఏ వయసు వారైనా పాల్గొనవచ్చుని, రాజకీయ పార్టీల అంశాలు, విద్వేషాలు కల్గించే అంశాలు ఉండరాదని, జాతీయ సమైక్యతకు భంగం వాటిల్లే అంశాలు ఉండరాదని తెలిపారు. ఒకసారి పంపిన ఎంట్రీ వెనక్కు తీసుకోవడానికి వీలు కాదని లఘు చిత్రం యొక్క క్వాలిటీ 720/1040 మెగా ఫిక్సెల్ ఉండాలని, ఎంట్రీలు ఆగస్టు 14వ తారీఖుకు రావాలని తెలిపారు. ఎంట్రీలు ఎఎస్‌పిషార్ట్‌ఫిల్మ్‌కాంటెస్ట్ అట్ ది రేట్ ఆఫ్ జి మెయిల్.కాంకు వుయి ట్రాన్స్ ఫర్ ద్వారా పంపవల్సి ఉంటుంది. ఈ పోటీలకు ముఖ్య సమన్వయ కర్తగా ప్రముఖ నటుడు, నిర్మాత లోహిత్‌కుమార్, సాకేత్ ఉదయగిరి, 9182612419 సహ సమన్వయ కర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్ఓసి తప్పక ముఖ్య సాంకేతిక సభ్యుల నుండి ఇవ్వాలని, ఒక సంస్థ రెండు ఎంట్రీలు వరకు ఇవ్వవచ్చుని తెలిపారు. డాక్యుమెంటరీ, కథాపరమైన చిత్రాలు ఇందులో అనుమతించబడతాయని, చిత్రాలు రాబోయే తరాల వారికి, తెలుగు జాతికి స్ఫూర్తి కల్గించే విధంగా ఉండాలి. తెలుగు భాష రక్షణకు స్ఫూర్తి కల్గించాలని కోరారు. మొదటి బహుమతి - లక్ష రూపాయలు, రెండవ బహుమతి -75వేల రూపాయలు, మూడవ బహుమతి-50వేల రూపాయలు, మూడు ప్రశంసా బహుమతులు, ఒక్కొక్కరికి 10.116బహుతులు, ఉత్తమ నటుడు, నటి, ఉత్తమ రచన, ఉత్తమ ఛాయాగ్రాహకులకు వ్యక్తిగత బహుమతులుంటాయని తెలిపారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందచేయబడతాయని తెలిపారు. బహుమతి ప్రదానం 3వ ప్రపంచ మహాసభలు, గుంటూరు వేదికపైన 2026 జనవరి 3వ తారీఖున జరుగుతుందని విజేతలయిన చిత్రాలు, ప్రదర్శనలకు అర్హమైన చిత్రాలను ప్రపంచ తెలుగు మహాసభలలో ప్రదర్శిస్తామని రెడ్డప్ప దవేజి, పి.రామచంద్రరావు తెలిపారు. ఫేస్‌బుక్, యూ ట్యూబ్‌లలో ఇతర సామాజిక మాధ్యమాలలో అప్‌లోడ్ చేసుకోవాలని ఆంధ్ర సారస్వత పరిషత్తుకు సర్వ హక్కులు ఉంటాయని, పోటీలో పాల్గొనే వారు నిర్వాహకులు ఇచ్చిన ఆన్‌లైన్ లింక్‌లో చిత్రాలను అప్‌లోడ్ చేయాలని, ఈ పోటీల కోసమే లఘు చలనచిత్రాలు నిర్మించబడి ఉండాలని కోరారు.

### స్వచ్ఛాంధ్రకార్యక్రమంకోసం

## నేడు తిరుపతికి సిఎం చంద్రబాబు

### - పర్యటనలో కంచికామకోటి మహామండపం సందర్శన

**తిరుపతి,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లా తిరుపతిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంతో బాటు పలు ముందుగా నిర్ణయించిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. స్వచ్ఛాంధ్రలో పాల్గొనేందుకు శనివారం ఉదయం తిరుపతికి చేరుకుంటున్న సిఎం రేణిగుంట తూకివాకం వద్ద నగరపాలకసంస్థ నిర్వహిస్తున్న ఘనవ్యర్థపదార్థాల కేంద్రం, తిరుపతి కపిలతీర్థంలో కపిలేశ్వరస్వామిని దర్శించుకుని ఇక్కడే స్వచ్ఛాంధ్ర ప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం అక్కడ నుండి ఎంఆర్‌పల్లిలోని ఏఆర్ పోలీసు మైదానంకు చేరుకుని ప్రజావేదిక నిర్వహిస్తారు. అనంతరం అలిపిరిలోని కంచికామకోటి పీఠం నిర్వహిస్తున్న మహామండపాన్ని సందర్శిస్తారు. ఇక్కడ మఠం వేదపండితుల నుండి ఆశీర్వచనం అందుకుంటారు. ఈ కార్యక్రమాలు అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని సాయంత్రం అమరావతికి తిరుగుప్రయాణ మవుతారు. ఇప్పటికే సిఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్ తిరుపతిలో ముఖ్యమంత్రి పర్యటనతో జిల్లా యంత్రాంగం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్ష వర్ధన్‌రాజు, నగరపాలక కమిషనర్ మౌర్య, టిటిడి జెఇఒ వీరబ్రహ్మంతో కలసి రెవెన్యూ, పోలీసు అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరుకానున్నారు. కాగా నగరంలో డ్రైనేజీవ్యవస్థపై, రోడ్లనిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# తిరుమల సమాచారం

## కపిలతీర్థం ఆలయం వద్ద హై సెక్యూరిటీ

### - సిఎం రాకతో టిటిడి పటిష్ట భద్రత



**తిరుమల,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి శనివారం ఉదయం తిరుపతికి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శైవాలయం కపిలతీర్థంలోని కపిలేశ్వరుని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా కపిల తీర్థం పుష్కరిణి, జలపాతం, ఆక్కడ భక్తుల లగేజీలను భద్రపరిచే కౌంటర్లు, పరిసరాలు, పార్కింగ్ విషయాలపై శుక్రవారం సాయంత్రం టిటిడి ఇఒ శ్యామలరావు, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎస్ఇలు మనోహర్, వెంకటేశ్వర్లు, విఎస్ఒ సురేంద్ర, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆరోగ్యశాఖ డిప్యూటీ ఇఒ సోమన్‌నారాయణతో కలసి తనిఖీ చేశారు. సిఎం పర్యటన వేళ భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, భక్తుల నియంత్రణ, స్వచ్ఛాంధ్ర ప్రతినిధులతో భేటీ కానుండటంతో పూర్తిగా సిఎం పర్యటన విజయవంతంచేయాలని ఇఒ కోరారు.

## అలిపిరి సమీపంలో జింకను చంపిన చిరుత

### - భయంతో వణుకుతున్న భద్రతా సిబ్బంది, భక్తులు

**తిరుమల,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం యాత్రికుల వాహనాల రాకపోకలతో, భక్తులతో సందడిసందడిగా ఉండే తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రానికి సమీపంలో చిరుతపులి జింకను చంపి తిన్న ఘటన శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. తనిఖీ కేంద్రం సిబ్బంది అటుగా అటవీప్రాంతంమార్గంలో వెళ్ళడంతో దీన్ని గమనించి భయంతో పరుగులుతీశారు. మొన్నటివరకు తిరుమలలో, కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్డులో సంచరించిన చిరుతపులి ఏకంగా తనిఖీ కేంద్రానికి పక్కనే జింకను చంపితిన్నట్లు కళేబరం గుర్తించడం భయం గొల్పుతోంది. తనిఖీ కేంద్రం వద్ద అన్ని వాహనాలు ఆపి తనిఖీ చేస్తారు. భక్తులు కూడా తనిఖీలు చేసుకొంటారు. అలిపిరి తనిఖీ కేంద్రం సమీపంలోనే చిరుతపులి జింకను చంపి తిని ఆ తరువాత పొట్టభాగం తినేసింది. భద్రత సిబ్బంది గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన అటవీశాఖ సిబ్బంది ఘటనాస్థలిని పరిశీలించారు. వెటర్నరీ కళాశాల ఆస్పత్రికి తరలించారు. జింకకు పోస్టుమార్టమ్ నిర్వహించినవైద్యులు చిరుతపులి, రేసు కుక్క దాడిచేసిందా అనేది తెలియాల్సి ఉంది. జింకపైదాడిచేసి చిరుతపులి చంపి తినేసిన ఘటన మాత్రం అందరినీ తిరుపతివాసులను భయపెడుతోంది.

## అందరికీ శ్రీవారి ఆశీస్సులుండాలి : ప్రముఖులు



**తిరుమల,జూలై 18ప్రభాత వార్తప్రతి నిధి:** కలియుగప్రత్యక్ష దైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, దేవుని దర్శనంతో ఆనందం కలిగిందని పలువురు ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం సెపథ్యా వాసన్ గ్రూప్ భెర్వాద్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ మహాకింగ్‌థియాన్, జాతీయ బిసి కమిషన్ ఛైర్‌పర్సన్ హన్సరాజ్ గంగారాం, నటి ప్రజ్ఞానయన్ వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. దేవుడ్ని దర్శించుకుంటే అన్నీ శుభాలు కలుగుతాయని వీరంతా విశ్వాసం వ్యక్తం చేశారు. వీరికి టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడి ఇఒ పేరుతో నకిలీ అకౌంట్

### భక్తులు స్పందించరాదని టిటిడి విజ్ఞప్తి

**తిరుమల,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక మాధ్యమాల ముసుగులో సైబర్ నేరస్థులు రోజురోజుకూ మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా టిటిడి కార్యనిర్వహణాధికారి(ఇఒ)పేరుతో ఫేస్‌బుక్‌లో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ ఖాతాను సృష్టించారు. భక్తులకు సందేశాలు పంపుతూ డబ్బులు కావాలని కోరుతున్నారని టిటిడి దృష్టికి శుక్రవారం రావడంతో ఇది పూర్తిగా మోసగాళ్ళపనిగా నకిలీ చర్యగా గుర్తించారు. దేశ, విదేశాల్లో ఉన్న భక్తులు ఇటువంటి నకిలీ ఖాతాలకు దూరంగా ఉండాలని, ఎవరికైనా ఇలాంటి సందేహాస్పద సందేశాలు వస్తే వెంటనే టిటిడి విజిలెన్స్ విభాగానికి సంబంధించిన సెల్‌ఫోన్‌నంబర్ 9866898630, టిటిడి టోల్‌ఫ్రీనంబర్ 18004254141కు ఫోన్‌చేసి సమాచారం తెలియజేయాలని టిటిడి కోరింది. భక్తులు టిటిడి అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు, తిరుమల. ఒఆర్‌జి లేదా సోషల్‌మీడియా అధికారిక ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని విజ్ఞప్తి చేసింది.

## శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖలో అత్యాధునిక వసతుల కల్పన : హోంమంత్రి అనిత



పోలీస్ శిక్షణా కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి వంగలపూడి అనిత,మంత్రి రవీంద్ర

**విజయవాడ,జూలై 18,ప్రభాతవార్తప్రతినిధి:** శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖలో అత్యాధునిక మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖామంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. రాష్ట్ర హోం మంత్రి, రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల శాసనసభ్యులు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఇతర ప్రజా ప్రతినిధులు, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు తదితరులతో కలిసి మచిలీపట్నం మండలం, కరగ్రహారం గ్రామంలో జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి శంకు స్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ ఎందరో మహానుభావులకు పుట్టినిల్లు, కళా సంస్కృతులకు నిలయమైన కృష్ణా జిల్లాలో పోలీసు శిక్షణ కేంద్రం ఏర్పాటులో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో మచిలీపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతంలో ఉన్న పూర్వ శిక్షణ కేంద్రం స్థలాన్ని మారిటైం బోర్డు తీసుకోవడం, దానికి ప్రతిఫలంగా వారు కరగ్రహారంలో కేటాయించిన 30 ఎకరాలకు ప్రభుత్వ సహకారంతో మిగిలిన భూమిని సేకరించి దాదాపు 46 ఎకరాలలో ఏర్పాటవుతున్న ఈ విధమైన పోలీస్ శిక్షణా కేంద్రం రాష్ట్రంలో ఎక్కడా లేదని పేర్కొంటూ ఈ కేంద్రాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్ర పునర్విభజన అనంతరం ఇప్పటివరకు రాష్ట్రంలో సరియైన పోలీసు శిక్షణ కేంద్రాలు లేవని, అందుకు 2014-19 టిడిపి ప్రభుత్వ హయంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, అయితే తర్వాతి ప్రభుత్వ నిర్లక్ష్యంతో అది ముందుకు సాగలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టిందన్నారు. పోలీసు వ్యవస్థను పటిష్టం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు, నేరాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టేందుకు డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి చర్యలతో నేరాలు ఘోరాలు జరగకుండా నిరంతర చర్యలు చేపడుతున్నామని, అందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకారం అందించాలని కోరారు. ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాలు అధికమైపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు ఈ కేంద్రంలో శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అదేవిధంగా మంత్రి కొల్లు రవీంద్ర అభ్యర్థన మేరకు ఈ ప్రాంతంలోని మెరైన్ పోలీసు స్టేషన్ను పునరుద్ధరిస్తామని మంత్రి తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రూ.32 కోట్ల వ్యయంతో 46 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం మచిలీపట్నం నగరానికి మణిహారమని పేర్కొన్నారు. శిక్షణ పొందేందుకు పురుషులు, మహిళలకు వేరువేరుగా ప్రత్యేక వసతులతో ఈ కేంద్రం రూపుదిద్దుకుంటుందన్నారు. అదేవిధంగా ఇదే ప్రాంతంలో ఎక్సైజ్ శాఖకు కూడా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యంగా అధికారులు పని చేయాలి

### కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్

**విజయవాడ, జూలై 18,ప్రభాత వార్తప్రతినిధి:** వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జాతీయ వెనుబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్ అన్నారు. ఒబిసి రిజర్వేషన్లు, రోస్టర్, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ వంటి అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిసిలకు చట్ట ప్రకారం కల్పించిన రిజర్వేషన్లను అమలు అలసత్వం తగదన్నారు. సిపెట్ సంస్థ కార్యకలాపాలు, ప్లాస్టిక్ కోర్సుల్లో ఇస్తున్న శిక్షణ, తదితర అంశాలను సీపెట్ డైరెక్టర్ శేఖర్ కమిషన్ చైర్మన్‌కు వివరించారు. యూనియన్ బ్యాంక్‌లో అమలవుతున్న ఒబిసి రిజర్వేషన్లు, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ తదితర విషయాలను బ్యాంక్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్ అందిస్తున్న సేవలు, పోస్టుల భర్తీ, అమలు చేస్తున్న రోస్టర్ విధానం తదితర వివరాలను సిఇఒ శాంతా సింగ్ చైర్మన్‌కు తెలియజేశారు. రాష్ట్రంలో 18 వైద్య కళాశాలలు ఉన్నాయని, వైద్య విద్యా సీట్ల కేటాయింపులో ఒబిసి రిజర్వేషన్ల వివరాలను, రోస్టర్ విధానం తదితర అంశాలను చైర్మన్‌కు వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అంతకు ముందు చైర్మన్‌కు స్వాగతం పలికారు. అధికారులు క్రమశిక్షణ, నిబద్ధతతో వెనుకబడిన తరగతుల అభ్యున్నతి లక్ష్యంగా పనిచేయాల్సి ఉంది.

## గంజాయిని నిర్మూలించేందుకు సాగును సమూలంగా నాశనం చేశాం: విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

### యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి ; సినీ నటుడు సుమన్




**బొబ్బిలి (విజయనగరం జిల్లా) జులై 18 ప్రభాతవార్త** మాదక ద్రవ్యాలను నియంత్రించాలనే లక్ష్యంతో గంజాయి పంటను సాగు చేయకుండా చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. ఈ క్రమంలో గంజాయి సాగును సమూలంగా నాశనం చేస్తున్నామని ఆయనన్నారు. పోలీసు శాఖ బొబ్బిలిలో శుక్రవారం నిర్వహించిన "సంకల్పం" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరి శిఖర ప్రాంతాల్లో 15,000 ఎకరాల్లో గంజాయి పంటను సాగు చేస్తున్నట్లుగా డ్రోన్స్ సహాయంతో గుర్తించి, పంటను ధ్వంసం చేసామన్నారు. పోలీసుశాఖ చేపడుతున్న నియంత్రణ చర్యల ఫలితంగా నేడు 93 ఎకరాలకే గంజాయి సాగును పరిమితమైందన్నారు. గంజాయి వ్యాపారాలు చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు చేపడుతున్నామని, వారు సంపాదించిన అక్రమ ఆస్తులను కూడా సీజ్ చేసి, ప్రభుత్వ పరం చేస్తున్నామన్నారు. విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి వ్యాపారాలతో అక్రమ ఆస్తులను కూడబెట్టిన 8 మంది నిందితులకు చెందిన 9.20 కోట్ల ఆస్తులను ఇప్పటి వరకు సీజ్ చేసామన్నారు. మాదక ద్రవ్యాల అలవాటుకు యువత దూరంగా ఉండాలని, బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని డిఐజి గోపీనాథ్ జట్టి యువతను కోరారు. సినీ హీరో సుమన్ మాట్లాడుతూ తాను సినిమాల్లో మంచి స్థితిలో ఉన్నపుడు తన తలరాత కారణంగా జీవితంలో అగాధంలో కూరుకొనిపోయానన్నారు. ఆ సమయంలో తాను కూడా మద్యానికి అలవాటుపడి, ఒక దశలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనుకున్నానన్నారు. మెల్లగా చెడు అలవాట్లు నుండి బయటపడి, అభిమానుల ఆశీస్సులతో మంచి నటుడిగా నిలదొక్కుకోగలిగానన్నారు. వ్యసనాలకు బానిసలైతే కుటుంబ సభ్యులకు భారంగా మిగులుతామన్నారు. తోటి స్నేహితుల ఒత్తిడి, ప్రోత్సాహాలకు లొంగిపోకుండా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, జిల్లా పోలీసులు చేపడుతున్న సంకల్పం కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు.

## రాష్ట్రంలో రూ.27,651 కోట్ల రెవిన్యూ లోటు: కాగ్

**విజయవాడ,జూలై 18,ప్రభాత వార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి 3 నెలల్లో రూ.27,691 కోట్ల మేర రెవిన్యూ లోటు ఏర్పడింది. పన్నుల రాబడి రూ.33,505 కోట్లు ఉండగా మొత్తం రెవిన్యూ రాబడి రూ.36,239.37 కోట్లుగా ఉంది. కంప్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విభాగం తొఇలి మూడు నెలల లెక్కలను ఖరారు చేఉసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లో రూ.37,093 కోట్ల రుణం సమీకరించింది. ఏడాది మొత్తానికి రూ. 79,926. 89 కోట్ల అప్పులు అవసరమవుతాయని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. తొలి మూడు నెలల్లోనే 46% మేర రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. మరో వైపు రూ.40,635.72 కోట్లు మూలధన వ్యయంగా వెచ్చించాలని అంచనా వేసు కున్నారు.

## అటవీశాఖలోని బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 7న స్క్రీనింగ్ పరీక్ష

**విజయవాడ,జూలై 18,ప్రభాత వార్త ప్రతినిధి:** అటవీశాఖలోని బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 7న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎపిపిఎస్‌సి కమిషన్ కార్యదర్శి పి రాజబాబుఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటవీశాఖలో ఖాళీగా ఉన్న 256 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 435 అసిస్టెంట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 14న నోటిఫికేషన్ విడుదలైంది. సెప్టెంబర్ 7 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహిస్తారు.

వార్త

ఏ రచయితా ప్రపంచాన్ని చిత్రీకరించలేడు.
ప్రతి రచయిత మీద ఒక్కో ప్రభావం ఉంటుంది.

-కోనార్ట్

# ఉచితానుచితాలు

ఎన్నికలు ఎప్పుడైనా వాటి పర్యవసానాలు ఎలావున్నా పోలింగ్ నాటికి ముందు ఆరేడునెలలు అధికార పార్టీ టక్కుటమార గోకర్ణ విద్యలు, విన్యాసాలూ సర్వసాధారణం. ఉన్నట్టుండి ప్రజా ప్రయోజనాల మీద ప్రేమ పుట్టుకురావడం చాలా విచిత్రంగా అనిపిస్తుంది. ఇప్పుడు బీహార్‌లో అదే తంతు జరుగుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రజల్ని ఆకట్టుకోవడానికి ఇలాంటి ప్రత్యామ్నాయ ప్రయోజనాలను 'ఎర' వేస్తూనే ఉంటారు. ఇంతవరకు కనిపించని ప్రయోజనాలను ఇకపై అధికార పార్టీ కల్పిస్తుందంటే ప్రజల్లో ఒక విధమైన అనుమానాలు రాకపోవు. కానీ ఎవరి ప్రయత్నాలు వారుచేస్తుంటారు. నిజానికి ఉచితాలను ఉచితానుచితాలు మరచిపోయి ప్రకటించేస్తుండడం రాజకీయ పార్టీల వంతు. వాటి సాధ్యాసాధ్యాల సంగతి దేవుడెరుగు. ఎవరు ఎలాంటి ప్రయోజనం కల్పించినా స్వాగతించాల్సిందే. జనం కోసం కొండమీద కోతిని తీసుకురాలేం. అయినా ఏమో గుర్రం ఎగురావచ్చు! అనే ధోరణిలో ప్రజాహృదయాలను చూరగొనే క్రమంలో ఎలాంటి వాగ్దానాలనైనా చేయడానికి ముందుకు వస్తున్నారు. గతంలో మేనిఫెస్టోలో చెప్పిన అంశాలకు పవిత్రత ఉండేది. చెప్పిన విషయాలకు చేసిన వాగ్దానాలకు కట్టుబడి ఉండాలన్న నిబద్ధత ఉండేది. ఇప్పుడా నిబద్ధత ఏదీ లేదు. ఏ పార్టీకి ఆపార్టీ వారికి నోటికొచ్చిన హామీలిచ్చేయడం, ఆ తదుపరి వాటిని గాలికి వదిలేయడం మామూలైపోయింది. మేనిఫెస్టోలను తప్పని సరిగా అమలు చేయాలన్న చట్టమేదీ లేనందున ఎన్నికల ప్రణాళిక గురించి పెద్దపట్టింపేమీ ఉండదు. విచక్షణ ఉండదు. సాధ్యాసాధ్యాల పరిశీలన ఉండదు. చేస్తే చేసినట్లు, చేయకుంటే చేయనట్లు. ఈ మధ్యకాలంలో మేనిఫెస్టోలు తయారు చేసేలోగానే ఎన్నికల ర్యాలీల్లోనే 'వరాల జల్లు' కురిపించేస్తున్నారు. బీహార్‌లో ప్రధాని నరేంద్రమోడీ శుక్రవారం ప్రజల్నికలిసేందుకు వచ్చారు. రోడ్డుకిరువైపులా ఉన్న జనాన్ని పలుకరించారు. వారిచ్చిన శుభస్వాగతానికి బదులుగా వారిపై అభినందనల వర్షం కురిపించారు. వస్తూ వస్తూనే బీహార్ పర్యటనలో ప్రధాని మోతీహార్‌లో రూ. 7200 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. నాలుగు అమృత్ భారత్ రైళ్లను బీహార్ రాష్ట్ర ప్రయాణికుల సౌకర్యార్థం నడపనున్నట్లు ప్రకటించారు. పాట్నాలో ఎస్‌టిపిఐ అత్యాధునిక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దర్భాంగాలో న్యూ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల రీత్యా బీహార్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు భారీ ఎత్తున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధమయ్యాయని ఈ బీహార్ సమాచారం వెల్లడిస్తోంది. ఓటర్లను ఆకట్టుకోవడం ఒక ఎత్తయితే చేతికందని ఓటర్ల ఓట్లను ఏదో ఓ సాకుతో రద్దు చేసే ప్రక్రియ మరొకటి. 'ఎలక్షన్ ఆర్ ఎలిమినేషన్' విధానాన్ని ఈమధ్యకాలంలో ఎన్నో రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. ఇప్పుడు బీహార్ అదేబాటలో వెళ్తోందని తాజాగా ఎన్నికల కమిషన్ నిర్ణయాలు తేటతెల్లం చేస్తున్నాయి. దాని మీద నిరసనలు వ్యక్తమవడం ఉన్నత స్థాయి ధర్మాసనాలు జోక్యం చేసుకున్నాయికూడా. ఓటర్లను భయపెట్టి వారిలో నిరుత్సాహం కలుగచేసేప్రయత్నాలకు కోర్టులు అడ్డుపడ్డాయి. ఇక ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాల్లో రాజకీయ పార్టీలన్నీ అందెవేసిన చెయ్యే. అధికారంలో ఉన్న వాటికి ఇలాంటి పథకాల రూపకల్పన కాస్తవీలు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ప్రధాని బీహార్ వచ్చేలోపలనే కొంతమేరకు వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు 125 యూనిట్‌లు వాడకం వరకు ఉచితమని ప్రకటించారు. అక్టోబరులో కానీ నవంబరులో కానీ బీహార్ ఎన్నికలు జరుగుతాయి. ఈ ఆగస్టు 1 నుంచి 'చౌకధరకే విద్యుత్ పథకం కింద విద్యుత్తు,ఫ్రీ, గృహవినియోగదారులు 125 యూనిట్ల వరకు ఎలాంటి బిల్లు చెల్లించనవసరం లేదు. ఆ రాష్ట్రంలోని 1కోటి 67లక్షల కుటుంబాలకు ఈ ప్రయోజనం కలుగుతుంది. సౌరగృహ విద్యుత్తు కూడా ఉచితంగా ఇంటిపైకప్పుల మీద ఏర్పాటు చేస్తారు. కుటీర్‌జ్యోతి పథకం కింద అత్యంత పేద కుటుంబాలకు సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మెగా ప్లాన్ ఉంటుందని వాటిలో ప్రత్యేకించి మహిళలకు 35శాతం నియామకాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు బీహార్ ముఖ్యమంత్రి ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో 10 మిలియన్ ఉద్యోగాల హామీ, వృద్ధులకు 400 నుంచి 1100 వరకు పెన్షన్ పెంపు, విద్యార్థులకు 4 వేల నుంచి 6వేలవరకు నగదు ప్రోత్సాహకాలు ఇంతవరకు నితీష్ ప్రభుత్వం ఇవ్వగల కానుకలు. దేశవ్యాప్తంగా పేదరికం తగ్గిందని అంచనాలు వేసుకుంటున్న తరుణంలో బీహార్ పేదరికం రేటు బాగా తగ్గినట్లు నీతి ఆయోగ్ 2023నివేదిక చెబుతోంది. గ్రామీణప్రాంతాల్లో పేదరికం లెక్కలు పరిశీలిస్తే 56 శాతం నుంచి 36.95 శాతానికి తగ్గింది. మొత్తానికి బీహార్‌లో 2.25 కోట్లమంది ప్రజానీకం పేదరికం నుంచి బయటకు వచ్చేసినట్లు. వారి జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయని అంచనా. బహుముఖ పేదరికమున్న రాష్ట్రాలలో బీహార్, జార్ఖండ్ ప్రధానం. వీటిలో తక్కువ తలసరి ఆదాయం, మౌలిక సదుపాయాలలోటు సామాజిక సవాళ్లు ఇప్పటికే ఎదుర్కొంటున్న అత్యంత పేద రాష్ట్రం బీహారే. ఇది అతి తక్కువ పారిశ్రామికీకరణ, ఎక్కువస్థాయిలో నిరక్షరాస్యత ఉన్న రాష్ట్రం బీహార్. పార్టీలు ప్రకటించే పథకాలు పేదరికాన్ని ఏమాత్రం తగ్గిస్తాయో ఎంతవరకు మేలు చేస్తాయో తెలియదు కానీ రేపొచ్చే ఎన్నికలు ఎన్డీయే ప్రభుత్వానికి మరో అవకాశం ఇస్తాయో! లేదో రాజకీయ ఔత్సాహికులకెవరికైనా దారిస్తాయో తెలుస్తాయి.

# 'ర్యాగింగ్' రాక్షస క్రీడను నిరోధించలేమా?

*ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డలు తమకళ్లముందే చదువు సంస్కారం ఉందనుకున్న కొందరు వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? అది ఎప్పటికైనా తీరుతుందా? ఇప్పటికైనా పాలకపెద్దలు ఆలోచించాలి. అలాగే దోషులపై నిర్దిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ఇలా వేధించి ర్యాగింగ్‌కు పాల్పడేవారికి ప్రోత్సహించేవారికి తిరుగులేని హెచ్చరికలను అందించగలుగుతాం. ఈ ర్యాగింగ్ భూతాన్ని కొంతవరకైనా నియంత్రించగలుగుతాం. ఆ దృఢసంకల్పం లేనప్పుడు అన్ని చట్టాలు, కమిటీలు, విచారణలు అన్ని నిష్ప్రయోజనమే. పాలకుల చేతకాని తనానికి అమాయక విద్యార్థులు ఇలాగే బలైపోతూనే ఉంటారు.*

దామెర్ల సాయిబాబ

ఎన్ని చట్టాలు చేసినా, కఠిన చర్యలు తప్పవని ఎందరు నేతలు హెచ్చరించినా ర్యాగింగ్ రక్కసి దేశాన్ని వదిలిపెట్టడం లేదు. వికృతరూపం దాల్చింది. ఈ ర్యాగింగ్‌కు ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. వీటిలో కొన్ని మాత్రమే వెలుగు చూస్తున్నాయి. తమకు జరిగిన అవమానాలు భరించలేక, బయటకు చెప్పుకోలేక వారిలో వారు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంతకాలంగా ఇంతగా కొనసాగుతున్న ర్యాగింగ్ కారకులపై ప్రభుత్వాలు పురనావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నాయి. చట్టాలకు సామాన్యులు లోకువైతే సమర్థులకు చట్టాలు లోకువఅన్నట్టు నిందితులు ఏదోరకంగా బయటపడుతున్నారు. అందులోనూ నిందితుల్లో అధికశాతం రాజకీయ అండదండలు, లక్ష్మీప్రసన్నుల పుత్రులు కావడంతో అధికారులు వారి జోలికి వెళ్లడానికి వెనుకాడుతున్నారనే ఆరోపణలకు జరుగుతున్న సంఘటనలు అద్దంపడుతున్నాయి. దీంతో ఏంచేసినా, ఎన్ని హెచ్చరికలు చేసినా భయం లేకుండా నిరాటంకంగా కొనసాగుతున్నది. దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యంతో విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ఈ ర్యాగింగ్ ద్వారా అగమ్యగోచరం కాకుండా నిరోధించేందుకు దేశంలోని అనేక రాష్ట్రాలు స్పష్టమైన చట్టాలు చేశాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ విశ్వవిద్యాలయాల్లో నిధుల సంఘం (యుజిసి)ఎంతో కఠినమైన మార్గదర్శకాలు కూడా రూపొందించింది. అయినా ఏమాత్రం మార్పురాకపోగా యేడాదియేడాదికి పెరిగిపోతున్నాయి. ర్యాగింగ్ 2019-2021 మధ్యకాలంలో యుజిసికి అందిన ఫిర్యాదులు తగ్గినట్లు కన్పించినా చట్టం, యుజిసి నిబంధనలు కారణం కాదు. అది కేవలం కోవిడ్ ప్రభావంతో తగ్గినట్లు కచ్చితంగా చెప్పొచ్చు. కోవిడ్ శాంతించిన తర్వాత మళ్లీ 2022 నుంచి ర్యాగింగ్ విస్తరించడం ప్రారంభించింది. 2022లో యుజిసికి 1094 ఫిర్యాదులు అందగా, 2023లో ఆసంఖ్య 1240కి పెరిగింది. ఆ తర్వాత సంవత్సరం అది ఏకంగా నలభైఐదు శాతానికి పెరిగినట్లు యుజిసి గణాంకాలే చెబుతున్నాయి. ఇప్పటివరకు దాదాపు మూడు వేల రెండువందలకుపైగా ఫిర్యాదులు ర్యాగింగ్ నిరోధక కమిటీలకు అందాయి. ఇక సీనియర్ విద్యార్థులే కాదు కాలేజీల్లో జూనియర్లకు రక్షణ కవచంగా ఉండాల్సినకొందరు అధ్యాపకులు, సిబ్బందే కంచె చేను మేసినట్లుగా వ్యవహరించడం దురదృష్టకరం. మొన్న ఒడిశాలోని బాలాసోర్‌లోఉన్న ఫకీర్‌మోహన్ కాలేజీలో విద్యావిభాగం అధిపతి వేధింపులు తట్టుకోలేక ఒక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. తనకు జరుగుతున్న వేధింపులను ఆమె కాలేజీ కమిటీకి పలుమార్లు ఫిర్యాదు చేసింది. అయినా ఆ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోకపోవడంతో నేరుగా కాలేజీ క్యాంపస్‌కు వెళ్లిన ఆ విద్యార్థిని ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకున్నది. బాధితురాలిని భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఆ యువతి మృతిచెందినతర్వాత యుజిసి స్పందించి వాస్తవాలను బయటకు తీసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇక ఈ సంఘటన మరువకముందే కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా మూడబిదరలో ఒక విద్యార్థినిపై ఇద్దరు లెక్చరర్లు, వారి మిత్రుడు వేధింపులకు గురి చేసి అత్యాచారానికి పాల్పడ్డారు. ఒక ప్రముఖ కళాశాలలో లెక్చ రర్‌గా పనిచేస్తున్న ప్రబుద్ధుడు ఆ విద్యార్థినిని బెదరించి మాయమాటలతో నమ్మించి లైంగిక వేధింపులకుగురిచేశారు. ఆ తర్వాత ఫొటోలున్నాయని బెదరిస్తూ మరొక లెక్చరర్ ఆమెపై లైంగిక దాడిచేశారు. ఆ తర్వాత వారి మిత్రుడు. ఈ ముగ్గురి వేధింపులు రానురాను పెరిగి

ఒక్క మాట

పోవడం భరించలేక తల్లిదండ్రులకు ఆ యువతి తెలిపింది. తల్లిదండ్రులు మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇలా విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే వేధింపులకు గురి చేస్తున్న సంఘటనలు తరుచుగా చోటు చేసుకొంటున్నాయి. చాలావరకు వెలుగు చూడడం లేదు. అటు కుటుంబ గౌరవం, ఇటు చదువుకు అటకం కలుగుతుందేమోననే భయం, వీటన్నంటికి మించి పోలీసులు వేసే సవాలక్ష ప్రశ్నలకు జవాబు చెప్పడంలాంటి ఇబ్బందులతో వారిలో వారు కుమిలిపోతున్నారే తప్పపెదవి విప్పలేకపోతున్నారు. అలాంటి విద్యార్థిని ఇటీవల ఒక లేఖ రాసి తనువు చాలించింది. 'నేను చదువుతున్న కాలేజీలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనొచ్చు. వారే నీచంగా ప్రవర్తిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలి? నాలాగే ఇక్కడ చాలా మంది అమ్మాయిలు ఈ వేధింపులు భరించలేక బాధపడుతున్నారు. మాలో ఎవరో ఒకరు చనిపోతేనే తప్ప ఈ దురాగతాలు బయట ప్రపంచానికి తెలుస్తుంది. అందుకే నేను ఈ పనిచేస్తున్న' అంటూ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో ఒక విద్యార్థిని ప్రాణం తీసుకుంది. ర్యాగింగ్ నిరోధక నిబంధనలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ యుజిసి ప్రతి యేడాది ఎన్నో కాలేజీలకు నోటీసులు ఇస్తూనే ఉంది. ఇటీవల యుజిసి పద్దెనిమిది కాలేజీలకు నోటీసులు ఇచ్చింది. ర్యాగింగ్ అనండి, వేధింపులు అనండి వీటి కారణంగా ఎందరో మెరికల్లాంటి విద్యార్థుల భవిష్యత్ అర్థాంతరంగా ముగిసిపోతున్నది. ఈ ర్యాగింగ్ గతంలో ప్రొఫెషనల్ కాలేజీల్లో మాత్రమే ఉండేది. ఇప్పుడు ఇంటర్మీడియేట్ కాలేజీలకు కూడా విస్తరించింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సెకండరీ విద్యను పూర్తి చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకొని కాలేజీల్లోకి అడుగుపెట్టిన విద్యార్థులకు బెరకు, భయం పోగొట్టడానికి చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. 19వ శతాబ్దంలో ప్రారంభ దశలో అంతవరకే పరిమితమైనా అది శృతిమించి కొందరి విద్యార్థులకు ప్రాణాంతక వికృత క్రీడగా మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా చేస్తున్న ఈ ర్యాగింగ్‌ను లేత మనసులు తట్టుకోలేకపోతున్నాయి. అశ్లీల సాహిత్యం, నీలి చిత్రాలు, ప్రధానంగా మత్తు పదార్థాలు, ఇతర బలహీనతలు తోడు కావడంతో ఎంతో మంది విద్యార్థులు బలైపోయారు. అకారణంగా మెరికల్లాంటి పిల్లలను కోల్పోయిన ఆ కుటుంబాల గర్భశోకం ఎలా తీరుతుందో పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. ఇక ర్యాగింగ్‌కు భయపడి మరెందరో విద్యార్థులు విద్యాభ్యాసానికే స్వస్తి చెప్పున్న సంఘటనలు చాలా ఉన్నాయి. పాలకులు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. ఈ విషసంస్కృతిని నిరోధించేందుకు ఎన్నో చట్టాలు, నిబంధనలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1997 మార్చి పద్దెనిమిదిన రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం ప్రకారం ఎన్నో కఠినశిక్షలు రూపొందించారు. మరణానికి కారకులైన, ఆత్మహత్యకు ప్రేరేపించినా జీవితకాలం పాటు కానీ పదేళ్ల జైలు శిక్ష విధించే విధంగా చట్టాన్ని రూపొందించారు. అన్నింటి కంటే మించి ర్యాగింగ్ చేసిన విద్యార్థులను ఆయా విద్యా సంస్థల నుంచి తొలగించడమేకాక వారిని ఎక్కడా చేర్చుకోరాదని చట్టంలోచేర్చారు. చట్టాలు చేశారు కానీ దాన్ని త్రికరణశుద్ధిగా అమలు చేసే మనసు పాలకులకు లేకుండాపోయింది. దేశవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి. ఇప్పటివరకు ఒక్కకేసులో కూడా తిరుగులేని సాక్ష్యాలు సేకరించి న్యాయస్థానాల ముందు రుజువు చేసేందుకు తీసుకున్న చర్యలు లేవనే చెప్పొచ్చు. పొరుగునున్న తమిళనాడులో జరిగిన సంఘటనలో ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో తీసుకున్న చర్యలు అక్కడ ర్యాగింగ్ భూతం చాలావరకు తగ్గిందనే చెప్పొచ్చు. ర్యాగింగ్ శృతిమించి జూనియర్ వ్యతిరేకించడంతో హత్యకు దారితీసింది. పకడ్బందీ సాక్ష్యాలతో అక్కడి యంత్రాంగం నిందితుడిని న్యాయస్థానం ముందు నిలబెట్టింది. చదువుకొని గొప్ప వైద్యుడిగా పేరు ప్రతిష్టలు సంపాదించి పెడతారని కుమారుడిపై ఆశలు పెంచుకున్న ఆ తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని నిందితునికి మరణశిక్ష వేయడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానిస్తూ ఇరవైఎనిమిది సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష విధించారు. ఇది తమిళనాడులోని విద్యార్థిలోకంలో భయాన్ని నెలకొల్పింది. ప్రాణ సమానంగా పెంచుకున్న తమ బిడ్డలు తమకళ్లముందే చదువుసంస్కారం ఉందనుకున్న కొందరు వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? అదిఎప్పటికైనా తీరుతుందా? ఇప్పటికైనా పాలక పెద్దలు ఆలోచించాలి. అలాగే దోషులపై నిర్దిష్టమైన చర్యలు తీసు కోగలిగితే ఇలా వేధించి ర్యాగింగ్‌కు పాల్పడేవారికి ప్రోత్సహించేవారికి తిరుగులేని హెచ్చరికలను అందించగ లుగుతాం. ఈ ర్యాగింగ్ భూతాన్ని కొంతవరకైనా నియంత్రించగలుగుతాం. ఆ దృఢ సంకల్పం లేనప్పుడు ఎన్ని చట్టాలు, కమిటీలు, విచారణలు అన్ని నిష్ప్రయోజ నమే. పాలకుల చేతకాని తనానికి అమాయక విద్యార్థులు ఇలాగే బలైపోతూనే ఉంటారు. ●

మీరు గౌరవాన్ని కోరుకుంటే, ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్ జాన్సన్

సరికానప్పుడు అంతా సరిగ్గా ఉందన్న పిచ్చిభావనను నిభాయించుకుంటూ ఉండడాన్నే ఆశావాదం అంటారు.



వోల్టేర్

## ప్రజావాక్కు



### మండుతున్న కూరగాయల ధరలు

రాష్ట్రంలో కూరగాయలధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వీని ధరలు విపరీతంగా పెరిగాయి. వర్షాకాలం వచ్చినప్పటికీ వర్షాలు లేకపోవడంతో పంట దిగుబడిపై తీవ్రంగా ప్రభావం పడుతుంది. పలుప్రాంతాలలో కిలో పచ్చిమిర్చి రూ.100, బీన్స్‌రూ.90, చిక్కుడు రూ.50, క్యాప్సికం రూ.75, టమాట రూ. 45, 50, బెండకాయ కేజీ రూ. 45గా ఉన్నాయి. వారానికి సరిపడా 500 రూపాయలు పెట్టి కూరగాయలు కొనుగోలు చేసేవారు ధరలు విపరీతంగా పెరగడంతో కూరగాయలు ఎలా కొనుగోలు చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం పైన తప్పకుండా చర్యలు చేపట్టాలని కూరగాయల ధరలను దించాలని అంటున్నారు. లేకపోతే సామాన్య మానవులపై అధికంగా ప్రభావం పడుతుందని వారు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### నీటి సమస్యను అధిగమించాలి

తెలంగాణలో మళ్ళీ నీటి సమస్యలు ముంచుకొస్తున్నాయి. దానికి రుజువు ఏమిటి హెచ్‌ఎండీఏ పరిధిలో పోయిన సంవత్సరం 63వేల ట్యాంకర్‌లు బుక్‌చేస్తే అది 83 వేలకు చేరింది. అంటే అర్థం ఏమిటి గ్రౌండ్ వాటర్ పడిపోతుంది అనిఅర్థం. తెలంగాణలో గతప్రభుత్వపాలనలో చెక్ డ్యాంలు నిర్మించడం చెరువుల పూడికతీత వల్ల పెరిగిన గ్రౌండ్ వాటర్‌ని ఇప్పుడు ఉపయోగించుకుంటున్నాం. మరి మళ్ళీ గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ చేయడానికి ప్రయత్నం జరుగుతుందంటే లేదు అని సమాధానం వస్తుంది. దేశంలో ఎక్కడ లేని విధంగా ఫీడర్ ఛానెల్స్ చెక్ డ్యాంలుఇక్కడే ఉన్నాయి.

-భారత అవినాష్, జనగామ

### కొత్తవి కొనుగోలు చేయాలి

భారత ప్రభుత్వంలో ప్రస్తుతం ఉపయోగిస్తున్న వాడుకలో ఉన్న ప్రభుత్వ బస్‌లు,ట్రైన్‌లు, ఓడలు, విమానాలు, హెలికాప్టర్‌లు ఇతరపురాతన ప్రభుత్వ వాహనాల స్థానంలో కొత్త వాటిని ప్రవేశపెట్టాలి. పాతవాహనాల వినియోగం వల్ల అనుకోని విధంగా ప్రమాదాలు జరిగేఅవకాశం ఉంటుంది. కావున ప్రభుత్వం పాత వాహనాల స్థానంలో కొత్తవి ప్రవేశ పెట్టాలి.

-డి చాంద్ బాషా, కర్నూలు

### ఒత్తిడి లేని చదువులు కల్పించాలి

ఇటీవల ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల పెరుగుదల సామాన్య ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అనూహ్యంగా వేలల్లో ఫీజులు పెంచుతున్నస్కూళ్లు, కాలేజీలు మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఒక విద్యార్థికి ఒక్కో సంవత్సరానికి వచ్చే మొత్తం ఖర్చులక్షల రూపాయలను దాటి పోతోంది. ఇంతటితో ఆగకుండా, కంప్యూటర్‌కోర్సులు, పుస్తకాలు, యూనిఫార్ములు, బ్యాగులు కూడా తమ వద్దే కొనాలని బలవంతం చేస్తుండటం మరో ఆందోళనకరమైన విషయం. తల్లిదండ్రులకు ఎంపిక స్వేచ్ఛలేకుండా స్కూల్ యాజమాన్యం వారిషరత్తులను ఒప్పించడమే తప్ప వేరేమీ చేయడంలేదు. ఇది విద్యను వ్యాపారంగా మలచడమేకాకుండావిద్యార్థులమీద ఆర్థికఒత్తిడిని పెంచుతోంది. ఇలాంటి దుస్థితిలో ప్రభుత్వ జోక్యం అత్యంత అవసరం. తక్షణమే ఫీజుల నియంత్రణ కోసం కఠినమైన నిబంధనలను రూపొందించాలి. కనీస సదుపాయాలు లేని, భద్రతా చర్యలు లేని విద్యా సంస్థల అనుమతులను వెంటనే రద్దు చేయాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సాంకేతిక రంగంలో నాలుగోస్థానం

పద్దెనిమిది రోజులు అంతరిక్షంలో అనేక ప్రయోగాలు చేసి కొత్తి మీరనుపెంచి అవనికి అతనిసహచరులతో సహా క్షేమంగా తిరిగి వచ్చిన శుభాన్షు శుక్లా అభినందనీయుడు. ఈ యాత్ర ముందు ముందు మరిన్ని అంతరిక్షయాత్రలకు దారి సుగమం కాగలదని ఇస్రోఆకాంక్షిస్తోంది. 1984లో భారత ప్రథమ వ్యోమగామి రాకేష్‌శర్మ తరువాత ఈ అరుదైన అంతరిక్ష యాత్రకు నాలుగు దశాబ్దాల కాలం పట్టడం ఆశ్చర్యంగా ఉంది. సాంకేతిక స్వారీలో మన దేశం ఇంకా వెనుకపడి ఉందా అనిపిస్తోంది. అయినా అమెరికా, రష్యా, చైనా తరువాత నాలుగవ స్థానం భారత్‌దే అని పాలకులు టెక్నికల్ పండితులు అంటున్నారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### బిసి బిల్లు ప్రవేశపెట్టాలి

వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో కేంద్రం ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు, విద్యా, ఉద్యోగ, ఉపాది, ఆర్థిక, రాజకీయ,పారిశ్రామిక, ప్రైవేట్‌రంగంలో కూడా చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్‌లనుకల్పించాలి. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయాలి.

-బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

# నవ భారత నిర్మాణానికి యువతే కీలకం


జి.అజయ్ కుమార్

భారతదేశ జనాభాలో సుమారుగా 60 శాతం మంది యువతే ఉన్నారు. వాళ్లు ఈ ప్రపంచానికి తమ శక్తిని చాటుతున్నారు. ఐటీ రంగం, స్టార్టప్‌లు, పరిశోధన, అంతరిక్ష విజ్ఞానం, ఆర్మీ వంటి రంగాల్లో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కానీ ఇదే యువత రాజకీయాల్లో మాత్రం తీవ్రంగా వెనుకబడిపోతున్నారు. ఇది కేవలం వ్యక్తిగత వెనుకడుగు కాదు, ప్రజాస్వామ్య పరంగా అత్యంత ఆందోళన కలిగించే పరిస్థితి. వాళ్లు ఓటు వేస్తున్నారు, సోషల్ మీడియాలో రాజకీయం గురించి చురుగ్గా చర్చిస్తున్నారు. గ్రామాలలో రచ్చబండల దగ్గర రాజకీయల గురించి రాజకీయ నాయకుల గురించి చర్చలు, వాదనలు జరుపుతారు కానీ పాలనా వ్యవస్థలోకి అడుగుపెట్టే యువత మాత్రం చాలా తక్కువగా ఉన్నారు. ఇలా ఎందుకు జరుగుతోంది? దీని వెనుక ఉన్న కారణాలేంటి 'రాజకీయాలు మురికి కూపం', అనే భావనలు యువతను వెనక్కిలాగుతున్నాయి. చాలా పార్టీల్లో కుటుంబ వారసత్వాలే ఆధిపత్యం చూపుతున్నాయి. సామాన్య యువతకు అవకాశాలు లేకుండాపోయాయి. నైపుణ్యం, నీతికిస్థానమే లేకుండా డబ్బు, కులతత్వమే నిర్ణాయకంగా మారిన రాజకీయ సమీకరణలు యువతలో భరోసా తగ్గిస్తున్నాయి. ఎన్నికల సమయంలో లిక్కర్, నగదు వంటి ప్రలోభాలకు ఓటర్లు లొంగిపోవడం, నిజాయితీగల యువతకు నిరాశకలిగిస్తోంది. పాఠశాలస్థాయిలోనే రాజకీయ అవగాహన, చట్టాలపై పరిజ్ఞానం కలిగించాల్సిన అవసరం ఉంది. ప్రత్యక్ష రాజకీయ కార్యకలాపాల్లో పాలొనకపోయినా, సోషల్ మీడియాలో ప్రశ్నించడానికి, ప్రచారానికి యువత పరిమితమవుతోంది. రేపటి భవిష్యత్తు అంతా యువతదే అలాంటి యువతకు ఏం కావాలి, వారి అభివృద్ధికి దిశా నిర్దేశం చేయాలంటే చదువుకున్న విచక్షణ విలువలతో కూడిన యువత తప్పకుండా రాజకీయాలలోకి రావాలి. రాజ్యాధికారంలో వుండాలి ఉపాధి, వ్యవసాయం, విద్య, టెక్నాలజీ వంటి అంశాలు యువతకు నిత్య సంబంధితమైనవి. పాత తరం నాయకత్వం వేగం లేక, ప్రజల సమస్యల పట్ల అవగాహన లేక అభివృద్ధి దూరమవుతుంది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధం, పారదర్శకత, టెక్నాలజీ వాడకాన్ని యువత బాగా నేర్చుకుంది. అవినీతికి వ్యతిరేకంగా పోరాడేతత్వం, క్రియాశీలత యువతలో సహజంగా ఉంది. నూతన పాలనా శైలి - ప్రజలకు చేరువైన, డిజిటల్ ఆధారిత పాలన అవసరం ఉంది. ఇది యువత చేతిలో సాధ్యమవుతుంది. రాజకీయాల్లో పాల్గొనడం యువత బాధ్యతగా భావించాలి. దేశ భవిష్యత్తు గురించి యువత ఆలోచించాలి అంటే రాజకీయాలలో గళమెత్తాలి. శాసనసభలు, లోక్‌సభల్లో యువత శాతం చాలా తక్కువగా ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం. నిజానికి నేటి యువతే రేపటి నాయకులు. వాళ్లుమౌనంగా ఉంటే ఈ దేశ పాలనా విధానం మారదు. ఓటును చక్కగా వినియోగించాలి. డబ్బు, కులం ఆధారంగా కాదు, అభ్యర్థి పనితీరు, నైతికత ఆధారంగా ఓటు వేయాలి. గ్రామస్థాయిలో పాలనలో చురుకుగా పాల్గొనాలి. సర్పంచ్ స్థాయి నుంచే ప్రయాణం మొదలు పెట్టాలి. విద్యార్థి సంఘాలు, యువజన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలి. విమర్శకులు కాకుండాపరిష్కారాలు చెప్పే నాయకులుగా ఎదగాలి. ప్రలోభాలకు లొంగని ధైర్యంకలిగిన యువత కావాలి. నైతిక విలువలు, ప్రజల పట్ల ప్రేమ కలిగిన యువత రాజకీయాల్లోకి రావాలి. అవినీతి, పాతకాలపు పాలనా పద్ధతుల నుండి విముక్తి కావాలంటే యువత ముందుకు రావాల్సిందే. నేడు మనదేశం సాంకేతికంగా ముందడుగు వేస్తున్నా, పాలనారంగంలో మాత్రం పాత పద్ధతులు కొనసాగుతూనే ఉన్నాయి. దీన్ని మార్చే శక్తి యువతలో ఉంది. నూతన భారత నిర్మాణానికి యువతే కీలకం. ●

# సమాజ సేవకు నూతన రూపం..బ్యాంకుల జాతీయాకరణం

రామ కిష్టయ్య సంగన భట్ల

పంతొమ్మిది వందల అరవై తొమ్మిదిలో భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక ప్రధాన మలుపుగా నిలిచిన సంఘటన బ్యాంకుల జాతీయాకరణ. అదే ఏడాది జూలై 19న,ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ నాయకత్వంలో భారత ప్రభుత్వం తీసుకున్న బ్యాంకుల జాతీయాకరణ నిర్ణయం దేశ ఆర్థిక రంగాన్ని, ముఖ్యంగా బ్యాంకింగ్ వ్యవస్థను సమూలంగా మార్చేసింది. అప్పటివరకు బ్యాంకింగ్ రంగం ఒక పరిమిత వర్గానికి మాత్రమే సేవలందించేది. ముఖ్యంగా పారిశ్రామికవేత్తలు, పెద్ద రైతులు,పట్టణ వాణిజ్య వర్గాలకే ఇది అందుబాటులో ఉండేది. గ్రామీణ భారతం, వ్యవసాయ రంగం, చిన్న పరిశ్రమలు, పేద ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉండిపోయారు. ఈ పరిస్థితిని మార్చాలని భావించిన ఇందిరాగాంధీ ప్రభుత్వం బ్యాంకింగ్ ఆన్ ది డోర్ స్టెప్ ఆఫ్ ద పూర్' అనే ధ్యేయంతో బ్యాంకుల జాతీయాకరణ చర్యను చేపట్టింది. 1960వ దశకం భారతదేశానికి ఆర్థికంగా, రాజకీయంగా అనేక సవాళ్లను ఎదుర్కొన్న కాలం. స్వాతంత్రం వచ్చినప్పటికీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్నారు. ప్రైవేట్ బ్యాంకులు, ఎక్కువగా పారిశ్రామిక వర్గాల నియంత్రణలో ఉండి, ప్రధానంగా పెద్ద పరిశ్రమలు స్థాపిత వ్యాపారాల క్రెడిట్ అవసరాలను తీర్చడానికి మొగ్గు చూపాయి. వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు ఇతర ప్రాధాన్యత రంగాలను నిర్లక్ష్యం చేశాయి. ఇది రుణ పంపిణీలో గణనీయమైన అసమానతలకు దారితీసింది. సమ్మిళిత ఆర్థికవృద్ధికి ఆటంకం కలిగించింది. అలాంటి పరిస్థితుల లో జాతీయాకరణ ద్వారా ప్రభుత్వం, బ్యాంకులలో డబ్బులను నిర్లక్ష్యం చేయబడిన రంగాలకు మళ్లించగలదని, తద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించవచ్చని పేదరికాన్ని తగ్గించవచ్చని భావించారు. ప్రధానంగా నికర డిపాజిట్లు 50 కోట్లకు మించిన 14 ప్రైవేట్ షెడ్యూల్డ్ బ్యాంకులను జాతీయాకరించారు. వీటిలో అల్లాహాబాద్ బ్యాంక్, బాంక్ ఆఫ్ బరోడా, బాంక్ ఆఫ్ ఇండియా, బాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేనరా బ్యాంక్, దేనా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ ఉన్నాయి. ఈ బ్యాంకులు దేశ డిపాజిట్లలో 85వరకూ నిర్వహిస్తున్నట్లుగా ఉండటంతో వాటి జాతీయాకరణ ద్వారా ప్రభుత్వానికి అధిక ఆర్థిక నియంత్రణ కలిగింది. బ్యాంకింగ్ రంగాన్ని సామాజిక అభివృద్ధికి వినియోగించే దిశగా ఇది మలుపు తీసుకొచ్చింది. బ్యాంకుల జాతీయాకరణ ద్వారా కొన్ని



ప్రధాన లక్ష్యాలు చేరుకోవడం జరిగింది. వ్యవసాయ రంగానికి, చిన్న పరిశ్రమలకు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రుణాలందింపు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంక్ శాఖల విస్తరణకు ఇది నాంది పలికింది. జాతీయాకరణ వల్ల ప్రధానంగా నాలుగు ప్రధాన మార్పులుచోటుచేసుకున్నాయి. ఒకటి గ్రామీణ బ్యాంకింగ్ విస్తరణ, రెండోది వ్యవసాయ, మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజులకు రుణాల లభ్యత. మూడోది ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకుల మద్దతు. నాలుగోది మహిళలు, ఎస్సీ,ఎస్టీ,ఇతర బహిష్కృత వర్గాల ఆర్థిక చేర్పు. 1969 నాటికి దేశవ్యాప్తంగా 8,200 బ్యాంక్ శాఖలే ఉండగా, 1991 నాటికి వాటి సంఖ్య 60 వేలు దాటింది. ఇందులో 30 వేలకుపైగా గ్రామీణ శాఖలు. వ్యవసాయరంగానికి బ్యాంకులు ఇచ్చిన రుణాల శాతం 1969లో 2.2 ఉండగా, 1980 నాటికి 15.8 కి పెరగడం గమనార్హం. మహిళలు, ఎస్సీ,ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలు మొదటిసారిగా అధికారిక ఆర్థిక వ్యవస్థకు చేరువయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, విద్యా రుణాలు మొదలైనవి బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా అమలవుతూ వచ్చాయి. ఇక ఇందిరా గాంధీ పాలనకు ఇది రాజకీయంగా పెద్దబలాన్ని ఇచ్చింది. బ్యాంకుల జాతీయాకరణ పేద ప్రజల్లో మద్దతును పెంచడంతో పాటు, ఆమెను సామాజిక న్యాయమూర్తిగా ప్రజల్లో ప్రతిష్ఠించేందుకు దోహదపడింది. అయితే 1970లో సుప్రీంకోర్టు ఈ ఆర్డినెన్స్‌ను కొంతవరకూ చట్టవిరుద్ధంగా ప్రకటించడంతో, ప్రభుత్వం చట్ట సవరణ చేసి తిరిగి జాతీయాకరణను అమలు చేసింది. దీనికితోడు 1980లో మరోసారి ఆరు ప్రైవేట్ బ్యాంకులను జాతీయాకరించడం జరిగింది. వీటితో కలిపి ప్రభుత్వ యాజమాన్యంలోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల సంఖ్య 20కి చేరింది. అయితే జాతీయాకరణ తరువాత కూడా సమస్యలు లేవని చెప్పలేం. బ్యాంకుల్లో రాజకీయ దుర్వినియోగం, సంక్షేమ పథకాల పేరిట నష్ట రుణాల మాఫీ, నిర్వాసిత ఆస్తుల శాతం పెరగడం,ప్రభుత్వ నియామకాల వల్ల పరిపాలనలో నైపుణ్యాల కొరత వంటి అంశాలు వ్యాపించాయి. అయినా ఇవన్నీ కలిపి చూసినప్పుడు, జాతీయాకరణ ద్వారా దేశ ఆర్థికవ్యవస్థకు ఒక సుదీర్ఘ, సామాజిక ధోరణిలో దిక్సూచి చూపడం జరిగింది. దేశంలో సగానికి పైగా జనాభా బ్యాంకింగ్ సేవలకు మించి ఉండే స్థితిలో ఉండడం ఈ విధానానికే ఫలితం. 1991 ఆర్థిక సంస్కరణల అనంతరం ప్రైవేట్ బ్యాంకులకు తిరిగి ప్రవేశం లభించినా, జాతీయాకరణ ద్వారా ఏర్పాటైన బ్యాంకింగ్ మౌలిక సదుపాయాలు, సామాజిక దృక్కోణం భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపాయి. నేటి ఆర్థికచర్చల్లో బ్యాంకుల విలీనాలు, సంస్థాగత పునఃనిర్మాణం, డిజిటల్ బ్యాంకింగ్ వంటి అంశాలు ముందుకు వస్తున్నా వాటికి బీజం వేసింది 1969లో తీసుకున్న బ్యాంకుల జాతీయాకరణే. ఇది కేవలం పాలనా నిర్ణయం కాదు, దేశ ఆర్థిక ప్రణాళికలో ఒక మైలు రాయిగా నిలిచింది. పేదల ఆర్థిక చేర్పును, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న విధానాల మొదటి మెట్టు ఇదే. ఇలాంటి చర్యల ద్వారానే సమతా, సమగ్ర అభివృద్ధికి దారులు వెలుస్తాయి. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# మళ్లీ సుప్రీం మెట్లెక్కిన వర్మ

## ఆయనను పదవి నుంచి తొలగించే చర్యలు ఆరంభించిన కేంద్రం

## విచారణ కమిషన్ నివేదిక చెల్లదంటూ పిటిషన్

**న్యూఢిల్లీ, జులై 18:** కాలిపోయిన కరెన్సీ కట్టలు ఇంట్లో భారీగా బయటపడడంతో తీవ్ర వివాదంలో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయనను న్యాయమూర్తి పదవి నుంచి తొలగించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. తనపై సుప్రీంకోర్టు కమిటీ ఇచ్చిన దర్యాప్తు నివేదికను సవాల్ చేస్తూ ఈ పిటిషన్‌ను వేశారు. ఈకేసులో న్యాయ సూత్రాలను పాటించలేదని జస్టిస్ యశ్వంత్ వర్మ ఆరోపించారు. తనను పూర్తిస్థాయిలో, పారదర్శకంగా విచారించకుండానే సుప్రీంకోర్టు మాజీ సిజెఐ సంజీవ్‌ఖన్నా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని విచారణ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఇక విచారణ కమిటీ కూడా సమగ్ర దర్యాప్తు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదికను చెల్లనదిగా పరిగణించాలని జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఈ నెల 21న నుంచి పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన కోసం తీర్మానం ప్రవేశపెట్టేందుకు వీలుగా ఎంపిల సంతకాల సేకరణ ప్రక్రియను ఇటీవల చేపట్టారు. లోక్‌సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతామని ఇప్పటికే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే జస్టిస్ యశ్మంత్ వర్మ సుప్రీంను ఆశ్రయించారు. ఈ యేడాది మార్చి 14న ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా ఈ ఘటనలో భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం మార్చి 28న సుప్రీంకోర్టు కొలిజియం జస్టిస్ యశ్వంత్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదలీచేశారు. ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించవద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ దీనిపై విచారణ జరిపినివేదిక సమర్పించింది. అందులో డబ్బు బయటపడిన మాట వాస్తవమేనని నిర్ధారించింది. ఆ సొమ్ములున్న స్టోర్ రూం నియంత్రణ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జస్టిస్ వర్మ లేదా అతని కుటుంబసభ్యుల ఆధీనంలోనే ఉందని పేర్కొంది.

ఇందుకు సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నట్లు వెల్లడించింది. అసలు ఆ నోట్లను జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబ సభ్యులు స్టోర్‌రూమ్‌లో ఉంచడం అనుమానాస్పదంగా ఉందని అభిప్రాయపడింది. కాలిపోయిన నోట్లు చిన్న నోట్లు లేదా తక్కువ మొత్తం కాదని వెల్లడించింది. అలహాబాద్ హైకోర్టు జస్టిస్‌గా ఉన్న వర్మను విధుల నుంచి తొలగించడానికి ఈ ఆధారాలు సరిపోతాయని కమిటీ అభిప్రాయపడింది.



## మాజీ సిఎం కుమారుడిని అరెస్టు చేసిన ఇడి

**న్యూరాయ్‌పూర్,జులై 18:** ఛత్తీస్‌గఢ్ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను శుక్రవారం అరెస్టు చేసింది. భిలాయ్‌లోని బఘేల్ నివాసంపై ఈడీ నిర్వహించిన తాజా సోదాల తర్వాత ఈ అరెస్టు జరిగింది. ఈ కేసు మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించినది. ఇది 2019 నుంచి 2022 వరకు భూపేష్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరిగినట్లు ఈడీ ఆరోపిస్తోంది. శుక్రవారం ఉదయం భిలాయ్‌లోని బఘేల్ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది, ఈ సమయంలో భూపేష్ బఘేల్ కూడా అక్కడే ఉన్నారు. ఈ దాడులు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎమ్ఎల్ఏ) కింద నిర్వహించగా, ఇందులో తాజా ఆధారాల ఆధారంగా చైతన్యను అరెస్టు చేశారు. తన కుమారుడ్ని అరెస్ట్ చేయడంపై భూపేష్ భఘేల్ ఘాటుగా స్పందించారు. మోదీ,అమిత్‌షా ఇచ్చే ఇటువంటికానుకలు ప్రజాస్వామ్య ప్రపంచంలో మరెవ్వరూఇవ్వలేరంటూ వ్యంగ్యం ప్రదర్శించారు.



## ఉగ్రవాద సంస్థగా 'ది రెసిస్టెన్స్‌ఫ్రంట్'

**వాషింగ్టన్,జులై 18:** పహల్గాం ఉగ్ర దాడికి బాధ్యత వహించిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ను ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. టీఆర్ఎఫ్ అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా ముసుగు సంస్థ అని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. మా జాతీయ భద్రతా ప్రయోజనాలను రక్షించడం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, పహల్గాం దాడికి న్యాయం కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. ఇదే ట్రంప్ సర్కార్ పరిపాలన నిబద్ధతను ప్రదర్శిస్తుంది. ది రెసిస్టెంట్ ఫ్రంట్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా, ప్రత్యేకంగా నియమితమైన గ్లోబల్ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్‌గా అమెరికా గుర్తించింది. 2008 ముంబయి ఉగ్రదాడి తర్వాత భారత్‌లో జరిగిన దాడుల్లో పహల్గాం ఘటనే అతిపెద్దది. భారత భద్రత దళాలపై గతంలో జరిగిన పలు దాడులకు టీఆర్ఎఫ్ బాధ్యత వహించిందని రూబియో వెల్లడించారు.

## దేశ రాజధానిలో 90 స్కూళ్లకు బాంబు బెదరింపులు

**న్యూఢిల్లీ, జులై 18:** దేశ రాజధాని ఢిల్లీలోని 20కి పైగా పాఠశాలలకు శుక్రవారం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అలాగే బెంగళూరులో కూడా కార్పొరేట్‌స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. మొత్తం 90 స్కూళ్లకు బెదిరింపులు వచ్చాయని పోలీసులు తెలిపారు. వీటిలో ఎంఎస్‌ధోనీ స్కూలుతో సహా అన్ని స్కూళ్లకు ఇలాంటి బెదిరింపులే రావడంతో అన్ని స్కూళ్ల వద్ద బాంబు స్క్వాడ్స్ తనిఖీలు నిర్వహిస్తున్నాయి. బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన స్కూళ్లలో సివిల్ లైన్స్‌లోని సెయింట్ గ్జావియర్స్, పశ్చిమ్ విహార్‌లోని రిచ్‌మండ్ గ్లోబల్ స్కూల్, రోహిణిలోని అభినవ్ పబ్లిక్ స్కూల్, దసావిరిన్ స్కూల్ ఉన్నాయి. పోలీసుల కథనంప్రకారం, బాంబు బెదిరింపు లేఖలో హాలో. నేను పాఠశాల తరగతి గదుల్లో అనేక పేలుడుపరికరాలను (ట్రినిట్రోటోలు యెన్) ఉంచానని మీకు తెలియజేస్తున్నాను. పేలుడు పదార్థాలను నల్లటి ప్లాస్టిక్ సంచులలో చాలా జాగ్రత్తగా దాచిపెట్టాను. మీలో ప్రతి ఒక్కరినీ నేను ఈ ప్రపంచంనుంచి తుడిచి వేస్తాను.నాకు నిజంగా నా జీవితం అసహ్యమే. తర్వాత నేను ఆత్మహత్య చేసుకుంటాను.నాకు నిజమైన సహాయం ఎప్పుడూ అందలేదు. మనోరోగ వైద్యులు, మన స్తత్వవేత్తలు ఇలా ఎవరూ పట్టించుకోలేదు.

# ముందు క్షమాబిక్ష ఆపైనే బ్లడ్‌మనీ కార్యాచరణ

## సుప్రీంకోర్టుకు కేంద్రం వివరణ



**న్యూఢిల్లీ,జులై 18:** యెమెన్‌లో హత్య కేసులో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్షను వాయిదా పడినట్లు సుప్రీంకోర్టుకు కేంద్రం శుక్రవారం తెలిపింది. ఆమెను రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్రం తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కోర్టుకు తెలిపారు. నిమిష ప్రియ సురక్షితంగా తిరిగి రావాలని కేంద్రం కోరుకుంటుందని వెల్లడించారు. అయితే ప్రభుత్వం స్పందనపై సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తంచేసింది. నిమిష ప్రియ కేసులో కేంద్రం సాధ్యమైన ప్రయత్నాలు చేస్తోందని తెలిపింది. తొలుత ఆమెకు క్షమాభిక్ష దక్కితే తర్వాత బ్లడ్ మనీ అంశం చర్చకు వస్తుందని న్యాయస్థానానికి వివరించారు. అనంతరం కేసు తదుపరి విచారణను ధర్మాసనం ఆగస్టు 14కి వాయిదా వేసింది. ఉరిశిక్ష ఎదుర్కొంటున్న 38 ఏళ్ల ప్రియను కాపాడటానికి దౌత్య మార్గాలను ఉపయోగించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపడుతోంది. అదే సమయంలో విచారణ సందర్భంగా నిమిష ప్రియ తరఫున న్యాయవాదుల బృందం కోర్టుకు ఓ అభ్యర్థన చేసింది. ఈ కేసులో బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరిపేందుకు వీలుగా యెమెన్ వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరింది. దీంతో ప్రస్తుతం ఆ దేశానికి వెళ్లకుండా ప్రయాణ ఆంక్షలు ఉన్నందున కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని న్యాయస్థానం పేర్కొంది. ఇందుకోసం ప్రభుత్వం వద్ద అభ్యర్థన చేసుకునేలా పిటిషనర్లకు అనుమతి కల్పించింది. అయితే యెమెన్ దేశస్థుడి హత్య కేసులో నిమిష ప్రియకు జులై 16వ తేదీన మరణశిక్ష అమలు చేయాల్సి ఉంది. కానీ చివరి నిమిషంలో అక్కడి ప్రభుత్వ వాయిదా వేసింది. బ్లడ్ మనీపై బాధిత కుటుంబంతో చర్చలు జరిపేందుకు మరింత సమయం ఇవ్వాలని భారత ప్రభుత్వం అప్పటికే చేసిన అభ్యర్థనకు ఆ దేశం సానుకూలంగా స్పందించింది. కానీ బాధిత కుటుంబం మాత్రం తాము బ్లడ్ మనీకి ఎన్నటికీ అంగీకరించబోమని తేల్చిచెబుతోంది. దీంతో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# పదేళ్లుగా మా బావను వేధిస్తున్నారు

## ఎఐసిసి నేత, ఎంపి రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,జులై 18:** కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై షికోపుర్ ల్యాండ్స్ వ్యవహారానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలుల చేయడంపై రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. గత 10 ఏళ్లుగా ఈ ప్రభుత్వం తన బావ రాబర్ట్ వాద్రాను వెంటాడుతోందని విమర్శించారు. రాజకీయ కక్షతో పెట్టిన కేసును ఎదుర్కొంటున్న రాబర్ట్ వాద్రా, ప్రియాంక దంపతుల కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గత పదేళ్లుగా ఈ ప్రభుత్వం చేతిలో మా బావ వేధింపులకు గురవుతున్నారు. తాజా ఛార్జిషీట్ కూడా రాజకీయ కక్షతో చేసే దాడికి కొనసాగింపుగా ఉంది. ఇవన్నీ దురద్దేశపూరితమైన, రాజకీయ ప్రేరణతో కూడి నిందలు, వేధింపులే. ఈ సమయంలో రాబర్ట్, ప్రియాంకా వారి పిల్లలకు మద్దతుగా ఉంటా. వారు ఎలాంటి హింసనైనా తట్టుకునేంత ధైర్యంగా ఉన్నారని నాకు తెలుసు. ఇకపై అలాగే ఉంటారు. చివరికి నిజమే గెలుస్తుందని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు. 2008 ఫిబ్రవరిలో గురుగ్రామ్‌లోని శికోహ్‌పుర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి వాద్రా కంపెనీ కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు ఉంటుందని తెలిపింది. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. దీనిపై మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఈడీ విచారణ జరుపుతోంది. ఈ కేసుకు సంబంధించి 2018 సెప్టెంబర్‌లో వాద్రా పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదైంది. ఆయనతో పాటు నాటి హరియాణా ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, రియల్ ఎస్టేట్ సంస్థ డీఎల్ఎఫ్, ఓ ప్రాపర్టీ డీలర్ పేర్లను కూడా నమోదు చేసింది. అందులో అవినీతి ఫోర్జరీ చీటింగ్ తదితర నేరాలు నమోదయ్యాయి. వాద్రాతో సంబంధం ఉన్న రూ.37.64 కోట్ల విలువైన 43 స్థిరాస్తులను జప్తు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ కేసుకు సంబంధించి రాబర్ట్ వాద్రాను ఇప్పటికే ఈడీ పలుమార్లు విచారించింది. ఈ క్రమంలోనే గురువారం ఆయనపై ఛార్జిషీట్ ధాఖలు చేసింది. వాద్రాతో పాటు మరో 10మంది పేర్లను ఛార్జిషీట్‌లో చేర్చింది.

# ఆ ఖైదీల విడుదలకు నియమాలు రూపొందించండి

## రాష్ట్రాలను ఆదేశించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ,జులై 18:** జైలు నిబంధనలు రాష్ట్రాల వారీగా వేర్వురుగా ఉంటాయని, అయితే ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలను విడుదల చేసే క్రమంలో ఒకే రకమైన నియమాలు రూపొందించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మోహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ప్రాణాంతక వ్యాధులున్న రోగులు, 70 ఏళ్ల పైబడిన ఖైదీలను విడుదల చేయాలని నేషనల్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను రిజర్వ్ చేసింది. ఈ విషయంలో కేంద్రం ఇప్పటికే మార్గదర్శకాలను రూపొందించిందని, అదే రికార్డులో ఉన్నట్లు తెలిపింది. జైలు నిబంధనల విషయానికి వస్తే రాష్ట్రాల వారీగా వ్యక్తిగతంగా ఉంటాయి. అయితే, ప్రాణాంతాక వ్యాధులున్న రోగుల విడుదలకు అన్ని రాష్ట్రాలు ఒకే రకమైన నిబంధనల రూపకల్పనకు ముందుకు రావాలని బెంచ్ తెలిపింది. అయితే, ఇలాంటి ఖైదీల పట్ల కేంద్రం ఆలోచిస్తుందని అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇందుకు తగిన నిర్వహణ చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. క్షమాభిక్షలో భాగంగా ఇలాంటి ఖైదీల విడుదల అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలకు కేంద్రం సూచించినట్లు చెప్పారు. మరోవైపు ఈ విధానంలో దుర్వినియోగం జరిగే అవకాశాలను సుప్రీం పరిగణలోకి తీసుకుంది. ఇలాంటి అర్హులైన ఖైదీలకు వైద్య చికిత్స, విడుదల విషయంలో సరైన నిబంధనలను రూపొందించాలని చెప్పింది. దీనిపై స్పందించిన పిటిషనర్ ప్రాణాంతక వ్యాధులుగా ఉన్నవారిగా ఎవరిని గుర్తించాలనే అంశాన్ని మార్గదర్శకాల్లో ఉంచామని తెలిపారు. వీరిని సంబంధిత జైలు వైద్య అధికారి ధ్రువీకరిస్తారని చెప్పారు. ఇందు కోసం ఒక వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రం ఆలోచిస్తుందని తెలిపారు. ఈ క్రమంలోనే ఢిల్లీ ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది మాట్లాడుతూ 1985 నుంచి ఆస్తమాతో బాధపడుతున్న ఖైదీ జైలులో ఉన్నాడని తెలిపారు. మరోవైపు కేరళలో కూడా 94ఏళ్ల ఖైదీ ఉన్నాడని న్యాయవాది చెప్పారు. 2018లో రూపొందించిన విధానంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తుల కోసం కొన్ని నిర్దిష్ట నిబంధనలను చేర్చిందని, వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని ఉత్తరప్రదేశ్ న్యాయవాది అన్నారు.

కాగా, ఈ పిటిషన్‌పై మే 5న కేంద్రంతో పాటు బిహార్, ఉత్తరప్రదేశ్ సహా 18 రాష్ట్రాల సుప్రీం కోర్టు స్పందనలు కోరింది . 70ఏళ్లపైబడిన, ప్రాణాంతక వ్యాధిగ్రస్తులైన ఖైదీలు బిహార్, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బంగాల్, ఒడిశాతో సహా అనేక రాష్ట్రాల్లో జైలుశిక్ష అనుభవిస్తున్నారని నల్సా తెలిపింది. తమ నేరారోపణలను సవాలు చేయ దానికి, బెయిల్ నిరాకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు రాలేని ఇలాంటి ఖైదీల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని పిటిషనర్ వాదించారు. జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటంవల్ల జైలు అధికారులు సహాయం అందించడం కూడా సాధ్యం కాకపోవచ్చు అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందుకే ఈ విషయంలో జోక్యం అవసరమ న్నారు. 2022 డిసెంబర్ 31 నాటికి దేశంలో జైలు ఆక్యుపెన్సీ రేటు 131 శాతంగా ఉందని చెప్పింది.

# కన్నతల్లిని ఇంట్లో బంధించి చిత్రహింసలు

## పోలీసుల జోక్యంతో మాతృమూర్తికి విముక్తి

**చండీగఢ్,జులై 18:** దివ్యాంగురాలైన కన్న తల్లిని ఇంట్లోనే బంధించి చిత్రహింసలకు గురిచేసిన కొడుకు ఉదంతం వెలుగులోకి వచ్చింది. గేటుకు తాళం వేసి భోజనం, నీళ్లు ఇవ్వకుండా క్రూరంగా ప్రవర్తించాడు. ఈ దారుణ ఘటన హరియాణాలో జరిగింది. బాధిత మహిళ సహాయం కోసం ఇరుగుపొరుగు వారిని వేడుకోవడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని రక్షించారు. బాధితురాలి భర్త రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కొద్ది రోజులుగా ఒంటరిగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హరియాణా కైతాల్ జిల్లాలోని చందన గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన ఓ మహిళని తన కొడుకు నాలుగు రోజుల నుంచి ఇంట్లోనే బంధించి గేటుకు తాళం వేశాడు. బాధితురాలు ఆకలి, దాహంతో పక్కింటివారిని వేడుకుంది. ఇది గమనించిన స్థానికులు 112 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గేటు తాళం పగలకొట్టి మహిళను రక్షించారు. ఆమెను బయటకు తీసే సమయానికి తీవ్ర నీరసంతో మూర్ఛపోయిందని, వెంటనే ఆస్పత్రిలో చేర్చామని పోలీసులు చెప్పారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని, దాదాపు తొమ్మిది రోజులు నుంచి ఆమె ఆహారం తీసుకున్నట్లుగా కనిపించడం లేదని తెలిపారు. ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలోనూ వణుకుతున్న గొంతుతో, కన్నీటి పర్యంతమవుతూ ఆవేదన వ్యక్తం చేసింది. తన కొడుకు గదిలోకి లాక్కెళ్లిపోయాడనీ, అక్కడే బంధించి ఆహారం, నీళ్లు, మందులు ఏమీ ఇవ్వలేదని తెలిపింది. రాత్రి పూట స్నేహితులతో కలిసి మద్యం సేవించి తనని కర్రతో కొట్టాడని చెప్పింది. గత తొమ్మిది



రోజుల నుంచి ఆహారం పెట్టలేదని బాధిత మహిళ వాపోయింది. పొరుగువారు గేటు కింద నుంచి ఆహారం ఇవ్వడానికి ప్రయత్నించేవారని, కానీ కొడుకు 45 రోజులుగా దాన్ని లాక్కెళ్లేవాడని పేర్కొంది. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి బంధువులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని ఏఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు.



# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి మసూద్ అజార్?

**ఇస్లామాబాద్, జులై 18:** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ చీఫ్ మసూద్ అజార్ కదలికలను ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. అతడి అడ్డా అయిన బహవల్పూర్ నుంచి 1,000 కిలోమీటర్ల దూరంలోని గిల్గిత్ బల్టిస్థాన్ ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తోంది. కొన్నాళ్ల కిందటే స్కర్దూలోని సద్‌పర రోడ్ ప్రాంతంలో అతడిని గుర్తించారు. ఆ ప్రదేశంలో రెండు మసీదులతోపాటు మదర్సాలు, చాలా ప్రైవేటు, ప్రభుత్వ అతిథి గృహాలున్నాయి. బాహ్య ప్రపంచం నుంచి దూరంగా ఉండాలంటే జైషే ఛీఫ్‌నకు పిఒకెకు మించిన ప్రదేశం లేదు. సహజసిద్ధమైన పార్కులు, సరస్సులతో ప్రశాంతంగా ఉంటుంది. ఇటీవల పాక్ పీపుల్స్ పార్టీ అధినేత బిలావల్ భుట్టో జర్దారీ మాట్లాడుతూ మసూద్ అఫ్ఘానిస్థాన్‌లో ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. అవసరమైతే అతడిని భారత్‌కు అప్పగించేందుకు పాక్ సిద్ధంగా ఉందన్నారు. అల్‌జజీరా న్యూస్‌ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ జైషే మహమ్మద్ సంస్థ నేత మసూద్ అజార్ తమ దేశంలో లేదని, ఒకవేళ ఉన్నట్లు భారత్ కచ్చితమైన సాక్ష్యాలు సమర్పిస్తే అతడిని అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. లష్కరే తొయిబా అధిపతి హాఫీజ్ సయీద్, జైషే మహమ్మద్ (జెఎం) చీఫ్ మసూద్ అజార్‌లను భారత్‌కు అప్పగించడం గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ 'హాఫీజ్ సయీద్ పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నాడంటూ వస్తున్న వార్తలు అవాస్తవం. అతను కస్టడీలోనే ఉన్నాడు. మసూద్ అజార్ ఎక్కడున్నాడో మాకు తెలియదు. అఫ్ఘానిస్థాన్‌లో ఉన్నాడేమో ఒకవేళ అతడు పాక్ గడ్డపైనే ఉన్నట్లు భారత ప్రభుత్వం మాకు కచ్చితమైన సమాచారం ఇస్తే అతడిని అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరం లేదు' అని భుట్టో పేర్కొన్నారు. జైషే సంస్థ ఆన్‌లైన్ ఖాతాలు ఇంటెలిజెన్స్ వర్గాలను తప్పుదోవ పట్టించేలా పలు పోస్టులు చేస్తున్నాయి. ఈ క్రమంలో పాత ఆడియోక్లిప్‌ను రీసైకిల్ చేసి ఆన్‌లైన్‌లో పబ్లిష్ చేయడం వంటి వాటికి పాల్పడుతున్నాయి. అయినా నిఘా వర్గాలు మాత్రం జాగ్రత్తగా అతడి కదలికలపై దృష్టి సారించాయి. భారత్‌లో పలు ఉగ్రదాడుల వెనుక మసూద్ హస్తం ఉంది. 2016లో పఠాన్‌కోట్ ఎయిర్ బేస్, 2019 పుల్వామా దాడికి జైషే పాల్పడింది.



## రష్యా సైనికులను వణికిస్తున్న నీళ్ల బాటిళ్లు..

# 'విష' కుట్ర వెనుక ఉక్రెయిన్?

**మాస్కో, జులై 18:** ఉక్రెయిన్‌పై సుదీర్ఘకాలంగా పోరు సాగిస్తున్న రష్యన్ సైనికులకు కొత్త గుబులు పట్టుకుంది. ఇటీవల ఫ్రంట్‌లైన్‌లో ఉన్న నలుగురు సైనికులు తోటి సిబ్బంది కళ్లముందే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. విషం కలిపిన నీళ్లను తాగడం వల్లే వారు మృతి చెందినట్లు తెలిసింది. ఇదే నీళ్లు తాగిన చాలామంది సిబ్బంది ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రష్యా ఆక్రమిత డొనెట్స్క్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 'అవర్ వాటర్' పేరుతో ఉన్న ఈ నీళ్ల బాటిళ్లు మానవతా సాయం కింద ఈ ప్రాంతానికి వచ్చినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. క్రిమియాలోని సిమఫెరోపోల్ నుంచి వీటిని పంపించినట్లు గుర్తించారు. ఈ బాటిళ్లను ఎవరు పంపారు? ఫ్రంట్‌లైన్ జవాన్ల చేతికి ఎలా వచ్చాయి? వాటిలో ఎవరు విషం కలిపారన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు వెల్లడించాయి.

ఈ కుట్ర వెనుక ఉక్రెయిన్ హస్తం ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం, సరకుల రవాణాకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతోనే ఈ కోవర్ట్ ఆపరేషన్‌కు పాల్పడ్డారని రష్యన్ మిలిటరీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను ఉక్రెయిన్ వర్గాలు ఖండిస్తున్నాయి. సైనికుల డ్రగ్స్ వినియోగాన్ని దాచిపెట్టేందుకే మాస్కో ఈ అసత్యప్రచారం చేస్తోందని మండిపడ్డాయి.

**ఉక్రెయిన్‌పై భారీ దాడులు:** ఇదిలా ఉండగా ఉక్రెయిన్‌పై రష్యా దాడుల తీవ్రతను మరింత పెంచింది. శుక్రవారం 500కిలోల భారీ గ్లైడ్ బాంబును ప్రయోగించింది. ఈ ఘటనలో ఇద్దరు పౌరులు మృతి చెందగా, కనీసం25 మంది గాయపడ్డారు. 50 దుకాణాలు, 13 నివాస భవనాలు ధ్వంసమయ్యాయి. అంతకు ముందు గురువారం మాస్కోను లక్ష్యంగా చేసుకొని కీవ్ 100కు పైగా డ్రోన్లను ప్రయోగించింది. వీటిని సమర్థంగా కూల్చేసినట్లు రష్యా వెల్లడించింది.

## సంక్షిప్తంగా..


### కర్ణాటకలో ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు



**బెంగళూరు, జులై 18:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక నిర్ణయం తీసుకున్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల గ్రాంట్ విడుదల చేసేందుకు ఆమోదం తెలిపారు. పార్టీలో అంతర్గతంగా జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ మొత్తాన్ని ఇచ్చేందుకు సిఎం అంగీకరించారు. తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు సరిపోవడం లేదని కర్ణాటక పార్టీ ఇంచార్జి రణదీప్ సూర్జేవాలా వద్ద ఇటీవల ఎమ్మె ల్యేలు మొరపెట్టుకున్నారు. బెంగళూరులోని పార్టీ ఆఫీస్‌లో విడివిడిగా ఒక్కో ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడారు. నిధుల జాప్యంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కీలకమైన ప్రాజెక్టులు కుంటుపడుతు న్నాయని చెప్పారు. ఈ విషయాన్ని సూర్జేవాలా సిఎం, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై అంతర్గతంగా జరిగిన చర్చ అనంతరం చాలాకాలంగా పెండిం గ్‌లో ఉన్న కేటాయింపుల విడుదలకు ముఖ్య మంత్రి అంగీకరించారు. దీంతో ప్రతి ఎమ్మెల్యే రూ.50 కోట్ల గ్రాంట్‌ను పొందనున్నారు.

### ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతోన్న గూండారాజ్!

#### 2017 నుంచి 15వేల ఎన్‌కౌంటర్లు, 238 మంది హతం



**లక్నో, జులై 18:** శాంతిభద్రతలు గాడితప్పుతూ గూండారాజ్ కొనసాగుతున్న ఉత్తరప్రదేశ్‌లో పరి స్థితులను 'బుల్లెట్ రాజ్'తో అదుపులోకి తీసు కువచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. 2017లో యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 14,973 ఎన్‌కౌంటర్లు జరగ్గా 238 మంది మృతి చెందారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలో 9,467మంది నేరగాళ్లకు గాయాలుకాగా 30,694 మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ అరెస్ట య్యారు. ఈగణాంకాలపై ఉత్తరప్రదేశ్ డిజిపి రాజీవ్‌కృష్ణ గురువారం మీడియాతో మాట్లాడుతూ సిఎం యోగి ఆదిత్యనాథ్ ఆదే శాల మేరకు నేరస్థులపై కఠినచర్యలు తీసు కుంటున్నామన్నారు. 2017 నుంచి తీసుకున్న కఠిన చర్యలతో ఇప్పుడు దేశంలోనే యుపి అత్యంత సురక్షిత రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందన్నారు.

### సంగ్లీ జిల్లాలోని ఇస్లాంపుర్ పేరును ఈశ్వర్‌పుర్‌గా మార్పు



**ముంబయి, జులై 18:** మహారాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. సంగ్లీ జిల్లాలోని ఇస్లాంపుర్ పేరును ఈశ్వర్‌పుర్‌గా మార్పు చేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ఛగన్ భుజ్‌బల్ అసెంబ్లీ వేదికగా శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర మంతివర్గం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆమోదం కోసం కేంద్రానికి పంపనున్నట్లు చెప్పారు. మహారాష్ట్రలో ఇప్పటికే ఔరంగాబాద్‌ను ఛత్రపతి శంభాజీనగర్‌గా, ఉస్మానాబాద్‌ను ధారాశివ్‌గా మారుస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇస్లాంపుర్ పేరును ఈశ్వర్‌పుర్‌గా మార్చాలన్న డిమాండ్ ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉండగా తాజాగా హిందుత్వసంస్థ శివ్ ప్రతిష్టాన్ మరోసారి ఈ అంశంపై కలెక్టరేట్‌లో విజ్ఞాపన పత్రం అందచేసింది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్రలో సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పేరు మార్పునకు ఆమోదం తెలిపింది. ఇస్లాంపుర్ పేరు మార్చాలన్న డిమాండ్ 1986 నుంచి పెండింగ్‌లో ఉందని శివసేన నేత ఒకరు తెలిపారు.

### లాలూ ప్రసాద్‌కు సుప్రీంలో చుక్కెదురు!



**న్యూఢిల్లీ,జులై 18:** ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలుప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ హైకోర్టు తన పిటిషన్‌ను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ లాలు సుప్రీంకోర్టును ఆశ్రయిం చారు. అయితే, ఈ కేసులో ట్రయల్ కోర్టు కార్య కలాపాలపై స్టే ఇచ్చేందుకు అత్యున్నత న్యాయ స్థానం నిరాకరించింది. అంతేకాదు, ఈ కేసు విచారణను వేగవంతం చేయాలని ఢిల్లీ హైకోర్టును ఆదేశించింది. లాలూ యాదవ్ 2004 నుంచి 2009వరకు రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం జరిగినట్టు ఆరోపణలున్నాయి. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న వెస్ట్ సెంట్రల్ జోన్ ఆఫ్ ఇండియన్ రైల్వేలో గ్రూప్ డి నియామకాల సమయంలో లాలు ఈ కుంభకోణానికి తెరతీసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయనతోపాటు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఆయన భార్య, వారి ఇద్దరు కుమార్తెలు, మరో అధికారి కూడా ఉన్నారు.

# కేంద్ర ప్రభుత్వ సారధ్యంతో తెలుగు రాష్ట్రాల జలవివాదాలు జటిలమయ్యే అవకాశం: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,.జూలై 18,ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం -బనకచర్లపై ప్రాజెక్ట్‌పై ఢిల్లీలో జరిగిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం కేంద్ర ప్రభుత్వ శల్యసారధ్యంతో జలవివాదాలను మరింత జటిలం చేసే విధంగా వుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ కేంద్ర జలవనరులశాఖ మంత్రి సిఆర్ పాటిల్ సమక్షంలో జరిగిన సమావేశం బనకచర్ల ప్రాజెక్టు వివాదాన్ని పరిష్కరించకపోగా, గోదావరి, కృష్ణా నదీ జలాల వివాదాల తేనెతుట్టేను కదల్చే విధంగా వుందని రాష్ట్ర కమిటీ అభిప్రాయపడిందని ఆయన తెలిపారు. "రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నదానికి భిన్నంగా ఏమి జరిగినా అది రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం చేస్తుంది. ఈ కమిటీ ఆ నిర్ణయానికి లోబడి వ్యవహరించాల్లి అని ఆయన కోరారు. తక్షణం అఖిలపక్ష సమావేశం వేసి ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశ వివరాలను, నిపుణుల కమిటీ విధివిధానాలను ప్రజలకు స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తమ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.82 వేల కోట్ల ప్రతిపాదనలతో బనకచర్ల ప్రాజెక్టును మూడు సంవత్సరాల్లో నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం గత కొన్ని నెలలుగా పెద్దఎత్తున హడావుడి చేస్తున్న అంశాన్ని ఆయన ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వ జోక్యం ద్వారా పరిష్కరించుకోనున్నట్లు మీడియాలోనూ వార్తలు వచ్చాయని, ఈ సమావేశంలో అదికూడా చర్చకు రాలేదని తెలిపారు. కృష్ణా జలాల విషయంపై తెలంగాణ ప్రభుత్వం చాలా కాలంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని, ఈ నీటిలో తనకు సగభాగం కావాలని డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుండి విద్యుత్ ఉత్పత్తి పేరుతో కనిష్ఠ నీటిమట్టానికంటే దిగువనున్న నీటిని కూడా తెలంగాణ ప్రభుత్వం తోడేస్తుందని మన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కూడా విమర్శించిందని తెలిపారు. గోదావరి వరద జలాలను మళ్లించి రాయలసీమలో సాగునీటి వనరులను పెంచడంతో పాటు,

కృష్ణా ఆయకట్టు స్థిరీకరణకు పోలవరం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతూ వచ్చిన విషయాన్ని ఆయన పేర్కొన్నారు.

బనకచర్ల భారమని దానికంటే ముందు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సిపిఎం డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కూడా బనకచర్ల ప్రాజెక్టు అసాధ్యమని తేల్చిందని వివరించారు.



# రాష్ట్రాభివృద్ధికి నిధుల సాధనకు కృషి చేయండి

## - రాష్ట్ర ప్రాజెక్టులపై కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపండి

## - టిడిపి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ,జూలై 18,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపీలకు సూచించారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి నారా లోకేష్, ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... "పార్లమెంట్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు మద్దతు ధర, నదీ జలాలు, పారిశ్రామికీకరణ వంటి అంశాలను పార్లమెంట్ లో లేవనెత్తాలి. ఆయా అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను వివరించడంతో పాటు కేంద్రం నుంచి ఆశిస్తున్న సాయాన్ని పార్లమెంట్ ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్లి అని సీఎం చంద్రబాబు అన్నారు. మన ఎంపీల పనితీరు బాగుంది..పార్లమెంట్‌లో మన ఎంపీల పని తీరు బాగుంది. క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరవుతున్నారు. చర్చించే అంశాలపై రాష్ట్ర వాదనను సమర్థవంతంగా వినిపిస్తున్నారు. పార్లమెంట్ సభ్యుల హాజరులో దేశవ్యాప్తంగా సగటున 85 శాతం ఉండగా టీడీపీ సభ్యులది 86.2 శాతం హాజరుతో అగ్రస్థానంలో ఉన్నారు. చర్చల్లో పాల్గొనడం, ప్రశ్నలు అడగటంలోనూ తెలుగుదేశం ఎంపీలు తొలి స్థానంలో ఉన్నారు. పార్లమెంట్‌లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించడంతో పాటు ప్రధాని మోదీ చేస్తున్న మంచి పనులను కూడా సభలో ప్రస్తావించాలి. సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధానిగా ఉన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో టెర్రరిస్టులకు గట్టి సమాధానం ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్, ఎమర్జెన్సీకి 50 ఏళ్ల వంటి అంశాలపై జరిగే చర్చలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును సమర్థించాల్లి అని సీఎం సూచించారు. ఎంపీలకు కొన్ని శాఖల వారీగా బాధ్యతలు అప్పజెప్పాం. మీకు కేటాయించిన విభాగాలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ అంశాలపై కేంద్రమంత్రులతో నిరంతరం మాట్లాడాలి, రాష్ట్ర యంత్రాంగంతోనూ సమన్వయం చేసుకోవాలి. నిరంతరం సంప్రదింపులు జరపడం వల్లే నరేగాకు సంబంధించి రూ.180 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ బిల్లులను తిరిగి ప్రక్రియలో పెట్టగలిగాం. ఇదే విధంగా జల్ జీవన్ మిషన్, ఆరోగ్య మిషన్ వంటి పథకాలపైనా దృష్టిపెట్టి అదనపు నిధుల సాధనకు కృషి చేయాలి. అలాగే ప్రతి అంశంపై ఎంపీలు పూర్తి అవగాహన కలిగి ఉండాలి, సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలి. జరిగే రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు దృష్టిపెట్టాలి. నేను కచ్చితమైన సమాచారంతో ఉండబట్టే ఢిల్లీలో జరిగిన తెలుగురాష్ట్రాల సీఎంల సమావేశంలో రాష్ట్రానికి మేలు కలిగేలా వాదనలు వినిపించగలిగాను. రాష్ట్రం సంక్షోభంలో ఉన్న సమయంలో ప్రజలు మనకు ఓట్లు వేసి అధికారం ఇచ్చారు, పెద్ద సంఖ్యలో ఎంపీలను ఇచ్చారు.

# యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి నారాయణ

**విజయవాడ,జులై 18,ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణ యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌ను సందర్శించారు. ద్వారకా సెక్టార్ 25లో ఉన్న ఆసియాలోనే అతి పెద్ద కన్వెన్షన్‌ను మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. భారీ మీటింగ్ హాల్స్‌తో కూడిన కన్వెన్షన్ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్మించింది. అత్యాధునిక టెక్నాలజీ,సీటింగ్,అబ్బురపర్చే డిజైన్‌ల గురించి మంత్రికి కన్వెన్షన్ సెంటర్ ప్రతినిధులు వివరించారు. అమరావతిలో నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. యశోభూమి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణాన్ని అనుసరించి అమరావతిలో నిర్మించే కన్వెన్షన్ సెంటర్లలో ఉపయోగించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

# మోసపూరిత 'కూటమి' తీరును ఎండగడదాం

## వైఎస్సార్‌సిపి విస్తృతస్థాయి సమావేశంలో వక్తల విమర్శలు

**తాడిపత్రి, జులై 18, ప్రభాతవార్త:** మోసపూరిత హామీలతో అధికారాన్ని చేజిక్కించుకొని ప్రజలకు మొండిచేయి చూపుతున్న మోసపూరిత కూటమి ప్రభుత్వ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడదామని వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు ఆ పార్టీ కార్యకర్తలకు, గ్రామస్థాయి నాయకులకు, ప్రజా ప్రతినిధులకు పిలుపు నిచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం తాడిపత్రిలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పలువురు అగ్ర నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఆ పార్టీ అనంతపురం పార్లమెంటరీ పరిశీలకులు మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త శైలజానాథ్, వైస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంతవెంకట్రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సమావేశానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరవుతారని కార్యకర్తలు ఉత్సాహంగా తరలివచ్చారు. అయితే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తిమ్మంపల్లిలోని ఆయన స్వగృహంలోనే పోలీసులు నిర్బంధించడంతో ఆయన స్థానంలో ఆయన పెద్దకోడలు అర్చితారెడ్డి హాజరై కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.
రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో పోస్టర్లను, క్యూఆర్ కోడ్‌ను నాయకులు ఆవిష్కరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ 'సూపర్ సిక్స్ పథకాలు అన్నీ అమలు చేసేశామని, వీటి గురించి ఎవరైనా ప్రశ్నిస్తే వారి నాలుక మందమేనని అనుకోవాలని చంద్రబాబు నాయుడు చెప్పడం చూస్తే వారి చర్మమే మందమని జనం అనుకుంటున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన కోసం, మన పార్టీ కోసం కాకుండా ప్రజల కోసం ఆలోచించి, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంటే జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుంటోందని ఆయన విమర్శించారు. మనసా,వాచా,కర్మణ మేము మేనిఫెస్టోలో చెప్పిన పథకాలన్నీ అమలు చేస్తామని, దీనికి మేమే భరోసా అని చెప్పి సంతకాలు చేసిన కూటమి నాయకులు ఇప్పుడు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మాట మారుస్తూ..వాటినే త్రికరణ శుద్ధి అనుకోమని ప్రజలను మోసం చేస్తున్నారని శైలజానాథ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 13 నెలలు పూర్తయినా విద్యార్థుల తల్లిదండ్రులు ఇంకా అమ్మఒడి అనే పలుకుతున్నారంటే ఆ పథకం ఎవరు

ప్రవేశపెట్టారో ప్రజలందరి మనసులోకి చొచ్చుకొని పోయినట్లే కదా అని, అలాంటి పేరు మార్చిన తల్లికి వందనం పథకం తన కొడుకు లోకేష్ ఆలోచనల నుంచి పుట్టిందని చంద్రబాబుచెబుతున్నాడంటే అంతకంటే మోసం ఇంకొకటి ఉంటుందా అని ఆయన అన్నారు. జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో మనం ఓడిపోయినా 40 శాతం మంది ప్రజలు మన వెనుక ఉన్నారని, వారి కోసమైనా పోరాడాలన్నారు.

# అంతరాయంలేని విద్యుత్‌సరఫరాయేలక్ష్యం

## -ఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోషరావు

**తిరుపతి,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారులకు నిరంతర అంతరాయంలేని విద్యుత్‌సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విదులు నిర్వహించాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు కోరారు. అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లోని హెడ్‌క్వార్టర్స్ లోనే నివాసముంటూ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. సంస్థ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ నుండి జూన్ వరకు ఫీడర్ ట్రిప్పింగ్స్ గరిష్టంగా అనంతపురం సర్కిల్‌లోనూ, కనిష్టంగా కర్నూలు సర్కిల్లోనూ నమోదైందన్నారు. ఫీడర్ ట్రిప్పింగ్స్ పై సంబంధిత అధికారులు నిరంతరం సమీక్షిస్తూ వాటిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ అధికారులతో సమావేశంలోపలు సూచనలు,అంశాలుపై వివరించారు. సంస్థ పరిధిలో పిఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పిఎం సూర్యఘర్ పథకం ద్వారా చేకూర్చే ప్రయోజనాలను వినియోగదారులకు సక్రమంగా వివరించి సౌరవిద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు ,సమస్యలపై టోల్‌ఫ్రీనంబర్ 1912,1800425155333కు కాల్‌చేసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్లు, సిజిఎంలు, ఎస్ఇలు గురవయ్య, అయూబ్‌ఖాన్, రమణాదేవి, వరకుమార్ ,కెఆర్ ధర్మజ్ఞాని, జానకిరామ్, ఆదిశేషయ్య, రామ్మోహన్‌రావు, మురళి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, సురేంద్రరావు, చక్రపాణి, శ్రీకాంత్, నరేంద్రనాథ్, విజయన్, రమణ, ఉమాపతి,సంపత్ పాల్గొన్నారు .

# దేశ భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమిస్తాం

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**తిరుపతి,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి:** దేశభవిష్యత్‌కు ఆశాకిరణం ఎర్రజెండానే అని సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. రానున్న కాలంలో వామపక్ష,ప్రజాతంత్ర శక్తులంతా ఏకమై బిజెపిని నిలువరిస్తాయని అన్నారు. దేశంకోసం, దేశప్రజల భవిష్యత్తుకోసం ,దేశ ఔన్నత్యం కోసం పీడిత ప్రజల ఆకాంక్షల కోసం వందేళ్ళుగా అలుపెరగని పోరాటం చేస్తున్న కమ్యూనిస్ట్ పార్టీయే అన్నారు. శుక్రవారం తిరుపతిలో సిపిఐ నగర 14వ మహాసభలు ఘనంగా జరిగాయి. మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ జెండాను రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ ఆవిష్కరించారు. లౌకికవాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగానికి వ్యతిరేకంగా బిజెపి మతోన్మాదపు చర్యలకు ఒడిగడుతోందని మండిపడ్డారు. బిజెపి అధికారం చేపట్టక 11ఏళ్ళ ముందు వ్యవసాయానికి సాయం అందక రైతులు అప్పుల పాలవుతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాట్లాడి అధికారం చేపట్టి 11ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటి వరకు రైతులకు మేలుచేసే కార్యక్రమాలు చేయలేదని మండిపడ్డారు.

# ఎస్సి,ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పై మంత్రుల కమిటీ సమావేశం



ఎస్సి,ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పై మంత్రుల కమిటీ సమావేశం.

**విజయవాడ,జూలై 18,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్సి,ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పై మంత్రుల కమిటీ సమావేశమైంది. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గుమ్మడి సంధ్యారాణి, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, పలువురు ఉన్నతాధికారులు సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు తీరు, పలు కేసుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పై న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులపైనా సమావేశంలో సుధీర్ఘంగా చర్చించారు. ఈ అంశంపై మరొకసారి సమావేశం కావాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఈ అంశంపై మరింత అధ్యయనం చేసి ఎవరికి ఇబ్బందులు లేకుండా నిర్ణయం తీసుకుంటామని మంత్రుల కమిటీ తెలిపింది. కమిటీ తీసుకునే నిర్ణయాలు న్యాయస్థానాల ఆదేశాలకు అనుగుణంగా రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ వర్గాలకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే రీతిలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# ఉపయోగంలోనికి పాత విశ్రాంతి భవనాలు !

## -తిరుమలలో అన్నపూర్ణక్యాంటీన్ భవనానికి త్వరలో మోక్షం



**తిరుమల,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో పలు కారణాలతో వినియోగంలోలేని విశ్రాంతి భవనాలు,హోటళ్ళ,క్యాంటీన్ల భవనాలను పూర్తిస్థాయిలో ఉపయోగంలోనికి తీసుకువచ్చేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు దృష్టి పెట్టారు. ఈ భవనాలను మరమ్మతులు చేసి భక్తులకు అందుబాటులో ఉండేలా చూడటమేగాక పునర్నిర్మాణం చేసేందుకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే తిరుమలలో నిత్యం భక్తుల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన కల్యాణకట్ట మార్గంలోని దశాబ్ధకాలంగా ఉపయోగంలోలేని అన్నపూర్ణక్యాంటీన్ భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించే ఆలోచన చేస్తున్నారు. శుక్రవారం ఉదయం టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,వసతి కల్పన డిప్యూటీ ఇఒ భాస్కర్, ఎఇఒ అశోక్‌కుమార్, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పంచాయతి రెవెన్యూ డిప్యూటీ ఇఒ వెంకటేశ్వర్లుతో కలసి అన్నపూర్ణక్యాంటీన్ భవనాన్ని, అన్నమయ్యభవనం సమీపంలోని హెచ్‌విడిసి, బాలాజీనిలయం, తిరుమల మందిరం(ఆంప్రోవిశ్రాంతి భవనం) విశ్రాంతి భవనాలను పరిశీలించారు. ఈ భవనాలను మరమ్మతులు చేయడానికి వీలుందా?లేక పునర్నిర్మాణం చేయాలనే కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ భవనాల పరిస్థితిని స్వయంగా ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి పరిశీలించారు. నాలుగు దశాబ్ధాల క్రిందట తిరుమలకు వచ్చిన యాత్రికులకు, భక్తులకు పాత అన్నపూర్ణక్యాంటీన్ సరసమైన ధరలకు,నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించింది. అప్పట్లో ఈ భవనాన్ని మండలపుమోహన్‌రావు నడుపుకున్నారు. ఆ తరువాత టిటిడి పెంచిన అద్దెలు, డిపాజిట్లతో హోటల్‌ను నడుపుకోలేక అలానే వదలిపెట్టారు. గత దశాబ్ధకాలంగా ఈ భవనం ఇలానే నిరుపయోగంగా మారింది. ఇంకా భక్తులకు పూర్తిస్థాయిలో వసతి కల్పించేందుకు వీలుగా అనేక విశ్రాంతి భవనాలను ప్రస్తుత నిబంధనలు, డిజైన్ల మేరకు పునర్నించడం వల్ల అదనంగా యాత్రికులకు వసతి కల్పించే వీలుంటుందని భావించారు. ఈ నేపధ్యంలో తిరుమలలో రానున్న రోజుల్లో పాత విశ్రాంతి భవనాలన్నీ ఆధునీకరించి కొత్త విశ్రాంతి భవనాలు నిర్మాణం కానున్నాయనేది తెలుస్తోంది. ఇప్పటికే తిరుమలలో సిఆర్ఒకు సమీపంలోనే ఉన్న సుదర్శన్,గోవర్ధన్, కల్యాణి సత్రాలు,సి టైప్‌క్వార్టర్స్, పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో మ్యూజియం మార్గంలో కొన్ని విశ్రాంతి గృహాలు పూర్తిగా పాతవి కావడం, గోడలు, గదులు పెచ్చులూడే దుస్థితికి చేరాయి.

# భాగ్యనగర్ అమ్మవార్లకు బెజవాడ దుర్గమ్మవారి ఆషాఢం సారె



కింజరపు రామ్మోహన్ నాయుడు, కేశినేని చిన్ని లకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జూలై 18, ప్రభాతవార్త** తెలంగాణలో జరుగుతున్న బోనాల ఉత్సవాల్లో భాగంగా శ్రీ భాగ్యనగర్ మహంకాళీ బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల్లో కొలువైన అమ్మవార్లకు బెజవాడ దుర్గమ్మవారి ఆషాడం సారెను శుక్రవాం అందించారు. ఉప్పుగూడలోని శ్రీ మహంకాళీ దేవాలయం, లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళీ దేవాలయం, గౌలిపూరాలోని శ్రీ మహంకాళీ దేవాలయం, సుల్తాన్ షాహీలోని శ్రీ జగదాంబ దేవాలయం, హరిబౌలి లోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం, హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న దేవాలయం, మీర్‌ఆల్‌మండిలోని శ్రీ మహంకాళేశ్వర దేవాలయం అమ్మవార్లకు బెజవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ వికె శీనా నాయక్ ఆధ్వర్యంలో ఆషాడం సారెను తీసుకెళ్ళగా అక్కడ మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదమంత్ర పఠనాలతో స్వాగతం పలికి ఆషాడం సారెను శ్రీ అమ్మవార్ల ముందుంచి పూజాదికాలు నిర్వర్తించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ వికె శీనా నాయక్, ఆలయ ప్రధానార్చకులు ఎల్ దుర్గాప్రసాద్, ఆర్ శ్రీనివాస శాస్త్రి, వేదపండితులు, ఎఇఓ డా కొచ్చెర్ల గంగాధర్, సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్, ఈఓ సిసి జయప్రకాష్, కార్యాలయ సిబ్బంది పునీత్‌కుమార్ కె లీలాకృష్ణ బృందంకు మెమొంటో, శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వ నిర్దేశిత పోషకాహారం అందించండి : ఆహార కమిషన్ చైర్మన్‌చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి

**విజయవాడ,జూలై18,ప్రభాతవార్తప్రతినిధి:** అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వ నిర్దేశిత పోషకాహారం అందించాలని రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్‌చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి ఆదేశించారు. ఈ విషయంలో ఎటువంటి ఫిర్యాదులు తలెత్తినా సహించమన్నారు. రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన సంబందిత శాఖ అధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమీషన్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశములో ప్రజా పంపిణి వ్యవస్థ, మహిళా,శిశు అభివృద్ధి సంస్థ (అంగన్వాడి), మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్దుల వసతులు మరియు ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకాల అమలు తీరును.ఇతర లోటు పాట్ల గురించి ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్‌చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రేషన్ సరుకులు కార్డుదారులకు సక్రమంగా అందేల చూడాలని, అంగన్వాడి సెంటర్లలో గర్భిణి స్త్రీలు/ బాలింతలు/పిల్లలకు ప్రభుత్వ నిబంధనల మేరకు భోజనం, గుడ్లు, బాలామృతం, బాల సంజీవని వంటి పోషకాహారాలను సక్రమంగా పంపిణి చేయాలని సూచించినారు. అలాగే పాఠశాలల్లో, సంక్షేమ హాస్టళ్ళలో ఉండే విద్యార్దులకు ప్రభుత్వం నిర్ణయించిన "మెనూ" ప్రకారం భోజనం, గుడ్లు, చిక్కిలు అందించాలని తెలిపారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం క్రింద గర్భిణి స్త్రీలకు మొదటి కాన్పుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ. 5,000/ లతో పాటు అదనం గా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతం వారికి రూ. 1,000/ మరియు పట్టణ ప్రాంత ప్రజలకు రూ. 600 / మరియు రెండవ కాన్పుకు ఆడ శిశువు అయితే 6,000 ఒకేసారి ఇస్తారని వాటిని అదించాలన్నారు.

# సైబర్ క్రైమ్స్ పై ఉక్కుపాదం మోపే విధంగా చట్టానికి పదును

## - శాసనసభ పిటిషన్ల కమిటీ చైర్మన్., శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె. రఘురామ కృష్ణ రాజు



శాసనసభ పిటిషన్ల కమిటీ సమావేశంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె. రఘురామ కృష్ణ రాజు

**విజయవాడ, జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** సైబర్ క్రైమ్స్ పై ఉక్కుపాదం మోపే విధంగా ప్రస్తుతం ఉన్న చట్టానికి మరింత పదును పెట్టే విధంగా వచ్చే శాసన సభా సమావేశాల్లో చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ అభిప్రాయ పడుతున్నట్లు ఆ కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె. రఘు రామకృష్ణ రాజు తెలిపారు. పటిష్టమైన చట్ట రూపకల్పనకు హోం, ఐటి శాఖ కార్యదర్శులతో నేడు జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ సమావేశంలో సమగ్రంగా చర్చించడం జరిగిదని ఆయన తెలిపారు. శుక్రవారం రాష్ట్ర శాసన సభ భవనంలోని తమ ఛాంబరులో కమిటీ సభ్యులు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం ఉత్తర ఎమ్మెల్యే పి విష్ణు కుమార్ రాజు మరియు చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్మోహన్ తో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడిచేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుచున్న సైబర్ క్రైమ్స్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే పలు ఆదేశాలు జారి చేయడం జరిగిందని, వారి ఆదేశాల మేరకు ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ వల్ల రాష్ట్రంలోని ఎంతో మంది అమాయకులు మోసపోతున్నారని, వీటికి సంబందించి కేవలం 4 శాతం కేసులు మాత్రమే రిజిస్టరు అయ్యాయని, మొత్తం రూ.960 కోట్లు మేర మోసం జరిగిందని, ఇందులో రూ.300 కోట్ల వరకూ రికవరీ చేయడం జరిగిందని గత ఏడాది నివేదికలు వెల్లడిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ లెక్కన ఏడాది దాదాపు రూ.30 వేల కోట్ల వరకూ సైబర్ క్రైమ్ మోసాలు జరుగుచున్నట్లు ఆయన తెలిపారు.

# భక్త జనకోటికి సకల సదుపాయాలు - సుదర్శనం కల్పించాలి! అధికారులకు ఎమ్మెల్యే సూచన

**శ్రీకాళహస్తి,జూలై 18 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయమైన విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్బంగా స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆలయాధికారులకు దిశదేశ నిర్దేశం చేసారు. వచ్చిన భక్తులు ఎవ్వరూ అసంతృప్తి చెందకుండా దర్శనం చేసుకోవాలని సూచించారు. ఈ నేపధ్యంలో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డిలతో పూజా విధానాలపై అర్చకుల అభిప్రాయాలతో ఏర్పాట్లు చేపట్టారు.

# తోరణగల్లు-రంజిత్ పురా మధ్య మంజూరు అయిన డబ్లింగ్ రైలు మార్గం

**గుంతకల్లు రైల్వే, జూలై 18,ప్రభాతవార్త** నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ పరిధిలో అత్యంత కీలకమైన తోరణగల్లు-రంజిత్ పురా స్టేషన్ల మధ్య రూ.458.83కోట్ల అంచనా వ్యయంతో డబ్లింగ్ రైలు మార్గాన్ని చేపట్టేందుకు రైల్వే శాఖ మంజూరు చేసింది. గతంలో దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని ఇనుప ఖనిజం గనులున్న దోనమలై ఎన్ఎండిసి సెక్టార్‌లో కేంద్రప్రభుత్వ సంస్థ అయిన జాతీయ ఖనిజ ఉత్పత్తి అభివృద్ధి సంస్థ(ఎన్ఎండిసి) ఇనుప ఖనిజాన్ని వెలికి తీసి యాసిన్ కిరా, హొస్పేటల మీదుగా వివిధ ప్రాంతాలలోని ఓడరేవుల ద్వారా 1960దశకంలో రవాణా వ్యవస్థను ప్రారంభించింది. కాలక్రమేనా దేశ విదేశాల్లో మన ఇనుప ఖనిజానికి భారీగా డిమాండ్ పెరగడంతో 1970వ దశకంలో గుంతకల్లు-హొస్పేట్, తోరణగల్లు-రంజిత్ పురా మధ్య బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసి మద్రాసు హార్బర్‌కు బాక్స్-ఎన్ వ్యాగన్ల గూడ్స్ ద్వారా ఇనుప ఖనిజాన్ని రవాణా చేయడం ప్రారంభించారు. తద్వారా రైల్వే ఆదాయం భారీగా పెరిగింది. యూనిగేజ్ ప్రాజెక్టులో భాగంగా- హొస్పేట్-హుబ్లీ-వాస్కోడిగామా మధ్య బ్రాడ్ గేజ్ రైలు మార్గం పూర్తి చేసి హుబ్లీ డివిజన్ మీదుగా మళ్లించారు. దాదాపుగా మూడున్నర దశాబ్దాల పాటు రాయలసీమ జిల్లాల మీదుగా మద్రాసు ఓడరేవు ద్వారా విదేశాలకు ఎన్ఎండిసి ఇనుప ఖనిజాన్ని రవాణా చేసింది. అయితే ప్రస్తుతం ఉన్న తోరణగల్లు-రంజిత్ పురా సింగిల్ లైన్ రైలు మార్గానికి అదనంగా 23కి.మీల డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టు చేపట్టేందుకు రైల్వే శాఖ తాజాగా రూ.458.83కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టును మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏడాదికి అదనంగా 5.64మిలియన్ టన్నుల సరుకు రవాణా పెరుగుతుంది.

# ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం డిప్లొమా కోర్సు సప్లిమెంటరీ పరీక్షలు

**విజయవాడ,జూలై 18,ప్రభాతవార్త ప్రతినిధి:** పాత్రికేయులు, సాధారణ అభ్యర్థుల కోసం సి. ఆర్.మీడియా అకాడమి 2023- 24 సంవత్సరంలో నిర్వహించిన "జర్నలిజం డిప్లొమా కోర్సు" సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తమ అభ్యర్థన మేరకు అంగీకరించిందని చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కోర్సులో నమోదై, పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించలేని అభ్యర్థులకు మాత్రమే ఈ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన నాలుగు పేపర్లకు పత్రికలకు రాయడం, ఎలక్ట్రానిక్ మీడియా నైపుణ్యాలు, కొత్త మీడియా, మీడియా చట్టాలు నైతికాంశాలు పేపర్లుకు సంబంధించి ఆగస్టు 11 నుంచి 14 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు.

సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కాగోరే అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్ సైట్‌లో ఈ నెల 20 వ తేదీ నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తులు సమర్పించాల్సి వుంటుందని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది 310725 కాగా, రూ.100 అపరాధ రుసుముతో 02.08.25 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం యూనివర్సిటీ కల్పించిందని తెలిపారు. పరీక్ష రుసుము రూ. 1000 (వెయ్యి రూపాయలు) అభ్యర్థులు యూనివర్సిటీకి చెల్లించాల్సి వుంటుందన్నారు.

# రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలలో 92శాతం పోలింగ్

**గుంతకల్లు రైల్వే, జూలై 18,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక మండలికి జరిగిన సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్ ముగిసే సమయానికి 92శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. శుక్రవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రారంభంలో మందకోడిగా సాగినా 11గంటల నుంచి వేగం పుంజుకుంది. ఇన్‌స్టిట్యూట్‌లో మొత్తం 944మంది ఓటర్లు(సభ్యులు)కు గాను పోలింగ్ ముగిసే సమయానికి 866మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## శాకంబరీగా దర్శనమిచ్చిన విజయ కనకదుర్గ..అమ్మవారికి బోనాలు,ఆషాడ సారే సమర్పణ



**శంఖవరం , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న విజయ కనకదుర్గ అమ్మవారు శాకంబరీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాడమాసం పురస్కరించుకొని అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు పండ్లు తో సుందరంగా అలంకరించడంతో అమ్మవారు దేదీప్యమానింగా వెలుగొంది భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా శుక్రవారం కలిసి రావడంతో భారీ ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు ముందుగా ఆలయ పూజారి ద్వివేదుల నాని , జగన్నాధ శర్మ ఆలయంలోఅష్టోత్తరంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా 108 సుహాసిని స్త్రీలతో బోనాలను సమర్పించారు. ముందుగా మేళతాళాల మధ్య గ్రామపురవీధుల్లో అమ్మవారి నామస్వరం చేసుకుంటూ ఊరేగింపు గావించారు అనంతరం ఆలయంలో అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గ్రామస్తులు అమ్మవారికి ఆషాడ సారే 108 రకాల స్వీట్లు ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం గావించారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తో పాటు పరిసర గ్రామాల నుండి మహిళలు భక్తులు భారీ సంఖ్యలు తరలివచ్చి అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గౌతు కన్నారావు గౌతు అర్జిబాబు లు మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో ప్రతి పౌర్ణమికి చండీ హెూమం ప్రతి శుక్రవారం భక్తులు సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నామని పేర్కొ న్నారు ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ డ్రైవర్స్ కార్యవర్గం సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ



**మామిడికుదురు , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

అప్పనపల్లి గ్రామ దేవత శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారికి గ్రామస్తులు శుక్రవారం ఆషాఢ మాసం సారె సమర్పించారు.శ్రీ బాల బాలాజీ దేవస్థానం తరపున ఈ సారెను సమర్పించారు.ఆలయ ఈ.ఓ.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లారు.70 కిలోల స్వీట్లు పలు రకాల పండ్లు, పువ్వులు, గాజులు,గజమాల,పసుపు నీళ్లు,వడపప్పు,చలిమిడి తదితర రకాలను మేళ తాళాలు,డప్పు వాయిద్యాలు భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపుగా బయలు దేరి వెళ్లారు. అమ్మవారికి పుష్పాలు గజమాల అలంకరించిన అనంతరం సారెను సమర్పించారు. అక్కడ జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి

**- లైసెన్సులు, డాక్యుమెంట్లు, ఇన్సూరెన్స్ తప్పనిసరి : రావులపాలెం టౌన్ సి.ఐ శేఖర్ బాబు**



**రావులపాలెం , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని టౌన్ సి.ఐ. శేఖర్ బాబు, మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ లు సూచించారు. రావులపాలెంలో ఆటో యూనియన్ ఆఫీస్ వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ట్రాఫిక్ నియమాలపై డ్రైవర్లకు వారు వివరించారు. ఈ సందర్భంగా టౌన్ సి.ఐ. శేఖర్ బాబు, మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ అందరూ పాటించాలని అన్నారు.ప్రయాణికులను ఆటో ఫ్రెంట్ సీట్లో కూర్చోబెట్టకూడదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. డ్రైవింగ్ చేసే ప్రతి ఆటో డ్రైవర్ దగ్గర తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ పత్రాలు ఉండాలని స్పష్టం చేశారు. ఇవి లేకుండా రోడ్లపై వాహనాలు నడపడం ప్రమాదకరం మాత్రమే కాకుండా శిక్షలు కూడా విధించడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రావులపాలెం టౌన్ స్టేషన్ ఎస్ఐ కెవి రమణ రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని ఆటో డ్రైవర్లకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు ప్రజల రక్షణకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు చూపించారు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్లే రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించవచ్చని తెలిపారు.

## మాధకద్రవ్యాలపై అవగాహన సదస్సు




**అమలాపురం రూరల్ , జులై 17 , ( ప్రభాతవార్త )**

మాదక ద్రవ్యాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అమలాపురం డిఎస్పీ టి. ఎస్.ఆర్. కె. ప్రసాద్ అన్నారు శుక్రవారం అమలాపురం మండలం భట్లపాలెం బివిసి ఇంజనీరింగ్ కాలేజీలో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మత్తుమందులు కుటుంబాలను, ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందన్నారు. అవగాహన అత్యావశ్యమన్నారు. ఆరోగ్యమే మహా భాగమని, దాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం అని ఆయన చెప్పారు. యోగా వంటి ఆరోగ్య అంశాల పట్ల ఆసక్తి కలిగి ప్రతి రోజు సాధన చేయడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందులు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా ఆర్థికంగా, మానసికంగా కుటుంబాలను నాశనం చేస్తుందన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభమయ్యాయని వాటి చుట్టు పక్కల ఎటువంటి విక్రయాలు, కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మారు మూల ప్రాంతంలో మాదక ద్రవ్యాల విక్రయాలు వివిధ రూపాల్లో ఉండే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. మాదక ద్రవ్యాలు, మత్తుమందుల ఉత్పాదకత, సరఫరా, రవాణా, విక్రయాలు, వినియోగం జరిగితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలానేప్రతీ విద్యార్థి డ్రగ్స్ జోలికి వెళ్లకుండా భవిష్యత్ కోసం విద్యార్థులు పాటుపడాలని తెలియచేసారు.రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై శేఖర్ బాబు, బీవీసీ ప్రిన్సిపాల్,డాక్టర్. జె వి జి రామారావు ఏవో జక్కం కృష్ణారావు పీడీ రవి సుధీర్, ఎన్. ఎస్. ఎన్. ఆఫీసర్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీల అభివృద్ధికి కృషి చేయండి..
## ఎమ్మెల్యే సత్య ప్రభ ఎమ్మెల్యేను సత్కరించిన సొసైటీ చైర్మన్



**ప్రతిపాడు , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

ప్రాథమిక సొసైటీల అభివృద్ధికి నూతన కమిటీలు కృషి చేయాలని ప్రత్తిపాడు శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు మండలంలోని పెద్ద శంకర్ల పూడిలో గల పార్టీ కార్యాలయంలో శుక్రవారం శంకవరం మండలం కత్తిపూడి సొసైటీకి నూతన చైర్మన్ గా ఎన్నికైన బాబు కృష్ణమూర్తి ఎమ్మెల్యేను సాలువ వేసి గజమాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో 90 శాతం మంది వ్యవసాయ ఆధారిత కుటుంబాలేనని తమ పదవు లకు వన్నెతెచ్చేలా కమిటీ డైరెక్టర్లు, చైర్మన్, వైసై ర్మన్లు పాటుపడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు కనీస గిట్టుబాటు ధరలేక వ్యవసాయం దండగ అనే భావనను కలిగించారన్నారు. రైతులను ఆదుకునేందుకు అన్నదాత సుఖీభవపథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. తమ పార్టీ అదినేత ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన సూపర్సిక్స్ పథకాలలో ఇప్పటికే పించన్ల పెంపు, మూడు ఉచిత గ్యాస్ సిలం డర్లు, తల్లికివందనం, అన్నాక్యాంటీన్లు ప్రారంభిం చగా ఈనెలాఖరున అన్నదాత సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, త్వరలో ఆడబి డ్డ నిధి పథకం అమలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సొసైటీల ద్వారా రైతులకు వచ్చే ప్రతి పథకాన్ని రైతులు అందించాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ఏళ్ల జగదీష్ రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షులు వెన్న శివ, బద్ది రామారావు, గాబు సత్యనారాయణమూర్తి (పెద్దకాపు) ,సాధనాల లక్ష్మీ బాబు కంచి పోయిన శ్రీను కాలింగ్ జనార్ధన్ నక్క శ్రీను గాబు శివ నాయుడు బుజ్జి దేశ లింక వెంకట రమణ పీర్ల అప్పారావు యాగా వీరబాబు పాలం చిన్న తదితరులున్నారు

## ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి చేర్చేది విద్య మాత్రమే

**- ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి**



**గండేపల్లి , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలల కు చెందిన సి.ఎస్.ఇ., ఇఇఇ బ్రాంచ్ లకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు నేటి నుంచి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థి తల్లిదండ్రుల సమావేశం లో ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు తమ కర్తవ్యాన్ని లక్ష్యాలను నిరంతరం గుర్తెరిగి మసలుకోవాలి అన్నారు.ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేర్చేది విద్య మాత్రమే అని అన్నారు.ఆదిత్య పై అపార నమ్మకం తో తమ చిన్నారులను తమ సంస్థలో చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ విద్యార్థి ఉన్నతికి ఆదిత్య యాజమాన్యం ఎల్లవేళలా కృషి చేస్తుందని అయితే తల్లిదండ్రులు మీ వంతు సహకారం ఆదిత్య కు అందిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సులభం అని తెలిపారు.విద్యారుల తల్లిదండ్రులు తమ తమ పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తరచు కళాశాలకు వచ్చి వారి యొక్క విద్యా పరమైన మరియు హాజరు తదితర సమాచారం తెలుసుకోవాలని పాలిటెక్నిక్ విద్యార్థులు అధిక శాతం పేద, దిగువ మధ్యతరగతికి చెందిన కుటుంబాలకు చెందిన వారు కావున విద్యార్థులు క్రమశిక్షణతో మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలి అని క్రమశిక్షణతో ఏ రోజు పాఠాలను ఆ రోజు అవగతం చేసుకుని సందేహాలను ఉపాధ్యాయులను సంప్రదించి నివృత్తి చేసుకుంటే ఉత్తీర్ణత సాధించడం పెద్ద కష్టం కాదు అని మంచి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం తో మీ చిన్నారులను తీర్చిదిద్దటానికి మీరు మేము కలిసి ముందుకు సాగాలని సూచించారు. పాలిటెక్నిక్ పట్టా తో పాటు మంచి వార్షిక ఆదాయం తో ఉద్యోగం అందిస్తున్న నమ్మకమైన కళాశాల ఆదిత్య అని అందుకు ఆదిత్య తీసుకుంటున్న ప్రణాళిక బద్ధమైన చర్యలే అని అన్నారు.విద్యార్థి యొక్క నియమావళి ఆదిత్య యొక్క నిబంధనలు హాజరు యొక్క ప్రాముఖ్యత వారాంతపు నెలవారీ పరీక్షల వివరాలు తదితర విషయాలను గురించి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఎస్.టి.వి.ఎస్.కుమార్ తెలిపారు. 2012-2015 బ్యాచ్ మెకానికల్ స్టూడెంట్ మహ్మద్ నయీమ్ మాట్లాడుతూ ఆదిత్య లో క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వల్లనే నేడు 25 లక్షల వార్షిక వేతనం తో ఉద్యోగం చేస్తున్నాను అని,తన సోదరి ఇదే ఇంజనీరింగ్ కళాశాల లో చదివి తాను కూడా ఉద్యోగం చేస్తుందని నేడు తన మేనల్లుడిని జాయిన్ చేయడం కోసం వచ్చి మీముందు సగర్వముగామాట్లాడగలుగుతున్నాను అంటే ఆది ఆదిత్య ఇచ్చిన ఈ జీవితం అని ఆనందం వ్యక్తం చేసారు. అదే విధంగా ఒక పేరెంట్ మాట్లాడుతూ తన ఇద్దరు పిల్లలు ఆదిత్య లో చదివి అత్యున్న స్థాయికి చేరుకున్నారని వివరించారు. అనంతరం ఆదిత్య తరుపున వారిని దుశ్శాలువతో సత్కరించారు. ఆదిత్య లో తమ విద్యార్థులకు ప్రవేశం లభించడం ఆనందదాయకం అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కళాశాల డీన్ .ఏ. మాధవరావు. వివిధ విభాగాల అధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డా. సతీష్ తన ప్రసంగం లో విద్యార్థి కి ఉండవలసిన లక్షణాలు,దీక్ష,పట్టుదలగురించి వివరించారు. తాను ఏమి కావాలనుకుంటున్నారు అనే విషయంపై నిర్దిష్టమైన అభిప్రాయం ఏర్పాటు చేసుకుని ఆ మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. వివిధ నాయకుల జీవితంలో జరిగిన సంఘటనలు ఉదహరిస్తూ సాగిన ప్రసంగం సభికులను ఎంతగానో ఆకట్టుకుంది.

## వనదుర్గమ్మ ఆలయంలో ఘనంగా చండీ హెూమం



**అన్నవరం , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం రత్నగిరి పై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హెూమము ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ,పుణ్యహ వాచనం, అమ్మవారికి మూల, మంత్ర జపములు, సప్తసతి పారాయణ నిర్వహించారు.

మండపారాధన, కళశ స్థాపన అనంతరం చండీహెూమం నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పవిత్ర హెూమద్రవ్యాలు సమర్పించి 11 గంటలకు హెూమానికి పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు మరియు వేదపండితులు,ఋత్విక బృందం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికా రులు, సిబ్బంది భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ అధికారుల తనిఖీలు



**సీతానగరం , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

మండలంలోని బొబ్బిలంక గ్రామంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అధికారులు ఎరువులు, పురుగుమందుల షాపులలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏడీఏ రవీంద్ర ఈ తనిఖీలను నిర్వహించారు.

ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన ఈ తనిఖీలు మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగాయి. ఈ తనిఖీల్లో పురుగుమందులు, ఎరువుల దుకాణాల్లో ఎటువంటి అవకతవకలు గుర్తించలేదని తనిఖీ అధికారులు తెలియజేశారు. ఈ తనిఖీల్లో కొరుకొండ ఏడీఏ మల్లికార్జున రావు, సీతానగరం మండల వ్యవసాయ అధికారి ఏ. గౌరీదేవి, ఏఈఓ గురుప్రియ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు రమాదేవి పాల్గొన్నారు.

## రైతుల కొంపముంచిన భారతి..లబోదిబోమంటున్న బాధితులు



**కాట్రేనికోన , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

కర్ణుడు చావుకు సవాలక్ష కారణాలు ఉన్నట్లు వరి రైతులు నాశనానికి అన్నే కారణాలు కనిపిస్తున్నాయి. ప్రకృతి సహకరిస్తే దళారులు సహకరించరు. దళారులు కరుణిస్తే ప్రకృతి సహకరించదు. ప్రతి ఏటా రైతు అనేక విధాలుగా నష్టపోతున్నాడు. తాజాగా కాట్రేనికోనలో నకిలీ విత్తనాల బారినపడి రైతులు లబోదిబోమంటున్నారు. వెంకమ్మ చెరువు గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతులు కాట్రేనికోనలోని ఒక ప్రముఖ ఎరువుల దుకాణంలో భారతి కంపెనీ విత్తనాలు కొనుగోలు చేశారు. ఒక్కొక్క బస్తా ధర రూ 1300 చొప్పున చెల్లించారు. మొలకలు సరిగా రాకపోవడంతో నిరాశ చెందారు. దీంతో సదరు డీలర్ను నిలదీశారు. వేరే కంపెనీ బస్తాలు ఇప్పిస్తానని ఆయన చేతులు దులుపుకున్నాడు. చేలో వచ్చిన కొద్దిపాటి మొలకల్ని బాధిత రైతులు తొలగించారు. ఇప్పటికే నారు వేయటం చాలా ఆలస్యమైందని మరలా విత్తనాలు తెచ్చి చల్లిన తర్వాత మొలకలు వస్తాయో లేదోనని వీరు ఆందోళన చెందుతున్నారు. నకిలీ విత్తనాల విషయం బయటకు పొక్కడంతో సరఫరాదారులు హడావుడిగా బాధితుల దగ్గరకు వెళ్లి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. బస్తాలకు బస్తాలు ఇస్తారు సరే మరి కూలీ పనులు ఇతర ఖర్చులు మాటేమిటిని రైతులు నిలదీస్తున్నారు. ప్రతి ఏటా నకిలీ విత్తనాల బారినపడి రైతులు నష్టపోతున్నారు. కమీషన్ల కక్కుర్తి తో డీలర్లు కొత్త విత్తనాల కంపెనీలను ప్రోత్సహిస్తున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత టెస్టింగ్ చేయాలి. 90 శాతం మొలకెత్తిన తర్వాతే అమ్మకాలు జరపాలి. క్షేత్రస్థాయిలో ఎరువుల డీలర్లు ఇందుకు విరుద్ధంగా ఉంటున్నారు. ఈ విషయంలో తమకు న్యాయం జరగకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని బాధిత రైతుల్లో కొంతమంది పేర్కొన్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారి మృదులను వివరణ కోరగా ఏవిధమైన ఫిర్యాదు రైతుల నుండి తనకు అందలేదన్నారు.అయినప్పటికీ ఈ విషయమై తన సిబ్బందికి సూచనలు చేయడం జరిగిందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బిల్లులు ఇవ్వడంలేదు : ఎరువుల దుకాణాల నుండి విత్తనాలు ఇతర ఎరువులు కొనేటప్పుడు డీలర్లు ఏవిధమైన రసీదులు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు .

## వాడపల్లి వచ్చే భక్తులకు జల ప్రసాదం కూలర్లు
## ప్రారంభించిన డిప్యూటీ కమీషనర్, ఈఓ,నల్లం సూర్య చక్రధరరావు



**ఆత్రేయపురం , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ప్రతి శనివారం పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానంనకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం వారి కోసం ఆలయంలో ఏర్పాటు చేసిన చల్లని మంచినీరు అందించే జల ప్రసాదం కూలర్లను దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ కూలర్ల ఏర్పాటు వల్ల ఆలయానికి వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా చల్లని శుద్ధ జలం అందుబాటులో ఉంటుందని ఆయన అన్నారు. భక్తులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ఏడు వారల స్వామికి అష్టోత్తర పూజలు..గోవిందనామస్మరణతోమర్మోగిన వాడపల్లి క్షేత్రం

**- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.5,80,778/-లు**



**ఆత్రేయపురం , జులై 17 , ( ప్రభాతవార్త ) :**

ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడువారాల స్వామి గా ఖ్యాతి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శుక్రవారం వేలాదిమంది భక్తులు విచ్చేసిస్వామివార్ని దర్శించుకున్నారు. శ్రీ స్వామి వారి ఏడువారాల నోము పూర్తి అయిన భక్తులు అష్టోత్తరపూజలలో పాల్గొన్నారు.వివిధ సేవల ద్వారా స్వామివారికి శుక్రవారం ఒక్కరోజు రూ,5,80,778/-లు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు. ఉదయం మేలుకొలుపు ఐశ్వర్య లక్ష్మి హెూమం గోపూజ అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన పవళింపు సేవ తదితర కార్యక్రమాలు అర్చకులు వేదమంత్రాలతో కమనీయంగా నిర్వహించారు శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులకలగకుండా అన్ని ఏర్పాట్లు దేవస్థానం అధికారులు ఏర్పాటు చేశారు

# సొసైటీ ఛైర్మన్ సత్కరించిన జనసేన నాయకులు



**శంఖవరం , జులై 17 , ( ప్రభాతవార్త ) :** కత్తిపూడి సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు కరణం సుబ్రహ్మణ్యం గాబు సుభాష్ లు అన్నారు. కత్తిపూడి సొసైటీ కి నూతన ఛైర్మన్ గా ఎన్నికైన గాబు కృష్ణమూర్తి సొసైటీ సభ్యుడు ఎన్నికైన జనసేన పార్టీ కి చెందిన శరణం జయ బాబు ఇరువురిని జనసేన పార్టీ తరఫున ఘనంగా సత్కరించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో అధిక శాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తారని రైతులకు రుణ సౌకర్యాలను కల్పించాలని కోరారు రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తుందని వాటిని రైతులకు అందేలా సొసైటీ సభ్యులు కృషి చేయాలని కోరారు రుణాలు కల్పించే సహకార సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోసిన వెంకటేశ్వరరావు తలపంటి బుజ్జి,గంగాధర్ ,కిరణ్,కీర్తి కుమార్, కొయ్య శ్రీను ,ప్రవీణ్,గౌతు బుజ్జి, పిల్లి దుర్గ మరియు అధిక జనసైనికులు పాల్గొన్నారు

# వాడపల్లి కాలినడకన వచ్చే భక్తులకు ఉచిత బస్





**ఆత్రేయపురం , జులై 17 , ( ప్రభాతవార్త ) :** కోనసీమ తిరుమల వాడపల్లి దేవస్థానం నకు వచ్చే భక్తుల రద్దీ ప్రతి శనివారం పెరుగుతున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్ ఏర్పాటు చేసి నట్లు దేవస్థానం ఈఓ, డిప్యూటీ కమీషనర్, నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ వ్యాపార వేత్త,విక్టరీ గ్రూప్ కంపెనీ అధినేత గొలుగురి వెంకటరెడ్డి ఏర్పాటు చేసిన రెండు బస్సులను కాలువ వారధి నుండి దుర్గమ్మ గుడి వరకు భక్తులను తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.

శుక్రవారం ఈ రెండు బస్సులను ట్రయిల్ రన్ వేయడం జరిగిందని కావున భక్తులు కాలినడకన వచ్చే భక్తులు, ఆటోలో వచ్చే భక్తులు వారధి నుండి దుర్గ గుడివరకు ఉచిత ంగా ప్రయనిం చవచ్చని భక్తులు ఈ సౌకర్యాన్ని ఉపయోగిం చుకువాలని ఆయన కోరారు

# వాడపల్లి క్షేత్రంలో తిరుమల, షిర్డీ తరహాలో కంపార్ట్మెంట్ల ఏర్పాటుకు ప్రణాళిక

**- డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో నల్లం సూర్య చక్రధరరావు**



**ఆత్రేయపురం , జులై 17 , ( ప్రభాతవార్త ) :** ఏడు వారల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం తిరుమల, షిర్డీ తరహాలో కంపార్ట్మెంట్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్ల సూర్య చక్రధరరావు తెలిపారు. భక్తుల నుండి సమస్యలను,సూచనలను,సలహాలను స్వీకరించేందుకు శుక్రవారం ఏర్పాటుచేసిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈ అంశాన్ని వెల్లడించారు. భీమవరం నుంచి మురళి అనే భక్తుడు చేసిన ఫోన్ కాల్ కు స్పందించిన సందర్భంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఈ అంశాన్ని తెలిపారు.సుప్రభాత సేవకు సంబంధించి పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు గాను ప్రతి శనివారం సుప్రభాత సేవ టికెట్లు ముందటి ఆదివారం ఉదయం 9 గంటలకు ఆన్లైన్లో ఉంచడం జరుగుతుందని చక్రధరరావు తెలిపారు. గతవారం రూ.200 టికెట్లు తీసుకున్న భక్తుల రద్దీ అధికంగా ఉండడం గమనించి మరిన్ని క్యూ లైన్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శనివారం వచ్చే లక్షలాది భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, చిన్నపిల్లలకు పాలు, క్యూలైన్లలో భక్తుల కోసం ఫ్యాన్ల ఏర్పాటు జరిగిందన్నారు. మరుగుదొడ్ల సంఖ్యను సైతం పెంచామన్నారు. లగేజ్ కౌంటర్ కు సంబంధించి గతంలో తాను ఎదుర్కొన్న సమస్యను జగ్గంపేట నుంచి సతీష్ అనే భక్తుడు తెలుపగా స్వయంగా తానే వెళ్లి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానన్నారు. మొత్తం 20 వరకు వచ్చిన ఫోన్ కాల్స్ లో భక్తులు అడిగిన అనేక ప్రశ్నలకు డిప్యూటీ కమిషనర్ సమాధానం ఇచ్చారు. వారు వెల్లడించిన సమస్యలను వెనువెంటనే పరిశీలించి పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చక్రధరరావు మాట్లాడుతూ శనివారం ఉదయం 4.15కి మొదలయ్యే దర్శనాలు మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు జరుగు తాయని స్వామివారి నివేదన కోసం ఒక్క పావుగంట మాత్రమే నిలుపుదల చేస్తున్నామని ఆ తరువాత 12 గంటల 45 నిమిషాల నుంచి నుంచి మొదలుపెట్టి రాత్రి చివరి భక్తుడు దర్శనం చేసుకునే వరకు కొనసాగి స్తున్నామని తెలిపారు. డయల్ యువర్ ఈవో ద్వారా గాని లేదా నేరుగా గాని స్వామి వారి భక్తులు చెప్పే సమస్యలకు,ఇబ్బందులకు పరిష్కారం చూపడంతో పాటుగా సలహాలను తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

## బాబు షూరిటీ...మోసం గ్యారంటీ..కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి : నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు



**అంబాజీపేట , జులై 17 , ( ప్రభాతవార్త ) :** వైసిపి అధిష్ఠానం ఆదేశాల మేరకు ఈనెల 21 నుండి పి.గన్నవరం నియోజకవర్గంలో చేపట్టనున్న బాబు షూరిటీ... మోసం గ్యారంటీ.. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పి.గన్నవరం నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గంగలకుర్రు అగ్రహారంలో వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఇంటి వద్ద నియోజవర్గ స్థాయి పార్టీ సమావేశం ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినా రైతులకు ప్రయోజనం కలిగించే ఏ పథకమూ అమలు చేయలేదన్నారు. పంట సాయం డబ్బులు వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, కనీసం రైతన్నల కష్టానికి తగ్గ ఫలితంగా గిట్టుబాటు ధరలు కల్పించలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు.ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాది గడుస్తున్న ఎన్ని హామీలు అమలు చేశారని ప్రశ్నించారు. అనంతరం పార్టీ మండల శాఖ మహిళా అధ్యక్షురాలుగా నియమితులైన జడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పీకే రావు,మందపాటి కిరణ్ కుమార్, పాముల ప్రకాష్, దొమ్మేటి సత్యమోహన్,వక్కలంక రాధాకృష్ణమూర్తి,పేరి శ్రీనివాస్, కొర్లపాటి కోటబాబు,కోట బేబిరాణి, ఉందుర్తి నాగబాబు, ముత్తాబత్తుల ప్రశాంత్,బూల సత్యనారాయణమ్మ, సూదాబత్తుల రాము, మట్టపర్తి హరి, ఎం.ఎం .శెట్టి,గంటి శ్రీరామ చంద్రమూర్తి, మద్దింశెట్టి మల్లిబాబు,గోగి శ్రీరామ్మూర్తి, గోసంగి కుమారస్వామి, వాసంశెట్టి వెంకన్న, రాయుడు కృష్ణ మహేష్ తదితరులు పాల్గొన్నారు..

## ఎన్. ఎన్. పట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు



**రౌతులపూడి , జులై 17 , ( ప్రభాతవార్త ) :** మండలంలోని ఎన్.ఎన్. పట్నం లో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేవరుపుల సత్యప్రభ ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్యదేవునికే శఠగోపం





**- దేవస్థానం లో కిలాడీలు**
**- కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్న ఉద్యోగులు**
**- నిద్రావస్థలో ఆడిట్**

**కాకినాడ , జులై 17 , ( ప్రభాతవార్త ) :** అన్నవరం దేవస్థానం పాలన గాడి తప్పుతోంది. "వడ్డించే వాడు మనవాడైయితే కడ బంతిలో కూర్చున్నా ఆహార పదార్థాలు వాటంతట అవే వస్తాయి". అన్నచందంగా ఉన్నతాధికారులు కాంట్రాక్టర్ కు కొమ్ము కాయడంతో లక్షల్లో దోపిడీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని దేవస్థానం దృష్టికి తీసు కొచ్చిన కార్మికులు ఉన్నతాధికారి రోజుకో పుణ్యక్షేత్రంలో గడుపుచున్నారు. పాలన కంటే ప్రొటోకాల్ కే అధిక ప్రాదాన్యత ఇస్తున్నారు. ఇది ఆసరా చేసుకుని క్రింద స్థాయి ఉద్యోగులు రాజ్యమేలు చున్నారు. తప్పుడు బిల్లులతో కూడిన ఫైల్స్ పంపినా ఇఓ కళ్ళు మూసుకొని సంతకం పెట్టేస్తారులే అన్న ధీమా ఉద్యోగులది అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం ఉద్యోగులు తప్పుడు ఫైల్స్ పెట్టినప్పటికీ, పసిగట్టాల్సిన ఆడిట్ అధికారులు సైతం పట్టించుకోక పోవడం వెనుక మతలబులేమిటో అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అన్నవరం దేవస్థానం లో శానిటరీ కాంట్రాక్టర్ భాగోతం ప్రకంపనలు రేపుతోంది. 349 మంది పారిశుధ్య కార్మికుల ఈపిఎఫ్ కాంట్రాక్టర్ మింగేసాడు. ప్రతీ నెలా కార్మికులకు చెల్లిస్తున్నట్లు నకిలీ చలానాలు సృష్టించాడు. గుడ్డి వాని ఎదుట దీపం పెట్టిన చందాన అధికా రులు అవి అసలివా, నకిలీవా అని పరిశీలిం చకుండా కాంట్రాక్టర్ కు పేమెంట్ మంజూరు చేసేసారు. కార్మికులు ఈ విషయం బయట పెట్టేవరకూ రాష్ట్రం లోనే పేరెన్నిక గన్న పెద్ద దేవస్థానం ఉన్నత అధికారులు గమనించక పోవడం శోచనీయం. అన్నవరం దేవస్థానం లో పారిశుధ్య నిర్వహణకు సంబందించి రెండు సంవత్సరాల క్రితం వరకూ హైదరాబాద్ కు చెందిన కెఎల్ టీఎస్ సంస్థ చూసేది. వాళ్ళ గడువు పూర్తయ్యాక, ఈ ఏడాది మార్చి 1 తేదీ నుండి గుంటూరు కు చెందిన కనకదుర్గ మ్యాన్ పవర్ సర్వీసెస్ వారికి నామినేటెడ్ గా శానిటరీ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.దేవస్థానం కు చెందిన అన్ని పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులు నిర్వహణకు గాను 349 మంది పారిశుధ్య సిబ్బంది తో పనులు చేయించుటకు గాను శానిటరీ సంస్థకు నెలకు 52 లక్షల రూపాయలు దేవస్థానం చెల్లించుటకు ఒప్పందం. అందులో కార్మిక చట్టం ప్రకారం గుత్తేదారు 16.25 శాతం ఈపిఎఫ్ గా సిబ్బంది పేరున జమ చేయాలి. ముందుగా ఈపిఎఫ్ కట్టాకే దేవస్థానం బిల్లు మంజూరు చెయ్యాలనేది నిబంధన. ఇక్కడే అసలు కిటుకు దాగిఉంది. మార్చి నుండి మే నెలవరకూ కార్మికులకు ఈపిఎఫ్ చెల్లించినట్లు నకిలీవి సృష్టించి,కాంటాక్టర్ దేవస్థానం నుండి కోటి 60 లక్షల రూపాయలు బిల్లును పొందాడు.


ఈ విషయంపై కొందరు పారిశుధ్య కార్మికులు ఇఓ కు ఫిర్యాదు చేసారు. కాంటాక్టర్ సమర్పించిన ఈపిఎఫ్ చలానాలు పరిశీలించి అధికారులు విస్తు పోయారు అవి నకిలీవని తేలింది. కాంటాక్టర్ ను పిలిపించి, దేవస్థానం ఇఓ దీనిపై ప్రశ్నించగా, కాంటాక్టర్ తప్పు సరిదిద్దుకొనే ప్రయత్నంలో భాగంగా మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఈ నెల 9 వ తేదీన 10 లక్షల 9 వేలు, 14 వ తేదీన 9లక్షల 90 వేలు, 15 వ తేదీన 9లక్షల 75 వేల రూపాయలు పారిశుధ్య కార్మికులకు ఈపిఎఫ్ గా చెల్లించిన చలానాలు అందజేసి చేతులు దులుపుకున్నారు. అంతకు ముందు సమర్పించిన చలానాలు నకిలీవన్న విషయం కాంట్రాక్టర్ ఒప్పుకున్నట్లేనన్నది స్పష్టమైంది. ఇటువంటి మోసాలు పసిగట్టాల్సిన ఆడిట్ అధికారుల తీరు అనుమానస్పదమేనని విమర్శలు వస్తున్నాయి. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి శానిటరీ కాంట్రాక్టర్ పైన,అందుకు సహకరించిన ఉద్యోగులపైనా క్రమ శిక్షణా చర్యలు చేపట్టాలని భవిష్యత్తులో ఏ ఉద్యోగి ఇటువంటి మోసపూ దోపిడీకి సహకరించకుండా ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని సత్యదేవుని భక్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.ఈ విషయమై దేవాదాయ శాఖ మంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

## చంద్రబాబు సాగర్ ని అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పల్లంరాజుకు వినతిపత్రం



**ప్రత్తిపాడు , జులై 17 , ( ప్రభాతవార్త ) :** మండలంలో కిత్తమూరు పేట వద్ద గల చంద్రబాబు సాగర్ ప్రాజెక్టును ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి చేయాలని మాజీ కేంద్ర మంత్రి ఎం ఎం పల్లం రాజు ను ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేత పిసిసి మెంబర్ ధర్నాలకోట శ్రీను శుక్రవారం ప్రత్తిపాడు నుండి కాకినాడ వెళ్లి పల్లంరాజు కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని ఐదువేల ఎకరాల సాగునీరు అందించాల్సిన కట్టు చింతల ప్రాజెక్టు (చంద్ర బాబు సాగర్) నిర్మాణం చేపట్టి 20 ఏళ్లు పైబడిందని కాలువలు లేక ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతులకు ఉపయోగం లేకుండా పోయిందన్నారు . ప్రాజెక్టు ఆధునికరణ చేసి కాలువ తవ్వకాలు చేపడితే రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లంరాజు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజవర్గ పర్యటనలు వచ్చిన సమయంలో ప్రాజెక్టును పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

## బూరుగులమ్మ తల్లికి ఆషాడం సారె



**అంబాజీపేట, జులై 17 , ( ప్రభాతవార్త ) :** మండలంలోని పుల్లేటికుర్రు గ్రామ దేవత శ్రీ శ్రీ బూరుగులమ్మ అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా గ్రామస్తులు సారెను శుక్రవారం సమర్పించారు. అమ్మవారికి బూరెలు,గారెలు,అరిసెలు, పులిహోర, పెసరపప్పు- చలివిడి, దద్దోజనం, లడ్డు, కాజా,మైసూర్పాక్, పాయసం తదితర సుమారు 100 రకాల పిండి వంటలతో కూడిన సారె సమర్పించారు. పలువురు మహిళలు చీర,గాజులు,పసుపు-కుంకుమ, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయానికి భక్తులు ర్యాలీగా తరలివచ్చారు.

## శాకాంబరిగా దర్శనమిచ్చిన శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారు

**అంబాజీపేట , జులై 17 , ( ప్రభాతవార్త )** ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అంబాజీపేట శ్రీ వీరభద్ర థియేటర్ సమీపంలో బండారువారిపాలెంలో వేంచేసియున్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారు శాకాంబరిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. స్థానికులు,భక్తులు సమకూర్చిన వివిద రకాల కూరగాయలతో అమ్మవారిని కనువిందుగా ఆలయ అర్చకులు గూడూరు వీరభద్ర శర్మ అలంకరించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.


# అభివృద్ధి సంక్షేమంతో కూటమి ప్రభుత్వం పాలన : ఎమ్మెల్యే దివ్య

**- కృష్ణాపురంలో మూడు కోట్ల తో నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన**
**- శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ**
**- గ్రామంలో ఘన స్వాగతం పలికిన టిడిపి నేతలు**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 17 , ( ప్రభాతవార్త ) :** అభివృద్ధి సంక్షేమ మే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలనందిస్తుందని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య పేర్కొన్నారు.తొండంగి మండలంలో మూడు గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేలా సుమారు 3కోట్ల రూపాయలతో కృష్ణాపురం నుంచి ఎల్లయ్యపేట వరకు నిర్మించే ఆర్ అండ్ బీ కొత్త రోడ్డుకు కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, సీనియర్ నేత యనమల రాజేష్ లతో కలిసి శంఖు స్థాపన చేసిన ఎమ్మెల్యే యనమల దివ్య శిలాఫల కాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుని నియోజ కవర్గంలో అన్ని రహ దారులను ఆధునీకరిం చేందుకు రహదారులు, భవనాల శాఖ ద్వారా ప్రతిపాదనలను సిద్ధం చేస్తామన్నారు.ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సందర్బంగా కొండబాబు మాట్లాడుతూ కూట మి ప్రభుత్వ పాలనలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉన్నారని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తుందని పేర్కొన్నారు అనంతరం రైతు శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించిన డ్రోన్ కెమెరాలు ఎమ్మెల్యే ఎంపీలు ప్రారంభించారు గ్రామంలో శంకుస్థాపనకు విచ్చేసిన ఎంపీ ఎమ్మెల్యేలకు పంపా ప్రాజెక్టు చైర్మన్ బైరవర్జుల చందు,కందా వెంకటేశ్వర రావు,వెన్నా మురళీ, కందా సతీష్,మాకినీడు భారతి,పెయ్యల సూరిబాబు, డొక్కుమల్ల బాబూరావు,కందా రాము,స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు ,మండల జనసేన అద్యక్షుడు బెండపూడి నాయు డు,తాటిపర్తి శ్రీనివాస్ బంటుపల్లి అన్వేష్, దూలం మురళి కొయ్యా కేశవ్,కొయ్యా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

# డ్వాక్రా సంఘాల నిధుల్లో 73 లక్షలు గోల్ మాల్



**కొత్తపేట , జులై 17 , ( ప్రభాతవార్త ) :** కొత్తపేట మండలములో సుమారు 1945 డ్వాక్రా సంఘాలు ఉండగా ఇందులో 15 మంది యానీమెటర్లు సుమారు ఉన్నతి, శ్రీనిది లోన్ల కు సంబంధించిన నిధులు 73 లక్షల 53 వేల 45 రూపాయలు స్వాహా చేసినట్టు ఆరోపిస్తూ ఈ రోజు కొత్తపేట పోలీస్ స్టేషన్ లో మోడేకుర్రు మహాలక్ష్మి నగర్ కు సంబందించి అంబేద్కర్ గ్రూప్ యానిమేటర్ యలమంచిలి పద్మావతి పై గ్రూప్ సభ్యులు కొత్తపేట పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసారు. ఈ విషయం పై ఎస్సై సురేంద్ర ని వివరణ కోరగా సంబంధిత అధికారుల నుండి వివరాలు సేకరించి బాధితులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు



## విద్యుత్ షాక్‌తో కార్మికుడు దుర్మరణం

**సామర్లకోట , జులై 17 , ( ప్రభాతవార్త ) :** సామర్లకోట పట్టణ శివారు విద్యుత్ స్తంభాలు లైన్ల మార్పులు పనులు నిర్వహిస్తున్న సమయంలో 11 కెవి విద్యుత్ లైన్ తగిలి విద్యుత్ ఘాతానికి సుమారు 25 సంవత్సరాల వయసు గల కార్మికుడు విద్యుత్ స్తంభం పైనే దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు ఈ ఘటన చోటు చేసుకుందని పలువురు తెలిపారు..

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# పుట్టినప్పటి నుంచే ప్రణాళిక



బాధ్యతలు మీద పడేకొద్దీ ఆర్థిక ప్రణాళికల్లో జాగ్రత్తలూ ముఖ్యమే. ఆర్థికంగా దృఢంగా ఉన్నప్పుడే భవిష్యత్ బాగుంటుంది. అయితే కొత్తగా అమ్మానాన్నలు అయిన వారిలో ఈ జాగ్రత్తలు కొరవడుతున్నాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందుచూపు లేకపోవడం, భవిష్యత్ అవసరాలపై అలసత్వం తలకి మించిన భారం అవుతున్నాయి. అందుకే పిల్లలు పుట్టాక ఆర్థిక ఇబ్బందులు రావొద్దంటే ఆర్థిక ప్రణాళిక తప్పక వేసుకోవాలి అంటున్నారు. ఆర్థిక నిపుణులు

✪ పిల్లల భవిష్యత్ బాగుండాలని బోలెడు కలలు కంటాం. ఏవేవో ప్లాన్లు వేసుకుంటాం. తీరా ఆచరణలో పెట్టాలంటే వెనకాడతాం దానికి మనం చెప్పే కారణాలు.. సంపాదన సరిపోవడం లేదు, పిల్లలు కాస్త పెద్దయ్యాక మొదలు పెడతాను ఇలా చాలానే ఉంటాయి. కానీ, ఈ అలసత్వం చిన్నారుల భవిష్యత్ అవసరాలపై పడుతుందని తెలుసా! వాళ్ల పెద్దయ్యాక ఒకేసారి వారి ఆర్థిక అవసరాలు తీర్చడం కష్టం అందుకే చిన్నారి పుట్టినప్పటి నుంచి సేవింగ్స్ మొదలు పెట్టాలి. ..

✪ చిన్నపిల్లలంటే పుట్టినప్పటి నుంచీ బోలెడన్ని ఖర్చులు, మధ్య మధ్యలో అనారోగ్యాలు. ఇలాంటి ఖర్చుల కోసం పిల్లలు పుట్టిన వెంటనే బేబీ సేవింగ్స్ ఖాతాని తీసుకుంటే ఏది ప్రత్యుత్తరం మొత్తం అందులో దాచుకుంటే ఆపదలో ఆదుకుంటాయి.

✪ ఈ రోజుల్లో ఉన్నత చదువులంటే లక్షలతో కూడుకున్న పని. అమ్మాయి అయితే పెళ్లి అప్పుడు అదనం. అందుకే భవిష్యత్ అవసరాల కోసం వైల్డ్ ప్లాన్ ఒకటి తీసుకోవాలి. దేనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా పథకాలు అందుబాటులోకి తెచ్చాయి. వాటిలో చిన్నారి భవిష్యతు ఏది మంచిదో చూసి ఏంచుకుంటే సరి. ✪. కుటుంబం సురక్షితంగా ఉండేందుకు టర్మ్ పాలసీ తప్పక ఉండాలంటున్నారు. అంతేకాదు.. పిల్లలకి ఆర్థిక స్వాతంత్రం వచ్చేవరకు కొనసాగించాలని అంటున్నారు నిపుణులు.

✪. కొత్తగా తల్లిదండ్రులు అయినవారు కనీసం ఆరు నెలలకు సరిపడా ఖర్చులను పక్కన పెట్టుకోవాలి. అనుకోని ఇబ్బందుల నుంచి ఇవే కాపాడతాయి.

✪ వీటన్నింటిని చిన్నారి చిన్నవయసులో మొదలు పెడితే ఎక్కువ డబ్బు పొదుపు చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే పిల్లల పొదుపు విషయంలో భార్యాభర్తలిద్దరూ కలిసే నిర్ణయం తీసుకోవాలంటున్నారు నిపుణులు. □

# అమ్మాయిలు .. అద్భుతాలు సృష్టించారు

**ఇద్దరూ పేదింటి అమ్మాయిలే. కానీ జీవితాల్ని చదివారు. నాన్నల నుంచి స్ఫూర్తిని పొందారు. వాళ్ల కష్టానికి తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అద్భుతాలు సృష్టించారు. అడపా స్ఫూర్తి, చిట్టోజు స్వర్ణ. ఈ భద్రాద్రి జిల్లా అమ్మాయిల సృజనాత్మక ప్రయాణం తెలుసుకుందాం..**



స్ఫూర్తి

నాన్న ఇంజిన్లకు మరమ్మతులు చేస్తుంటే ఆసక్తిగా చూసేది **అడపా స్ఫూర్తి.** తోచిన సాయమూ చేసేది. దానికితోడు అన్నయ్య చదివేదీ ఎలక్ట్రికల్ విద్యే. వాళ్లిద్దరినీ చూసి, ఎలక్ట్రికల్ ఇంజినీర్ అవ్వాలనుకుంది స్ఫూర్తి. ఈమెది. మణుగూరు. నాన్న ప్రవీణ్ కుమార్, అమ్మ ప్రీతి. పదో తరగతి తన కల దిశగానే అడుగులేద్దామనుకుంది స్ఫూర్తి. కానీ ఇంటర్‌లో బైపిసిలో చేర్చారు. అది నచ్చక ఐటిఐ కళాశాలలోని అడ్వాన్సడ్ ట్రైనింగ్ సెంటర్‌లో మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ కోర్సులో చేరింది. యూట్యూబ్‌లో హోమ్‌మేడ్ వాహనాల తయారీ చూసి తనూ బ్యాటరీల సాయంతో నడిచే వాహనాన్ని తయారుచేయాలనుకుంది.కానీ దానికి తగ్గ ఆర్థిక స్థితి ఇంట్లో లేదు. దీంతో ఆ ఖర్చు భరించలేమన్నారట. నిరాశ పడలేదామె. కొత్తగా ఆలోచించింది. తండ్రి మెకానిక్ షెడ్‌లో నిరుపయోగంగా ఉన్న ఇనుప సామగ్రిని వాహనం తయారీకి ఉపయోగించాలనుకుంది. ముందు డిజైనింగ్ సిద్ధం చేసుకుని అందుకు అవసరమైన బ్యాటరీలు, ఐరన్ షీట్లు, టైర్లు, ఎలక్ట్రికల్ సామగ్రిని సమకూర్చుకుంది. కానీ తను అనుకున్నట్టుగా రాలేదు. దీంతో మరో డిజైన్ సిద్ధం చేసుకుని తిరిగి ప్రయత్నించింది. రెండు నెలల్లోనే ఇద్దరు ప్రయాణించేలా ఎలక్ట్రికల్ వాహనాన్ని తయారుచేసింది. దానికి 'ఎకో వారియర్' అని పేరు పెట్టింది. ఇది రెండున్నర గంటల ఛార్జింగ్‌తో 40 కి.మీ ప్రయాణిస్తుంది. దానిలో నాన్నతో కలిసి ప్రయాణించడమే కాదు, కళాశాలకీ తీసుకెళ్లింది. దాని చూసిన అధ్యాపకులు, ప్రిన్సిపల్ ఆమె ప్రయత్నాన్ని అభినందించారు కూడా. 'నా ఈవి తయారీకి రూ.40 వేలు ఖర్చయ్యింది. కోరుకుంటే ఎవరికైనా రూ.80వేలతో రెండు నెలల్లో చేసివ్వగలను. ఈ ప్రయత్నం నా ఆత్మవిశ్వాసం పెంచింది. ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన సంస్థ ఏర్పాటుచేయడం, తక్కువ ధరకే ఈవిలను అందించడం నా లక్ష్యాలు అంటోంది స్ఫూర్తి.


స్వర్ణ

**చిట్టోజు స్వర్ణ ....** తరతరాలుగా కులవృత్తినే నమ్ముకొని జీవిస్తున్న కుటుంబం. దానికి తను చదువుకున్న విద్యను జోడించాలనుకుంది చిట్టోజు స్వర్ణ. ఈమెది ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెం. నాన్న మోహనాచారి వడ్రంగి, అమ్మ నిర్మల. ముగ్గురు కూతుళ్లలో చిన్నది స్వర్ణ. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. వడ్రంగి పనులతో కుటుంబాన్ని నడిపిస్తోన్న తండ్రికి సాయంగా నిలవాలనుకుంది. ప్రభుత్వ కొలువులకు ప్రయత్నిస్తే కొద్దిలో చేజారాయి. అప్పుడే సాంకేతికతను ఉపయోగించి రైతులకు ఉపయోగపడేలా కల్టివేటర్లను తయారు చేయాలనుకుంది. ఆలోచనను నాన్నతో పంచుకుంటే ఆయనా ప్రోత్సహించారు. దీంతో పరిశోధన చేసి, వ్యవసాయానికి పనికొచ్చే కల్టివేటర్లను తయారుచేసింది. ఎవరి సాయమూ లేకుండా ఒక్కరే వినియోగించేలా వీటిని తీర్చిదిద్దింది. కూలీల కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో మొక్కజొన్న, మిరప, వేరుశనగ రైతులకు ఇవి ప్రయోజనకరంగా మారాయి. ఈ సంగతులన్నీ యూట్యూబ్‌లో పోస్ట్ చేసేది స్వర్ణ. దీంతో తెలుగు రాష్ట్రాలే కాదు, కర్ణాటక, మహారాష్ట్ర సహా ఇతర ప్రాంతాల నుంచీ ఆర్డర్లు మొదలయ్యాయి. మార్కెట్లో పేరొందిన 7 హెచ్‌పి మోటార్ల ధర రూ. 40 వేల వరకూ ఉంటుంది. నేను సింగిల్‌వీల్ కల్టివేటర్‌ని రూ.26 వేలు, డబుల్ వీల్ వాటిని రూ.28 వేలకే అందిస్తున్నా. అలాగని నాణ్యతలో రాజీపడలేదు. సొంత పెట్టుబడితో మొదలుపెట్టాం. ఇప్పుడు 60 కల్టివేటర్ల వరకూ తయారుచేస్తున్నా. కుటుంబ పరిస్థితుల రీత్యా తాజాగా రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహిస్తే నేను రాణిస్తూనే మరికొందరికీ ఉపాధి కల్పిస్తానంటోంది స్వర్ణ. □

# రెయిన్ కోట్లలో తడిసొద్దామిలా!

ఫ్యాషన్ ఫ్యాషన్

అలా అలా నాలుగు చినుకులు ప్రారంభమయ్యాయంటే తడిసొచ్చేందుకు పిల్లలు ఎంతో సంబర పడుతుంటారు. సరదాగా తడవడాన్ని ఇష్టపడని అమ్మాయిలుండరు. మామూలుగా అయితే కాస్త తడి తగిలితే చిరాకుపడ్తుంటాం. అలాంటిది ఏకంగా తడవడమో? అమ్మ వద్దంటుంది. వాన రమ్మంటుంది. వానస్తోందని ఇల్లు కదలకుండా కూర్చుంటామా? సరదాకైనా తడవాలి. అలా కాలేజీ, ఆఫీసులకు వెళ్లడనికైనా ఎంతో కొంత తడవాలి. ఇప్పుడంటే రకరకాల రంగుల్లో, హంగుల్లో, డిజైన్ల గొడుగులొచ్చాయి. కానీ అంతకంటే రెయిన్‌కోట్లు ధరిస్తే వాననుండి రక్షణ వేషమూ బాగుంటుంది. గాలికి ఎగిరిపోతుందన్న బెంగ ఉండదు,జల్లులకు దుస్తులు తడిసే బాధ అంతకన్నా ఉండదు. పైగా హ్యాండ్ బ్యాగ్, ఏమైనా లగేజ్ ఉన్నా సురక్షితంగా తీసుకెళ్లొచ్చు. బైకు మీదా దూసుకెళ్లొచ్చు. మరీ చిన్న పిల్లలు స్కూలుకి వేసుకెళ్తున్నట్లు ఉంటుంది. ఇప్పుడేం వేసుకుంటాం... ఈ రెయిన్‌కోట్లు అంటారా? ఏ మాత్రం ఎబ్బెట్టుగా ఉన్నా అమ్మాయిలకిసూట్ కాదు. అమ్మాయిలకు ప్రత్యేకంగా, స్టైలిష్ రెయిన్ కోట్లను రూపకల్పన చేస్తున్నారు. అచ్చంగా స్టైలిష్ కుర్తీనే వేసుకున్నట్టు లేదూ? వాటర్ ప్రూఫ్ టెక్నాలజీతో కొత్తరకం వస్త్రాలను వీటికోసం వినియోగిస్తున్నారు. పైగా బరువూ తక్కువేనట. అంటే వీటిని వేసుకోవడమూ తేలిక. ఫ్యాషన్‌కి ఏ మాత్రం అంతరాయం కాదు. ఇంకా చినుకు మీద పడకుండా ఎక్కడికైనా వెళ్లిపోవచ్చు. ఇంతకన్నా మనికి మాత్రం చినుకుల్లో ఫ్యాషన్‌లో తడిసిపోవచ్చు. .











# మసాలా స్వీట్ కార్న్ వడ



కావలసినవి:
స్వీట్ కార్న్ : కప్పు
పెసర పిండి కప్పు,
బియ్యపిండి పావుకప్పు, ఉల్లి ముక్కలు పావు కప్పు, క్యాప్సికమ్ ముక్కలు పావు కప్పు, కొత్తిమీర తురుము 2 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి ముద్ద పావుట ీస్పూను, కారం టీస్పూను, పసుపు పావుటీస్పూను, నిమ్మరసం టీస్పూను, ఉప్పు తగినంత, చాట్ మసాలా, టీస్పూను, నూనె వేయించడానికి సరిపడా.

**తయారుచేసూ విధానం :** స్వీట్‌కార్న్ కచ్చాపచ్చాగా రుబ్బాలి. అందులోనే మిగిలిన అన్ని దినుసులూ వేసి కలపాలి. ఇప్పుడు మిశ్రమాన్ని కొంచెంకొంచెంగా తీసుకుని వడల్లా వత్తి కాగిన నూనెలో వేయించి ఆపై చాట్‌మసాలా చల్లి గ్రీన్ చట్నీతో అందిస్తే సరి. □

**చెలి చిట్కా**

తలకే కాకుండా శరీరానికి కూడా నూనెను పట్టించి మర్దన చేయడం వలన శరీరానికి చక్కని వ్యాయామం లభించి దేహపుష్టి కలుగుతుంది. □

# గోంగూర ప్రయోజనం

ఆరోగ్య భాగ్యం


డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఆకుకూరల్లో మిక్కిలి ప్రశస్తమైనది గోంగూర గోగు మరియు కూర అనే రెండు తెలుగు పదాల కలయికనే గోంగూర అని చెప్పవచ్చు. ఆకలిని కల్గించే గోగుని ఫ్లాక్స్ పంటగా ఇండియాలో ఎక్కువగా పండిస్తారు. గోంగూరని ప్రపంచ మాతటా అన్ని వంటకాల్లో వేసే ఆకుకూర. దీని శాస్త్రీయ నామం హైబిస్కస్ సబార్డిఫా. ఇది హైబిస్కస్ కుటుంబానికి చెందినది. గోంగూర ఆంధ్రుల ఇష్టమైన ఆహారం దీన్ని ఆంధ్రమాద, ఆంధ్రమతం, శాకంబరీ వరప్రసాధం, సచ్ఛఫల, ఉష్ణప్రియ, పుంటికూర, గోగాకు, పులిచకీర్రై పీలుపులి వెండలాల్ అంబాడీ, పట్వా, మెస్తా, గోర్యూరా, గోగు, పుండిపల్లె, పుల్లని పాలకూర అని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో దాదాపు 30 రకాల పేర్లతో పిలుస్తారు. గోంగూర అంటే జీవశాస్త్రంలో ఏదో ఒకటి అని అర్థం. గోంగూర కాడల్ని బట్టి గోంగూర రెండు రకాలు. తెల్ల గోంగూర లేదా ఆకుపచ్చ గోంగూరని కెనఫ్ లీవ్స్ అని, ఎర్ర గోంగూరని రోసెల్లా ఆకులు అని అంటారు. అంతేకాకుండా సంస్కృతంలో పీలు, ఆమ్లపీలు, కంటకపీలు అని,హిందీలో లాల్‌బారి అని అంటారు. గోంగూర జాతుల్లో దాదాపు 300 దాకా ప్రపంచమంతటా సంవత్సరం పొడవునా పండిస్తారు. దీన్ని ఎక్కువ వేసవిలో వర్షాకాలంలో ఎక్కువగా పండిస్తారు. దీనిలో దేశవాళీ గోంగూర, పుల్లగోంగూర,ధనానారి గోంగూర (ముళ్ళున్న గోంగూర) అని మూడు రకాలు. పొలాల్లో పెరటిలో, కాల్వగట్లలో, తోటల్లో పండించే గోంగూరని మంచి గోంగూరని, కొండ ఆటవీప్రాంతాల్లో, గిరిజన తెగల్లో పండించే గోంగూరని కొండ గోంగూరని అంటారు. గోంగూర ఆకులు చేదుగా, కొద్దిగా జిగురుగా ఉండి రుచికి ఆమ్లంగా, పుల్లగా ఉండడం వల్ల పులిచింతాకు అని అంటారు. ఎర్రగోంగూర ఆకులో ఎక్కువగా విటమిన్ సి, ఆక్సాలిక్ ఆసిడ్ ఎక్కువగా ఉండడం వల్ల ఇది రుచికరమైన పోషక ఆహారం. గోంగూర ఆకులే కాకుండా పూలు, గింజలు, కాడలు వేర్లు కూడా ఉపయోగపడతాయి. దీనిలో ఉండే పోషకాలు, ఆంటి ఆక్సిడెట్ల వల్ల ఒక ప్రత్యేకమైన టార్ట్‌ఫ్లేవర్‌కి ప్రిసిద్ధి చెందింది. ఔషధ గుణాల్లో, రుచిలో దీన్ని తలదన్నే ఆకుకూరే లేదు. ఇది ఒక బహుముఖ మూలిక అని చెప్పవచ్చు.

**పోషక విలువలు :** 10 గ్రా. గోంగూరలో ఉన్న పోషకాలు. తేమ: 86.2, కేలరీలు: 26, ప్రోటీన్స్ : 1.7 గ్రా. కార్బోహైడ్రేట్స్: 10 గ్రా. క్రొవ్వు : 1.1 గ్రా, ఫైబర్ : 3.1 గ్రా, కాల్షియం : 172 మి.గ్రా. పొటాషియం: 321 మి.గ్రా. సోడియం : 980 మి.గ్రా. ఫాస్పరస్ : 40 మాంగనీస్: 8%, మెగ్నీషియం : 10%, విటమిన్‌లు: 2,900 ఐయు. విటన్ సి : 20 మి.గ్రా. మాలిక్ ఆసిడ్ : 1.25%, పెక్టిన్ : 3.19%, మినరల్స్: 75 మి.గ్రా. ఐరన్ : 11 %

**ఆరోగ్య ప్రయోజనాలు :** వేడి, బలాన్ని కల్గించే గోంగూర రుచిలో ఆరోగ్యంలో శ్రేష్టమైనది. **కాలేయంకు రక్షణ :** లివర్‌లోని టాక్సిన్స్‌ని డీటాక్సిఫై చేసి లివర్ కణాల సంఖ్యను పెంచి లివర్‌కి బలాన్ని చేకూర్చుతుంది. ఇది శరీరంలో వేడిని తగ్గించి శరీరాన్ని చల్లబరిచి లివర్‌పై ఒత్తిడిని తగ్గిస్తుంది. దీనివల్ల జాండీస్, ఫ్యాటీలివర్, ర్రోసిస్ వంటి వ్యాధులు రావు.

**జీర్ణక్రియ :** ఇది చెడు కేలరీల్ని బర్న్ చేయడం, స్టార్చ్‌ని విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియని మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణక్రియకి ఎనర్జీ బూస్టర్‌గా పని చేస్తుంది. గోంగూరలోని ఐరన్ వల్ల అధిక ఆకలిని ఫిస్టులా, పొట్ట ఉబ్బరం, కడుపులో మంట తగ్గించి, ప్రేగు కదలికల్ని ప్రోత్సహించి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ప్రేగు కండరాల్ని బలపరిచి గట్‌హెల్త్‌ని మెరుగుపరుస్తుంది.

**రక్తశుద్ధికి:** గోంగూరలోని ఐరన్, విటమిన్ సి రక్తంలో హీమోగ్లోబిన్ శాతాన్ని పెంచి రక్తహీనతని, అధిక రక్త స్రావాల్ని తగ్గిస్తుంది. ఇది లింఫాటిక్ రక్తప్రసరణకి మంచిది. ఫోలేట్స్, విటమిన్ బి6 వల్ల హీమోస్టాసిస్ స్థాయిల్ని నిర్వహిస్తుంది. ఐరన్ లోపాన్ని తగ్గిస్తుంది. ఎర్రరక్తకణాల ఉత్పత్తికి, కణాలకి ఆక్సిజన్ సరఫరా చేసి ఎనర్జీ లెవల్స్‌ని పెంచి రక్తాన్ని శుద్ధిచేస్తుంది. స్లీన్ వ్యాధుల్ని నివారిస్తుంది. □

# బియ్యం పురుగు పట్టకుండా..



ఎక్కువ మొత్తంలో బియ్యం కొన్నప్పుడు పురుగు పట్టకుండా ముందుగానే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మరీ దీనికోసం కొన్ని చిట్కాలు ప్రయత్నించవచ్చంటున్నారు నిపుణులు.

**కర్పూరం..** కర్పూరం వెదజల్లే ఘాటైన సువాసన వల్ల బియ్యంలో పురుగులు చేరవు. కొన్ని కర్పూరం బిళ్లలను తీసుకొని మెత్తని పొడిగా చేసుకోవలి. దీన్ని కాస్త మందంగా ఉండే నూలు వస్త్రంలో చుట్టి బియ్యం పెడితే సరిపోతుంది.

**ఇంగువ..** వంటల్లో విరివిగా ఉపయోగించే ఇంగువ కూడా బియ్యంలో పురుగులు చేరకుండా కాపాడుతుంది. దీనికి కారణం ఇది వెదజల్లే ఘాటైన వాసనే. దీన్ని కొద్దిగా బియ్యంలో కలిపితే సరిపోతుంది. బిర్యానీ ఆకులను ఉపయోగించినా ఇదే ఫలితం కనిపిస్తుంది.



**బోరిక్ పౌడర్..** బియ్యంలో పురుగులు పెరగడానికి తేమ కూడా ఒక కారణమే. కొంతమంది బియ్యాన్ని ఒకేసారి తెచ్చి ఇంట్లో నిల్వ చేస్తారు. ఈ అయితే కొన్నిసార్లు బియ్యంలో తేమ చేరే అవకాశం ఉంటుంది. ఫలితంగా పురుగులు పట్టచ్చు. అందుకే బియ్యంలో తడి చేర కుండా చూసు కోవాలి. దీని కోసం బియ్యంలో కొద్దిగా బోరిక్ పౌడర్ కలపాలి. ఇది బియ్యంలో చేరిన తేమను పీల్చేసుకుంటుంది. అందులో పురుగులు చేరకుండా ఉంటాయి అంటున్నారు. □

# శ్రీకృష్ణుడి విశ్వరూపం



**కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు** విశ్వరూపాన్ని దర్శింపచేశాడు. అంతేనా.. ఆ పరంధాముడు తన విశ్వరూపాన్ని బాల్యావస్థలోనే పెంపుడు తల్లి యశోదకు తొలుత చూపించాడు. మన్ను తిన్నావా? అని దండించ వోయినప్పుడు నోరు తెరిచి తన నిజస్వరూపాన్ని చూపాడు. ఉద్యోగపర్వంలో రాయబారం కోసం ధృతరాష్ట్రుని కొలువుకు వెళ్లినప్పుడు కౌరవులు శ్రీకృష్ణుణ్ణి బంధించాలని ప్రయత్నించారు. వారిని హెచ్చరించటానికి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. విజయుడికి నిజస్వరూపాన్ని ప్రదర్శించాడు. కురుక్షేత్ర యుద్ధసమయంలో భగవద్గీతను బోధిస్తూ విజయుడికి నిజస్వరూపాన్ని ప్రదర్శింపజేయడం జగద్విదితమే! ఇక చివరిసారి మహాభారత యుద్ధం తర్వాత శ్రీకృష్ణుడు సోదరి సుభద్రను తీసుకుని ద్వారకకు బయల్దేరాడు. మార్గమధ్యంలో ఉదంకుడు అనే రుషి అతిథ్యాన్ని స్వీకరించాడు. యుద్ధ విషయం తెలియని ఆ మహర్షి కౌరవుల క్షేమ సమాచారాలు అడిగాడు. వారు సమరంలో చనిపోయారని శ్రీకృష్ణుడు చెప్పాడు. అది విన్న ఉదంకుడు అతడిపై అగ్రహించాడు. నీకు యుద్ధాన్ని ఆపగలిగే శక్తి ఉన్నా! ఆపలేదు అంటూ శపించబోయాడు. అప్పుడు శ్రీకృష్ణ పరమాత్మ 'ఓ మునీ! నీ తపోశక్తిని వృథా చేసుకోవద్దు. నేను సర్వాంతర్యామిని అంటూ తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ఇలా భారత, భాగవతాల్లో నాలుగుసార్లు శ్రీకృష్ణుడు తన దివ్యమైన విశ్వరూపాన్ని చూపాడు. □

ఆధ్యాత్మికం

# ఒంటరితనాన్ని వదిలించుకుందాం

**జీవనశైలి, పని ఒత్తిడి కారణాలేవైనా చాలామంది మహిళలను డిప్రెషన్ వేధిస్తుంటుంది. ఇలాంటప్పుడు ఒంటరితనం బాధించకూడదంటే.. ఈ అలవాట్లు చేసుకోమంటున్నారు నిపుణులు.**

✦ జీవితం ఎవరికీ పూల పాన్పు కాదు.. ఎదురయ్యే సంఘటనల్ని డీల్ చేసుకునే విధానమే వారిని గట్టెక్కిస్తుంది. అలాకాకుండా అన్నింటికీ ఎవరో ఒకరు తోడు కావాలనుకుకోవడం, మనసుకి నచ్చిన వారు పక్కనుంటేనే అన్నీ చేయగలను అనుకోవడం వల్ల. మీ ఒంటరితనం పోగొట్టడానికి ఏవవైనా హాబీలను అలవాటు చేసుకోండి. ఉదాహరణకు మీకు మంచి ముగ్గులు పెట్టడమో, వంట చేయడమో వస్తే.. దానిలోనే ప్రత్యేకత సాధించడానికి ప్రయత్నించండి. సామాజిక మాధ్యమాల వేదికగా వాటిని ప్రదర్శించండి. ఇవన్నీ మీకో గుర్తింపు తేవడమే కాదు.. ఒంటరితనాన్నీ దూరం చేస్తాయి.

✦ నలుగురిలో కలవడానికి బోలెడు మార్గాలు.. వ్యాయామం చేయడానికి రోజూ దగ్గర్లోని యోగా సెంటర్‌కో, పార్కుకో వెళ్లండి. కసరత్తులు మీ ఒంటికి శ్రమనూ, మనసుకు సాంత్వననూ అందిస్తాయి. కొత్త స్నేహాలకూ, ఆలోచనలకూ ఇవి వేదిక అవుతాయి. లేదంటే ఉదయమో, సాయంత్రమో వెల్లండి క్రమంగా మీలోని ఒత్తిడి దూరమవుతుంది.



✦ మీలో ఒంటరితనం అనే భావన రావడానికి మీ చుట్టూ ఉండే వ్యక్తులూ, సమాజం.. ఏదైనా కారణం కావొచ్చు. నిత్యం ఏదో ఒక ప్రతికూల పరిస్థితితో పోరాడాల్సి రావొచ్చు. అంతమాత్రాన మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవద్దు. ఏ రోజుకారోజు మీలోని ఓ నెగెటివ్ అంశాన్ని అధిగమించాలనే లక్ష్యం పెట్టుకోండి. ఏ విషయంలోనైనా వెనకబడి ఉంటే అందులో పట్టు తెచ్చుకోవడానికి ప్రయత్నిం చండి. ఇవన్నీ మీ ఒంటరితనాన్ని దూరంచేసేవే. □

# తెర



## అది కష్టమైన దశ

హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో రాబోతున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. అయితే ఓ సినిమా కోసం మాళవిక కేవలం రెండు వారాల్లోనే 8 కిలోల బరువు పెరిగిందట. అంతకు ముందు 14 రోజుల్లోనే బరువు తగ్గింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. తన ఫిట్నెస్ సిక్రెట్ రివీల్ చేసింది. ఒక సినిమాలో తన పాత్ర కోసం కేవలం 14 రోజుల్లోనే 8 కిలోల బరువు తగ్గిందట. అది తనకు చాలా కష్టమైన దశ అని చెప్పుకొచ్చింది. తక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకున్నానని.. అదే సమయంలో శారీరకంగా చాలా కష్టపడి స్టంట్స్, యాక్షన్ సీన్ రిహార్సల్స్ చేయడం శరీరంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి తెలిపింది. శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం, కాబట్టి కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేశానని అది చాలా ప్రమాదకరమైనది అని తెలిపింది. తక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకున్నానని.. అదే సమయంలో శారీరకంగా చాలా కష్టపడి స్టంట్స్, యాక్షన్ సీన్ రిహార్సల్స్ చేయడం శరీరంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి తెలిపింది. శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం, కాబట్టి కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేశానని అది చాలా ప్రమాదకరమైనది అని తెలిపింది. ఆ డైట్ ప్లాన్ శరీరంపై దుష్ప్రభావాలను కలిగిస్తుందని.. శక్తిలేకపోవడంతో చాలా సార్లు బలహీనంగా అనిపించిందని.. డాక్టర్ సైతం ఎప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండాలని చెప్పారని.. తాను ఫాలో అయిన డైట్ మాత్రం అస్సలు పాటించవద్దని తెలిపింది. ప్రస్తుతం మాళవిక చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతున్నాయి.

ప్రస్తుతం మాళవిక ప్రభాస్ జోడిగా రాజా సాబ్ చిత్రంలో నటిస్తుంది. హారర్ కామెడీ డ్రామాగా వస్తున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ సైతం కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ ఆకట్టుకుంది. అలాగే ఈ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ఈ మూవీతో మాళవిక తెలుగు తెరకు పరిచయం కాబోతుంది.




## 14 లోకాలు ఆమెను.. ఎలా దాటించాడు ?

చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ బడ్జెట్ చిత్రం విశ్వంభర. ఈ చిత్రం సోషియోఫాంటసీ జానర్‌లో తెరకెక్కుతోంది. తాజాగా ఈ సినిమా స్టోరీ గురించి దర్శకుడు వశిష్ఠ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ మేరకు ఈ మూవీ స్టోరీ ఎలా ఉంటుందో ఆయన తెలిపారు. వశిష్ట ఏం చెప్పారంటే.. మనకు తెలిసినవి 14 లోకాలు. అందులో కింద 7 లోకాలు, పైన 7 లోకాలు. అయితే విశ్వంభర అనేది ఈ 14 లోకాలకు పైన ఉన్న మరో లోకం. ఈ చిత్రంలో కథానాయిక (త్రిష) ఆ విశ్వంభర లోకానికి చెందినది. ఏదో ఒక కారణం చేత ఆమె భూమి మీదకు వస్తుంది. భూమి మీదకు వచ్చిన హీరోయిన్‌ను తిరిగి విశ్వంభర లోకానికి ఎలా తీసుకెళ్లారు. ఈ క్రమంలో హీరో (చిరంజీవి) ఎలా ప్రయాణించాడు. అక్కడ ఎదురైన సవాళ్లు ఏమిటి? అన్నది ఈ సినిమా ప్రధాన కథాంశం అని చెప్పుకొచ్చారు. దీంతో మెగా ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. దర్శకుడు వశిష్ట అప్డేట్‌తో సినిమా కోసం మరింత ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ మూవీ ఇప్పటికే చాలాసార్లు వాయిదా పడింది. దానికి గల కారణాలను ఆయన వివరించారు. విశ్వంభర చిత్రం ఆలస్యం కావడానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్) పనులు అని దర్శకుడు వశిష్ఠ స్పష్టం చేశారు. ఈ చిత్రంలో దాదాపు 4,676 వీఎఫ్ఎక్స్ షాట్‌లు ఉన్నాయని, ఇండియన్ సినిమాలలో ఇంత భారీ స్థాయిలో జునీశ్రీ వర్క్ జరగడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయిలోని అనేక వీఎఫ్ఎక్స్ కంపెనీలు ఈ సినిమా కోసం పనిచేస్తున్నాయని, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన దృశ్య అనుభూతిని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ సినిమా కోసం భారీ స్థాయి లో.. విభిన్నమైన 13 సెట్‌లు నిర్మించారని, ఒక్కో సెట్ కూడా కథలో ఒక్కో పాత్ర పోషిస్తుందని వశిష్ఠ వివరించారు. ఈ చిత్రం అక్కినేని నాగేశ్వరరావు నటించిన కీలు గుర్రం, ఎన్టీఆర్ నటించిన పాతాళభైరవి వంటి పాత ఫాంటసీ సినిమాల నుండి తాను ప్రేరణ పొందినట్లు తెలిపారు. ఒక పాట మినహా సినిమా షూటింగ్ దాదాపు పూర్తయిందని వెల్లడించారు.

### రూ.200 కోట్ల బడ్జెట్

విశ్వంభర చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్‌ను వింటేజ్ లుక్‌లో చూపించేందుకు మేకర్స్ చేస్తున్న ప్రయత్నం, భారీ విజువల్స్, స్టార్ కాస్ట్, టాప్ టెక్నీషియన్లు పనిచేస్తుండటం, టాప్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తుండటం, ప్రత్యేకమైన సెట్స్ ఏర్పాటు చేయడంతో ఇప్పటి వరకు ఈ చిత్రానికి రూ.200 కోట్ల వరకు బడ్జెట్ ఖర్చైందని ట్రేడ్ నిపుణులు తెలుపుతున్నారు. మున్ముందు ఖర్చులతో సినిమా బడ్జెట్ పెరిగే అవకాశం ఉందా అనేది చూడాలి.



## సుమతీ శతకం ఫస్ట్ లుక్

బిగ్ బాస్ అమర్ దీప్ హీరోగా సుమతీ శతకం అనే చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ మేరకు సుమతీ శతకం ఫస్ట్ లుక్ అందరినీ మెప్పించిన సంగతి తెలిసిందే. వింటేజ్ విలేజ్ డ్రామా, లవ్ స్టోరీలా ఈ చిత్రాన్ని కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి ఎం.ఎం. నాయుడు దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సినిమా నుంచి హీరోయిన్ సయాలీ పాత్రకు సంబంధించిన లుక్ రివీల్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టర్ను చూస్తుంటే ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. ఇక త్వరలో టీజర్‌ను విడుదల చేసి సినిమాపై మరింత అంచనాల్ని పెంచాలని మేకర్లు భావిస్తున్నారు. అభిమానుల అంచనాలకు తగ్గట్టే ఉంటాయని నిర్మాత కొమ్మాలపాటి సాయి సుధాకర్ తెలిపారు. దసరాకి విడుదల చేయాలనే లక్ష్యంతో సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోందని అన్నారు. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా నటిస్తుండగా, టేస్టీ తేజ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా సుభాష్ ఆనంద్, డైలాగ్ రైటర్‌గా బండారు నాయుడు, ఎడిటర్‌గా నాహిద్ మొహమ్మద్, డీఓపీగా హాలేష్ పని చేస్తున్నారు.

## ప్రేమ నిజమైన నిర్వచనం కోసం..

ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ చిత్రం ఆంధ్ర కింగ్ తాలూకా సినిమా నుంచి తాజాగా ఫస్ట్ సింగిల్ సాంగ్‌గా నువ్వుంటే చాలే.. అనే పాటను రిలీజ్ చేశారు. ఈ పాటను మ్యూజిక్ ద్వయం వివేక్‌మెర్విన్ కంపోజ్ చేయగా సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ పాడారు. ఇక మరో విశేషమేమిటంటే.. ఈ పాటకు స్వయంగా హీరో రామ్ చక్కటి లిరిక్స్ ఇచ్చారు. నువ్వుంటే చాలే అంటూ రొమాంటిక్ మెలోడీగా సాగిన పాట వినసొంపుగా ఉంది.

రామ్ పోతినేని తొలిసారిగా లిరిక్ రైటర్‌గా మారారు. నువ్వుంటే చాలే పాటలోని సాహిత్యం పోయెటిక్‌గా వుంది. ప్రతి లైన్ మనసుని తాకుతుంది. ప్రేమ నిజమైన నిర్వచనాన్ని కనుగొనడానికి హీరో చేసే ప్రయాణంలా అనిపిస్తుంది. ప్రేమని నిర్వచించలేమని, కేవలం అనుభవించగలమని తెలియజేస్తోంది. ఈ పాట ఒక చిన్న కథలా అనిపిస్తుంది. ఇది భావోద్వేగాలతో ప్రయాణించే అనుభూతిని ఇస్తుంది. మరోవైపు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ వోకల్స్ కట్టిపడేశాయి. కోరస్‌లోని వోకల్ లేయర్స్ అద్భుతంగా వున్నాయి. హుక్ ఫ్రేజ్ మెమరబుల్‌గా వుంది. అద్భుతమైన రియల్ లోకేషన్స్ షూట్ చేసిన ప్రతి ఫ్రేమ్ ఒక పెయింటింగ్ లాగా కనిపిస్తుంది. రామ్ చర్మిషా, భాగ్యశ్రీ ఎలిగెన్స్ కలిసి, వారి కెమిస్ట్రీ ప్రేమని అనుభూతి చెందేలా చేసింది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా రిలీజ్ చేసిన ఫస్ట్ సాంగ్ తోనే బ్లాక్ బస్టర్ కొట్టారు. రామ్ పోతినేని బ్యూటిఫుల్ లిరిక్స్, అనిరుధ్ రవిచందర్ మెస్మరైజింగ్ వాయిస్, వివేక్ మెర్విన్ సోల్ ఫుల్ కంపోజిషన్ తో సాంగ్ హ్యూజ్ బ్లాక్ బస్టర్ అయ్యింది.



కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తుండగా, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో రామ్ బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ హిట్ అందుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. ఇక ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.



బాలీవుడ్ నిర్మాత నమిత్ మల్హోత్రా రామాయణం చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం దాదాపు రూ. 4000 కోట్ల బడ్జెట్ ఖర్చు చేస్తున్నారు.

## అందుకే సీతాదేవి పాత్ర ఇచ్చాం

అంతేకాదు ఇందులోని ప్రతీ పాత్ర, ప్రతీ సన్నివేశంపై ఎంతో శ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యంగా సీతారాముల పాత్రల విషయంలో చాలా ఖచ్చితంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అయితే తాజాగా ఓ చిట్ చాట్‌లో పాల్గొన్న చిత్రబృందం ఈ సినిమాలో ప్రత్యేకంగా సాయిపల్లవిని సీతగా ఎంపిక చేయడానికి గల కారణాన్ని వెల్లడించింది. సాయిపల్లవి గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుందని, అందం కోసం సర్జరీలు చేయించుకోలేదని, కృత్రిమం కంటే సహజ అందమే బాగుంటుందనే సందేశం ఇచ్చినట్లుగా ఆమె ఉంటుందని రామాయణ చిత్రబృందం తెలిపింది. అందుకే సీతాదేవిగా సాయిపల్లవిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అలాగే రాముడిగా రన్బీర్ ఎంపిక చేయడానికి గల కారణాన్ని కూడా తెలిపారు. అయన ప్రశాంతమైన వ్యక్తిత్వం, గొప్పగా నటించే నైపుణ్యమే కారణమని చెప్పింది చిత్రబృందం.



ఇంటెన్స్ స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకునే ఆనంది తన అప్ కమింగ్ మూవీ గరివిడి లక్ష్మిలో అద్భుతమైన పాత్రలో కనిపించనుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై

## బుర్రకథ కళాకారిణి రిక్షా ప్రయాణం

టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఒక డీప్ కల్చర్‌ని ప్రజెంట్ చేయబోతోంది. అర్థవంతమైన సినిమాలని రూపొందించడంలో పేరుపొందిన ఈ నిర్మాణ సంస్థ ఇటీవలే ఉత్తరాంధ్ర సంప్రదాయాలను అందంగా చూపిస్తూ జానపదం నల జిలకర మొగ్గతో అందరి మనసులు గెలుచుకుంది.

ఇప్పుడు మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఆనందిని లెజెండరీ గరివిడి లక్ష్మి పాత్రలో పరిచయం చేశారు. హాఫ్ శారీ ధరించి, రిక్షాలో కూర్చున్న ఆనంది, ఒడిలో సంగీత వాయిద్యం హార్మోనియంతో చిరునవ్వుతో కనిపించడం ఆకట్టుకుంది. గరివిడి లక్ష్మి ఒక గొప్ప బుర్రకథ కళాకారిణి. 1990లలో ఉత్తరాంధ్ర ఫోక్ సాంప్రదాయాల్ని బతికించి, ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ఆమెకి ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. ఆమె పేరే ఇప్పుడు ఆ ప్రాంత చరిత్రలో నిలిచిపోయింది. గరివిడి లక్ష్మి గ్రామీణ జీవనానికి, సంగీత వారసత్వానికి అద్భుతమైన ట్రిబ్యూట్ లా ఉంటుంది. ఇది ఓ ఎమోషనల్ జర్నీ, మన సంస్కృతి మీద ప్రేమతో చేయబడ్డ ఎంటర్టైనర్.

చరణ్ అర్జున్ సంగీతం అందించిన ఈ సినిమా, ఉత్తరాంధ్రని ఆవిష్కరిస్తూ మనసుని తాకేలా ఉంటుంది. జె. ఆదిత్య ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్. తారాగణం: ప్రముఖ నటుడు నరేష్, రాసి, ఆనంది, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్, కంచరపాలెం కిషోర్, శరణ్య ప్రదీప్, కుశాలిని



## ఈ కాలం ట్రెండ్‌కి తగ్గట్టుగా..

సాకే రామయ్య సమర్పణలో సిద్ధ క్రియేషన్ బ్యానర్‌లో సత్య మార్క్ దర్శకత్వంలో, ప్రొడ్యూసర్ సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్న చిత్రం ప్రేమలో రెండోసారి. ఈ చిత్రానికి సంబంధించి ఫస్ట్ లుక్ అగ్ర నిర్మాత సి.కళ్యాణ్ చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా సి. కళ్యాణ్ మాట్లాడు తూ ప్రేమలో రెండోసారి చిత్ర టైటిల్ చాలా బాగుంది. కొత్తగా అనిపించింది. తెలుగు ప్రేక్షకులకు అందరికి నచ్చుతుంది. టీం అందరికి అల్ ది బెస్ట్ ఈ సినిమాని డైరెక్టర్ బాగానే తీశారు అనిపిస్తుంది. టైటిల్‌లో డైరెక్టర్ ప్రతిభ స్పష్టంగా కనిపిస్తుంది, ఈ సినిమా చక్కటి ప్రేక్షకాదరణ పొందుతుందన్న నమ్మకం నాకుంది అన్నారు. ఈ టీం కి మరోసారి ఆల్ ది బెస్ట్ చెబుతున్నాన్నని అన్నారు. హీరో మరియు ప్రొడ్యూసర్ రమణ సాకే మాట్లాడుతూ.. సినిమా చాలా బాగా వచ్చింది మా డైరెక్టర్ సత్య మార్క్ ఈ ట్రెండ్‌కి తగట్టు చాలా అద్భుతంగా సినిమాను తీర్చిదిద్దారు. ఈ సినిమా టైటిల్ ఈ కాలం ట్రెండ్‌కి తగట్టుగానే ఉంది. ఈ సినిమాలో నా క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. నేటి యువతీ యువ కులకు బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న నమ్మకం నాలో బలంగా అంది. మా హీరో కొత్త వారు అయినా చాలా బాగా నటించారు. ఇందులో నటీ నటులు హీరో రమణ సాకే, హీరోయిన్ వనిత గౌడ, మరియు జబర్దస్త్ శ్రీను, బాబీ తదితరులున్నారు.


## ఆయనంటే ఆ ఊరికి భయమెందుకు?



నూతన నటీనటులతో టాలీవుడ్ క్లాసిక్ కేరాఫ్ కంచరపాలెం నటి, నిర్మాత అయిన ప్రవీణ పరుచూరి తొలిసారి డైరెక్ట్ చేసిన చిత్రం కొత్తపల్లిలో ఒకప్పుడు. రానా దగ్గుబాటి సమర్పణలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 1997 సమయం కొత్తపల్లి అనే ఒక మారుమూల కుగ్రామంలో అప్పన్న (రవీంద్ర విజయ్) ఆ ఊరి ప్రజలకి అప్పులిచ్చి వారిని వడ్డీలతో పీడిస్తూ ఉంటాడు. తన దగ్గరే పని చేసే కుర్రాడు రామకృష్ణ (మనోజ్ చంద్ర) ఆ ఊరి జమీందార్ రెడ్డి (బెనర్జీ) మనవరాలు సావిత్రి (మోనిక)ని చిన్నతనం నుంచే ప్రేమిస్తాడు. అయితే తన ప్రేమ ఆమెకి చెప్పే క్రమంలో మరో అమ్మాయితో పెళ్లి బలవంతంగా ఫిక్స్ అవుతుంది. ఇంకోపక్క అప్పన్న ఆకస్మిక మరణం తర్వాత ఆ ఊరిలో చోటు చేసుకున్న మార్పులు ఏంటి? రామకృష్ణ సావిత్రిని పెళ్లి చేసుకోవడానికి ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అప్పన్న అంటే ఆ ఊరి జనానికి భయం కాస్తా అపారమైన భక్తిగా ఎలా మారిపోయింది? అప్పన్నకి రెడ్డి ఉన్న వైరం ఏంటి? అసలు చివరికి రామకృష్ణ ఎవరిని పెళ్లి చేసుకున్నాడు అనేవి తెలియాలి అంటే ఈ సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

కేరాఫ్ కంచరపాలెం మేకర్స్ నుంచి వస్తున్న సినిమా కాబట్టి ఆడియెన్స్ లో మినిమమ్ అంచనాలు అయినా ఉంటాయి. అయితే వాటిని కొంతమేర ఈ సినిమా అందుకుంది అని చెప్పవచ్చు. ముఖ్యంగా నాచురాలిటీతో కూడిన విజువల్స్ కానీ మాటలు గాని సినిమాలో ఆకట్టుకుంటాయి. ఫస్టాఫ్‌లో ఆరంభం కొంచెం సోసో గానే మొదలైనా తర్వాత మాత్రం సినిమా పికప్ అయ్యి డీసెంట్ గా మంచి కామెడీ సీన్స్‌తో వెళుతుంది. అక్కడక్కడా కొన్ని సీన్స్ అయితే మంచి హిలేరియస్‌గా కూడా వర్క్ అవుతాయి. అలాగే దర్శకురాలు ఎంచుకున్న పాయింట్ కూడా బాగుంది. దానికి అనుగుణంగా తెరకెక్కించిన కొన్ని సన్నివేశాలు ముఖ్యంగా సెకండాఫ్ లో ఎమోషనల్ సీన్స్ సహా మైంటైన్ చేసిన థ్రిల్ మూమెంట్స్ బాగున్నాయి. ఇక నటీనటుల్లో డెబ్యూ నటీనటులు బాగా చేశారు. హీరో మనోజ్ చంద్ర ఉత్తరాంధ్ర మాండలీకంలో మంచి బాడీ లాంగ్వేజ్, లుక్స్‌తో ఆకట్టుకున్నాడు. తన కామెడీ టైమింగ్ కూడా సినిమాలో బాగుంది. అలాగే హీరోయిన్ మోనిక తన పాత్రకి సరిగ్గా ఫిట్ అయ్యింది. నాచురల్ లుక్స్‌తో మంచి నటన కనబరిచింది. ఇక వీరితో పాటుగా ఉషా బోనెలా ఎంటర్టైనర్ అని చెప్పవచ్చు. ఆమెపై కామెడీ సీన్స్, ముఖ్యంగా హీరోతో సీన్స్ ఫన్‌గా ఉన్నాయి. ఇక వీరితో పాటుగా మరో సాలిడ్ పెర్ఫార్మర్ రవీంద్ర విజయ్ తన మార్క్ సహజ నటన మాడ్యులేషన్స్ తో సాలిడ్ పెర్ఫామెన్స్ ని అప్పన్నగా చూపించారు. తనతో పాటుగా బెనర్జీ, బాబు మోహన్ లాంటి వారు తమ సీనియార్టీ చూపించారు. అలాగే నటుడు రవీంద్ర విజయ్ పాత్ర ఇంకొంచెం ఎక్కువ ఉంచితే బాగుండు అనిపిస్తుంది. అలాగే తన రోల్ ని అర్ధాంతరంగా ఆపేయడాన్ని ఇంకొంచెం ప్రభావవంతంగా ప్లాన్ చేసి ఉంటే బాగుండేది. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు ఒకే రేంజ్ లో ఉన్నాయి. కొన్ని సన్నివేశాల్లో విజువల్ ఎఫెక్ట్స్ బాగాలేవు. మణిశర్మ ఇచ్చిన పాటలు బాగున్నాయి. వరుణ్ ఉన్ని స్కోర్ కూడా బాగుంది. పెట్రోస్ అంటోనియాడిస్ ఇచ్చిన కెమెరా వర్క్ బాగుంది. మంచి సన్నివేశాలు చూపించారు. అలాగే ఎడిటింగ్ కూడా ఒకే కానీ కొన్ని సీన్స్ ని ట్రిమ్ చేయాల్సింది. డబ్బింగ్ అతెంటిక్‌గా ఉండి సినిమాకి మరింత సహజత్వాన్ని తీసుకొచ్చింది. ఇక సినిమాలో నటి గానే కాకుండా దర్శకత్వ భాద్యతలు తీసుకున్న ప్రవీణ పరుచూరి విషయానికి వస్తే.. ఆమె ఒక బ్యూటిఫుల్ లైన్‌ని ఎంచుకున్నారు. తాను అనుకున్న పాయింట్ ని దాదాపు మంచి ఎమోషనల్ గా అలాగే ఫన్‌తో కూడా చెప్పే యత్నం చేశారు. అయితే ఇందులో కొన్ని చోట్ల మాత్రం ఆ సహజత్వం లోపించింది. అనుకున్న పాయింట్ ని చెప్పే ప్రయత్నంలో కథనాన్ని ఇంకొంచెం బెటర్ సీన్స్ తో డిజైన్ చేసుకొని ఉంటే కొత్తపల్లిలో ఒకప్పుడు మరికాస్త ఫీల్ గుడ్ గా అనిపించి ఉండేది. ఓవరాల్ గా తన వర్క్ ఒకే అని చెప్పొచ్చు.

## సెప్టెంబర్‌లో సైమా



సౌత్ సినీ లోకం ఆసక్తిగా ఎదురుచూస్తున్న సైమా 2025 (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) వేడుకకు రంగం సిద్ధమైంది. ఈ ఏడాది జరగనున్న 13వ ఎడిషన్ సైమా ఈవెంట్‌కి సంబంధించిన తేదీలను ప్రకటించారు. సెప్టెంబర్ 5, 6 తేదీల్లో దుబాయి వేదికగా ఈ ఉత్సవం జరగనుంది. ఈ విషయాన్ని సైమా నిర్వహణ కమిటీ ఎక్స్‌లో అధికారికంగా ప్రకటించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమల నుంచి ఉత్తమ ప్రతిభను కనబరిచిన చిత్రాలను, నటీనటులను గుర్తించి సత్కరించే అంతర్జాతీయ వేదిక సైమా. గత రెండు సంవత్సరాలు కూడా సైమా వేడుకలు దుబాయి వేదికగానే జరిగాయి. 9వ ఎడిషన్ మాత్రం హైదరాబాద్ వేదికగా జరిగింది. 2012లో మొదలైన సైమా అవార్డుల ఉత్సవం ఇప్పటికీ.. 12 ఎడిషన్ లు పూర్తిచేసుకుంది.

## వరుస సినిమాల జోరు

బాలీవుడ్ ఇండస్ట్రీలో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అందం, యాక్టింగ్ పరంగా సినీప్రియులను కట్టిపడేసింది. తక్కువ సమయంలోనే స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. మాజీ హోంమంత్రి కూతురు.. నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. కెరీర్ తొలినాళ్లల్లో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. ఆమె నటించిన ఫస్ట్ మూవీ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. కానీ ఇప్పుడు వరుస సినిమాలతో గ్లామర్ ప్రపంచాన్ని ఏలేస్తుంది. ఆమె పేరు భూమి పెడ్నేకర్.



# గురుకులాల్లో ఏ ఘటన జరిగినా అధికారులదే బాధ్యత



## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

### బిసి గురుకుల అధికారుల సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న బిసి గురుకులాల్లో ఏ సంఘటన జరిగినా అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గురుకులాల్లో చదువుతున్న విద్యా ర్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బిసి గురుకుల సొసైటీ అధికారులతో మంత్రి పొన్నం శుక్రవారం జూమ్ మీటింగ్‌లో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులుతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 327 బిసి గురుకులాల ప్రిన్సిపాల్‌లు, ఆర్సీఓలతో పాటు ఇతర అధికారులు జూమ్ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల గురుకులాల్లో జరుగుతున్న వరస సంఘటనలపై మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు. ఆర్సీఓలు విధిగా గురుకులాలు తనిఖీలు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రిన్సిపాల్‌లు, టీచర్‌లు పిల్లలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు పై అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పిల్లలకు నాణ్య మైన ఆహారం అందించడంలో రాజీపడవద్దన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. పిల్లలకు పోషకాలతో పౌష్టికాహారం అందించడం కోసం ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందని గుర్తు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అలాగే.పాఠశాలలో శుభ్రత పాటించాలని ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

# పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రణాళిక

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు తెలంగాణ సర్కార్ కార్యాచరణను సిద్ధం చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వ ప్రాథమిక విద్య కోసం వచ్చే పిల్లలందరికీ క్రమం తప్పకుండా పాలు అందించనున్నారు. అలాగే ఉదయం పూట అల్పాహారం కింద ఉప్మా ఇస్తారు. అంగన్‌వాడీల్లోని 3 నుంచి 6 ఏళ్ల వయసు పిల్లలకు ఇప్పటిదాకా ఒక పూట అన్నం అందిస్తూ రోజూ గుడ్డు చొప్పున ఇస్తున్నారు. ఇప్పుడు వీరికి అదనంగా 100 మిల్లీ లీటర్ల పాలు, ఉదయం అల్పాహారం కూడా ఇవ్వాలని అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జాతీయ స్థాయిలో పోల్చితే రాష్ట్రంలోని చిన్నారులు వయ సుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు, బరువు సరిగా లేనట్లు సర్వేల్లో వెల్లడైంది. ఈ లోపాన్ని అధిగమించేందుకు పలు కార్యక్రమాలను, పోషకాహార ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. కౌమార బాలికలకు చిరుధాన్యాలతో పాటు, పల్లీ చిక్కీలు ఇస్తున్న ప్రభుత్వం కొత్తగా వారి ఇంకా అదనపు పోషకాహారం ఇవ్వాలని యోచిస్తోంది.

# ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పథకాలు

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హనుమకొండ బ్యూరో, ప్రభాతవార్త:** నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులోని శ్రీ ఫంక్షన్ హాలులో నూతన రేషన్ కార్డుల పంపిణీ, కళ్యాణలక్ష్మి ృ, షాదీముబారక్ చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలు, వివోఏలకు స్టీల్ బ్యాంక్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పర్యావరణానికి, మానవాళికి ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరంగా మారిందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు స్టీల్ బ్యాంకు ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడలో స్టీల్ బ్యాంకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించామని అన్నారు. మహిళా సంఘాలు స్టీల్ బ్యాంకు బాధ్యతలను నిర్వర్తిస్తారని, గ్రామాలలో స్టీల్ బ్యాంక్ నిర్వహణకు వారే బాధ్యులని పేర్కొన్నారు.

గ్రామాలలో ఏ కార్యము జరిగిన వీటిని వినియోగించుకునేలా వివోఏలు కృషి చేయాలన్నారు. మానవ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న కాలుష్యాల్లో ప్లాస్టిక్ ఒకటని, ప్లాస్టిక్ వాడకంతో ఆరోగ్యానికి హానికరంగా, విషంగా మారుతుందన్నారు. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా అందరూ కూడా స్టీల్ వస్తువులనే వినియోగించాలని సూచించారు. ఫంక్షన్స్ లో ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో స్టీల్ లేదంటే మోదుగు ఆకు విస్తర్లను వాడాలన్నారు. ప్లాస్టిక్‌ను వాడొద్దని కోరారు.

నియోజకవర్గంలో 340 హోటల్స్ ఉండగా వాటికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలంలో ఉన్న 49 హోటళ్లకు 100 స్టీల్ ప్లేట్లు, గ్లాసుల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని తన తండ్రి పేరిట స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేసి వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు.

# మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి




### పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
### ఘనంగా ఇందిరా మహిళాశక్తి సంబురాలు
### మహిళా సంఘాలకు రెండు ఆర్టీసీ బస్సుల అప్పగింత

**చిట్యాల, జూలై 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా పనిచేస్తుందని, వారి ఆర్థిక స్వాలంబన సాధిం చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామీణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పిఏసిఎస్ కార్యాలయ ఆవరణలో గ్రామీణ అభివృద్ధి శాఖ, సేర్ఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షతన ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అనేక సంక్షేమ, ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి కృత నిశ్చయంతో పని చేస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు అనేక వ్యాపార, అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిందని పేర్కొన్నారు. మహిళలు తమ ఆలోచనలను ప్రభు త్వంతో పంచుకోవాలని, నూతన ఓ రవడులతో కొత్త వ్యాపారాలను ఎన్నుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నట్లు చెప్పారు. ప్రతి మహిళ సంఘాలలో చేరాలని సూచించారు. పదహారేళ్ల నుండి 60 ఏళ్ల వృద్ధురాలు వరకు సంఘంలో చేరే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని పునరుద్ధరించారు. ఇందిరాగాంధీ మహిళా శక్తి చాటి పాకిస్తాన్ ను గడగడలాడించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు.

ఇందిరా గాంధీ ఉక్కు మహిళగా గుర్తించబడిందని తెలిపారు. పేదరిక నిర్మూలన అంటే మహిళలు ఆర్థికంగా ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధానిలో నీ శిల్పారామంలో 300 కోట్లతో నిర్మించిన స్టాల్లో మహిళలు తయారు చేసిన వస్తువులను విక్రయించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాల కోసం ముందస్తుగా పెట్టుబడి సహాయం చేసి మహిళలను ఓనర్లుగా చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. సంఘంలోని మహిళలు మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకునేందుకు సాధారణ మరణానికి రూ 2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ, 10 లక్షల ఎక్స్రేషియా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళలకు మహిళా శక్తి క్యాంటీన్లు, గోడం, మిల్లులు, పెట్రోల్ బంకులు, పౌల్ట్రీ ఫార్మ్స్, సోలార్ విద్యుత్తు, ఆర్టీసీ బస్సులను వ్యాపార సదుపాయాలుగా అందించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే సంఘాలకు 26 వేల కోట్ల రుణాలను ఇచ్చామని, రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డల ప్రభుత్వాన్ని స్పష్టం చేశారు. 18 నెలల కాలంలో మహిళల ఆర్థిక అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# ఉద్యాన శాఖలో 175 మంది విస్తరణాధికారుల నియామకం

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** ఉద్యానవన శాఖను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 175 మంది ఉద్యానవన విస్తరణాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా 2026 మార్చి 31 వరకు రాష్ట్ర హార్టి కల్చర్ శాఖ డైరెక్టర్ నియంత్రణలో పనిచేయడానికి ఔట్‌సోర్సి ంగ్ ప్రతిపాదికన నియామకం చేపట్టారు. అత్యదికంగా భద్రాద్రి కొత్తగూడెంలో 13 మంది, ఖమ్మంలో 12, నల్లగొండ జిల్లాలో 11 మంది, రంగారెడ్డి జిల్లాలో 10, వికా రాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాలో 07 గురిని నియమిం చారు. వీరికి నెలకు రూ. 22,750 వేతన ఇవ్వనున్నట్లు ప్రభుత్వం సాధారణ పోస్టులు భర్తీ చేసేవరకు వారే విధుల్లో ఉంటారని వెల్లడించింది. కాగా ఉద్యాన శాఖలో, సాగులో శాస్త్ర సాంకేతిక మెలకువలు, సలహాలు సూచనలను ఇవ్వడానికి క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో వ్యవసాయ విస్తరణ అధికారిలాగా ఉద్యాన విస్తరణ అధికారి లేకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న 175 మంది ఉద్యాన విస్తరణ అధికారులల్లో చాలా తక్కువ మంది క్వాలిఫైడ్ వాళ్ళు ఉన్నారు. ఆ విధంగా కాకుండా ఉద్యాన విశ్వవిద్యాలయం డిప్లమా, ఉద్యాన డిగ్రీ చదివిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తే అటు ఉద్యాన రైతులకు, ఉద్యాన పట్టభద్రు లకు లాభం చేకూర్చి రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని అ శాఖ ఉద్యోగవర్గాలు సూచిస్తున్నాయి.



సర్పంచుల నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

# భారీగా తగ్గిన పంట విస్తీర్ణం

### 61 లక్షల ఎకరాల్లోనే సాగు

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:**తెలంగాణలో వానాకాలం పంటల సాగు విస్తీర్ణం భారీగా తగ్గుదల చోటు చేసుకుంది. ఈ సీజన్లో ఇప్పటివరకు కేవలం 46 శాతం భూముల్లోనే రైతులు వివిధ పంటలు సాగు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలను సాగు చేయాల్సి ఉండగా, కేవలం 61 లక్షల ఎకరాల్లోనే రైతులు పంట సాగు చేశారని వ్యవసాయ శాఖ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ప్రధాన పంటైన వరి విస్తీర్ణం 62.78 లక్షల ఎకరాలు కాగా, కేవలం 7.78 లక్షల (12.46 శాతం ) ఎకరాల్లో మాత్రమే రైతులు సాగు చేశారు. అలాగే 48.93 లక్షల ఎకరాలు ఉండే పత్తి 38.57 లక్షల ఎకరాల్లోను, 6.70 లక్షల ఎకరాలు ఉండే కంది 3.44 లక్షల ఎకరాల్లో, 5.21 లక్షల ఎకరాలు ఉండే మొక్కజొన్న 4.50 లక్షల ఎకరాల్లో, 4.20 లక్షల ఎకరాలు ఉండే సోయాబీన్ 3.31 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ తన నివేదికల్లో వెల్లడించింది. వీటితో పాటు పప్పు ధాన్యాలు, నూనె గింజల పంట సాగు కూడా తగ్గిపోయిందని తెలిపిన వ్యవసాయ శాఖ తెలిపింది. ఊహించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్లనే పంట సాగు విస్తీర్ణం తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

# కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన.. రేవంత్‌ది ప్రజాపాలన

### బండి సంజయ్, కెటిఆర్, హరీశ్ అచానక్ లీడరు అయిండ్రు
### బావ, బామ్మర్దులది పనికిమాలిన ఏడుపు : మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరబాద్, జూలై 18, ప్రభాతవార్త:** పదేళ్ల రాజభోగాలు అనుభవించి పదవి పోయేసరికి షాక్‌లో ఉండి బావ బామ్మర్దులది పనికిమాలిన ఏడుపు ఏడుస్తున్నారని.. చంద్రబాబు, రేవంత్ రెడ్డి రెండు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు తెలంగాణ హక్కుల సాధనకోసమే సిఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్తున్నారని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగం అయ్యి బనకచర్ల గురించి మాట్లాడినట్లు న్నారని వివరణ ఇచ్చారు. జలశక్తి శాఖ ప్రకటనలో బనకచర్ల అంశం లేనేలేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల అంశాలపై ముఖ్యమంత్రులు కూర్చుని చర్చించడంలో తప్పేముందని అని ప్రశ్నించారు. కెసిఆర్‌ది ఫాంహౌజ్ పరిపాలన, రేవంత్‌రెడ్డిది ప్రజాపరిపాలన అని అన్నారు. 'మీరు ఫాం హౌజ్ లో పడుకున్నారని, మమ్మల్ని కూడా ఫాం హౌజ్ లోనే పడుకోమంటారా?' జగ్గారెడ్డి నిలదీశారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం కేసీఆర్ ఎప్పుడైనా ఢిల్లీకి వెళ్లారా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పాలన సరిగా లేకనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని అన్నారు. కెసిఆర్ పర్మనెంట్‌గా ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారంటూ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని జగ్గారెడ్డి అన్నారు. పార్టీ నుంచి తెలంగాణ పదాన్ని తీసేసిన వాళ్లు తెలంగాణ కోసం అడిగే అర్హత ఎక్కడిదని నిలదీశారు. 'హరీశ్‌రావు ఎక్కడ పడుకుంటే మాకెందుకు?' అని ఆయన అన్నారు. హరీశ్ అంత యాక్టింగ్ మాకు రాదు. ఉత్తమ్ యాక్టర్ కాదు ఫైటర్ అని అన్నారు. హరీశ్, కేటీఆర్, బండి సంజయ్ అచానక్ లీడర్లు అయింద్రు అని ఆయన వివరించారు. కేటీఆర్ లోకేష్ ను ఎందుకు కలిశావు సమాధానం చెప్పు అని నిలదీశారు.

# సర్పంచుల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి

### న్యాయపోరాటానికి అండగా ఉంటా: మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 18, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సర్పంచులకు ఇవ్వవలసిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌వద్ద రెండు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సర్పంచుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకూడదని, వారు తమ స్వంత నిధులతో గ్రామాలను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా సర్పంచులకు ఏ సమస్య వచ్చినా, వారికి అండగా నిలిచానని, ఇప్పుడు కూడా ప్రజా ప్రతినిధుల ఫోరం నాయకునిగా, తెలంగాణ ఉద్యమకారునిగా, సర్పంచులు చేస్తున్న న్యాయపోరాటానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా స్పందించి, సర్పంచుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా, పెండింగ్ బిల్లులను చెల్లించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా సర్పంచులపై కక్షసాధించటం న్యాయం కాదని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ నేతలు గుంటి మధుసూదన్‌రెడ్డి, మాట్ల మధు, రాంపాక నాగయ్య, పూడూరి నవీన్‌గౌడ్, నెమలి సుభాష్‌గౌడ్, వెంకటాపూర్ రాజేందర్, కేశబోయిన మల్లేష్, సముద్రాల రమేష్, శారద, కల్పన, రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు పెద్దఎత్తున హాజరయ్యారు.

# ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు

### మాజీ సర్పంచ్‌ల జెఎసి అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** సర్పంచులు కూడా ఎవరు కూడా ఆత్మహత్యలు చేసుకోవద్దు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు మీ పోరాటానికి మేము అండగా ఉంటామని ప్రభుత్వం బిల్లులు చెల్లించే వరకు పోరాటం చేసి సాధించుకోవాలి ఎవరు కూడా అధైర్య మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ అన్నారు.గురువారం తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటి రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని జోన్ ఇందిరాపార్క్ వద్ద పెండింగ్ లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన సర్పంచ్‌ల మహాధర్నా జరిగింది. గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకుపెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను వెంటనే చెల్లిం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జేఏసీ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కేశ బోయిన మల్లయ్య మెడబోయిన గణేష్ పూడూరి నవీన్‌గౌడ్ రాజేందర్ అంజయ్య పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై మద్దతు తెలిపారు.




# డ్రగ్స్‌తో దుబాయిలో చనిపోయిన కేదార్‌తో పెట్టుబడులు పెట్టించిందెవరు?

### సొంత చెల్లెలి ఫోన్ ట్యాప్ చేసిన ఘనత కెటిఆర్‌ది
### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** డ్రగ్స్ కారణంగా చనిపోయిన కేదార్ అనే వ్యక్తితో దుబాయ్‌లో పెట్టుబడులు పెట్టించిందెవరు? కెటిఆర్‌కు మృతుడికి మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్న సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల్లో తప్పేముంది? అని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నిలదీశారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సొంత చెల్లెలి ఫోన్ ట్యాపింగ్ చేసిన కెటిఆర్ ఖమ్మం చౌరాస్తాలో కూర్చుని కమ్మని ముచ్చట్లు చెబుతున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం విచారణ జరుగుతోందని అలాంటిది కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మా మంత్రుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని చెబుతున్న కేటీఆర్ రాత్రి కలగన్నారా అని ఎద్దేవా చేశారు. నీటి కేటాయింపుల్లో మన వాటా మనకు దక్కాల్సిందేనని చెప్పారు. కేటీఆర్ రచ్చ, చర్చ అని ఆరోపణలు చేస్తున్నారని కానీ గత పదేళ్లు చర్చ లేకుండా అసెంబ్లీ నడిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేదని మాట్లాడుతున్న కెటిఆర్‌కుకు కళ్లు కనపడటంలేదా అని నిలదీశారు. కేంద్ర జలశక్తి శాఖ ఇరు రాష్ట్రాల సీఎంలను ఢిల్లీకి పిలిపించింది. రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై నెలకొన్న సమస్యలపై చర్చిం చేందుకే వారిని రప్పించినట్లు పత్రికా ప్రకటన కూడా విడుదల చేసింది. దానిని పక్కన పెట్టి బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చించారంటూ బిఆర్ఎస్ నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అన్నారు.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 229

**హైదరాబాద్ (బేగంపేట) జూలై 18, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణిలో మొత్తం 229 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సం బంధించి 63 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 45 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 27 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 59 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్ చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.

# గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టిఎన్‌జిఓలకే కేటాయించాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు టిఎన్‌జిఓ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టిఎన్‌జి వోలకే కేటాయించాలని కోరుతూ టిఎన్‌జివో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకి విజ్ఞప్తి చేసింది. గచ్చిబౌలి భాగ్యనగర్ తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్ మ్యుచివల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటి .. తమకు కేటాయించిన స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు తమది అంటు స్థలం కబ్జాకు యత్నిస్తున్నారని ప్రభుత్వం వెంటనే ఆ స్థలాలను గత ఉత్తర్వుల మేరకు బిటిఎన్‌జీవోస్ సొసైటీకి కేటాయించాలని టిఎన్‌జివో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు టిఎన్‌జివో కోశాధికారి ముత్యాల సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కొండలు రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావుతోపాటు ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేసినట్టు టిఎన్‌జివో సంఘం నేతలు తెలిపారు. స్పందించిన సిఎస్.. తప్పకుండా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినందుకు టిఎన్‌జివో సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు అధ్యక్షులు మారం జగదీశ్వర్ తెలిపారు. దాదాపు 4 వేల మంది రిటైర్ ఉద్యోగులు, సర్వీసులో ఉన్న ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని.. ఆ స్థలాలను వారికి కేటాయించాలని సిఎస్‌ని, ముఖ్యమంత్రి కార్యదర్శిని కోరినట్టు వారు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

# బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం కావాల్సిందే

### మాజీ డిజిపి పూర్ణచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** బీసీలు అందరితోపాటు సమాజంలో గౌరవంగా బతకా లంటే తప్పనిసరిగా బిసిలకు రక్షణ చట్టం కావాల్సిందేనని ఆల్ ఇండియా బిఎస్పీ పార్టీ జాతీయ కోఆర్డినేటర్, విశ్రాంత డిజిపి డా. జుజ్జవరపు పూర్ణచంద్ర రావు అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్యారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి మాజీ ఐఏఎస్ చిరంజవులు, విజెఆర్ నారగోని తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ రావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో బిసిలు అనచివేతకు గురవుతున్నా రన్నారు. గతంలో ఎస్సీలపై దాడులు జరగడంతో ఎస్సీ రక్షణ చట్టం వచ్చిందని ఇప్పుడు బీసీలు మాట్లాడ డానికే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఇటీవల బీసీ రాజకీయ నాయకులు అనేక దాడులు చేస్తున్నారని అందులో భాగంగానే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపైనా దాడి జరిగిందన్నారు. భారత రాజ్యాంగం అందరికీ సమానత్వాన్ని హామీ ఇస్తున్నప్పటికీ, బిసిలు ఇంకా వివక్ష, దౌర్జన్యం, సామాజిక బహిష్కరణకు గురవు తున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక చారి త్రకమైన రక్షణ చట్టాన్ని రూపొం దించాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన తరగతులపై 'వివక్ష, అణచివేత నిరోధక చట్టం, 2025' అనే ముసాయి దాను బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ నాయకులు విడుదల చేసారు. ఈ చట్టం ద్వారా బీసీలపై జరిగే సామాజిక, ఆర్థిక, శారీరక అణచివేతను నిరోధించ డంతోపాటు, బాధితులకు న్యాయం, గౌరవం, పునరా వాసం కల్పించేందుకు నూతన నిబంధనలు రూ పొందించ బడ్డాయన్నారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన వెంటనే, రాష్ట్రంలోని బీసీ వర్గాలపై జరిగే వివక్షను సమూలంగా అరికట్టగలదని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేం దర్‌గౌడ్, యువజన సంఘం అధ్యక్షులు కనకాల శ్యాంకురుమ, వివిధ సంచార జాతుల ప్రతినిధులు పాల్గొన్నారు.




ప్రెస్‌క్లబ్‌లో అభివాదంచేస్తున్న పూర్ణచందర్‌రావు, చిరంజీవులు, సూర్యారావు, విజెఆర్ నారగోని తదితరులు

# మల్కాజిగిరిలో గూండా పాలన

### పోలీసుల బానిసగిరి భరించలేం : కెటిఆర్

**హైదరాబాద్ (మల్కాజిగిరి), జూలై 18, ప్రభాతవార్త :** మల్కాజిగిరిలో కాంగ్రెస్ నేతలు గూండాగాళ్లలా ప్రవర్తిస్తుండగా, వారిని నియంత్రించాల్సిన పోలీస్ యంత్రాంగం వారికి ఆశ్రయం ఇచ్చే స్థాయికి దిగజారిందని, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కార్యకర్తలపై దాడులు చేసిన కాంగ్రెస్ గూండాలను కాపాడేలా వ్యవహరిస్తున్న పోలీసుల తీరుపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. 'అక్కడక్కడ పిచ్చికుక్కలు ఉంటాయని విన్నాం. కానీ మల్కాజిగిరిలో ప్రత్యక్షంగా చూస్తున్నాం. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. దాడిచేసి కూడా తిరిగి గూండాగాళ్లలా సవాలు విసురుతున్నారు. ఇంతకీ పోలీసులు ఎవరి పక్షంగా ఉన్నారు?' అని కేటీఆర్ ఘాటుగా ప్రశ్నించారు.

#### చిల్లర రాజకీయాలకు బానిసలైన పోలీసులు

'గుళ్ల దగ్గర చెక్కుల పంపిణీకి వెళ్లిన మా నాయకులపై దాడిచేసిన వారిని వదిలేసి, రీట్వీట్ చేసిన వారిపై కేసులు పెడుతున్నాయి. ఇలాంటి పోలీస్ వ్యవస్థ ఎలా న్యాయాన్ని పరిరక్షించగలదు? ప్రజల రక్షణ బాధ్యత వహించాల్సిన వారు - ఇప్పుడు దాడులు చేసే వారికే బాసటగా నిలుస్తున్నారు' అని విమర్శల వర్షం కురిపించారు.'ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి సిద్దిపేటలో హరీశ్‌రావు కార్యాలయం మీద దాడి చేసినప్పుడు పోలీసులు ఒక్క అడుగు ముందుకువేయలేదు. కానీ బీఆర్ఎస్ కార్యకర్తలు ట్వీట్ చేస్తే మాత్రం చట్టం మొహం చూపుతోంది. ఇదేం న్యాయం?' అని ప్రశ్నించారు.

# టీమిండియాకు డు ఆర్ డై



## ఓల్డ్ ట్రాఫోర్ట్‌లో ప్రతికూల రికార్డు
## నాల్గో టెస్టులో హిస్టరీ క్రియేటయ్యేనా?

**న్యూఢిల్లీ:** భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ ఉత్కంఠగా కొనసాగుతోంది. మూడు మ్యాచ్‌లు ముగిసే సమయానికి ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో ఉంది. ఇప్పుడు నాల్గవ టెస్ట్ మ్యాచ్ ఈ నెల 23 నుంచి మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్ టీమిండియాకు డూ ఆర్ డై మ్యాచ్‌కానుంది. ఈ మ్యాచ్‌లో ఓడినా లేదా డ్రా చేసుకున్నా, సిరీస్‌ను గెలిచే అవకాశం భారత్‌కు ఉండదు. నాల్గవ టెస్ట్ ప్రారంభం కాకముందే, మాంచెస్టర్ మైదానంలో భారత్, ఇంగ్లాండ్, ఎవరికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయనేది ఆసక్తికరంగా మారింది. ముందుగా టెస్ట్ క్రికెట్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య హెడ్‌టు హెడ్ రికార్డు చూస్తే ఈ రెండు దేశాల మధ్య ఇప్పటివరకు మొత్తం 139 టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో ఇంగ్లాండ్ 53 సార్లు విజయం సాధించగా, టీమిండియా 36 సార్లు గెలిచింది. మిగిలిన 50 టెస్ట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఇక మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో భారత్, ఇంగ్లాండ్ మధ్య ఇప్పటివరకు 9 టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో ఇంగ్లాండ్ 4 సార్లు విజయం సాధించగా, మిగిలిన 5 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. టీమిండియాకు ఈ మైదానంలో టెస్ట్ మ్యాచ్‌లో ఇప్పటివరకు ఎప్పుడూ విజయం దక్కలేదు. ఇక్కడ 1974లో భారత్ గెలుపుకు అత్యంత దగ్గరగా వచ్చింది. అప్పుడు ఇంగ్లాండ్ చేతిలో 113 పరుగుల తేడాతోఓటమిపాలైంది. భారత్, ఇంగ్లాండ్ ఈ మైదానంలో చివరిసారిగా 2014లో తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఒక ఇన్నింగ్స్‌లో 367 పరుగులు చేసింది. దీనికి సమాధానంగా భారత జట్టు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి కూడా 367 పరుగులు చేయలేకపోయింది. చివరికి టీమిండియా ఆ మ్యాచ్‌ను ఇన్నింగ్స్ 54 పరుగుల తేడాతో ఘోరంగా ఓడిపోయింది. ఇది భారత జట్టుకు ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో ఉన్న ప్రతికూల రికార్డుకు ఒక ఉదాహరణ. ప్రస్తుత భారత జట్టులోనిచాలామంది క్రికెటర్లు ఓల్డ్‌ట్రాఫోర్డ్ మైదానంలో ఇప్పటివరకు టెస్ట్‌మ్యాచ్ ఆడలేదు. ఈ మైదానంలో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మెన్ సునీల్‌గావస్కర్. ఆయన ఇక్కడ ఐదు ఇన్నింగ్స్‌లలో 242 పరుగులు చేశారు. 21వ శతాబ్దంలో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఏ భారతీయ బ్యాట్స్‌మెన్ కూడా ఇక్కడ టెస్ట్ మ్యాచ్‌లలో 200 పరుగుల మార్కును చేరుకోలేకపోయారు.




## మహిళల ప్రపంచ కప్.. టైబ్రేకర్లకు చేరిన
# హంపి, హారిక, దివ్య, వైశాలి

**న్యూఢిల్లీ:** ఫిడే మహిళల ప్రపంచ కప్-2025లో భారత మహిళా చెస్ క్రీడాకారిణులు కోనేరు హంపి, హారిక డి, దివ్య దేశ్‌ముఖ్ మరియు ఆర్ వైశాలి వారివారి రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లలో టైబ్రేక్‌లకు చేరుకున్నారు. జార్జియాలో జరిగిన తొలి క్లాసికల్ మ్యాచ్‌లో చైనాకు చెందిన రెండో సీడ్ ఝు జినర్‌ను మట్టికరిపించిన దివ్య, రెండో మ్యాచ్‌లో బ్లాక్ పావులతో ఓటమిని ఎదుర్కొంది, మ్యాచ్‌ను వేగవంతమైన టైబ్రేక్ గేమ్‌లకు నెట్టింది. ఇంతలో, హంపి, హారిక మరియు వైశాలి వారి వారి క్లాసికల్ మ్యాచ్‌లలో వరుసగా రెండు డ్రాలు ఆడారు. క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం కోసం టైబ్రేక్ మ్యాచ్‌లపై ఆధారపడవలసి ఉంటుంది. ఇక హంపి మరియు దివ్యలకు ఈ టోర్నమెంట్‌లో ఇది తొలి టైబ్రేక్‌లు కాగా, వైశాలి మరియు హారిక వరుసగా రెండవ రౌండ్‌లో టైబ్రేక్ మ్యాచ్‌లు ఆడనున్నారు. యాదృచ్ఛికంగా, నాలుగు భారత మ్యాచ్‌లు టై బ్రేక్‌లోకి వెళ్ళాయి, అయితే మిగిలిన నాలుగు ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో రెండు క్లాసికల్ మ్యాచ్‌ల విజేతలు ఉన్నారు. లీ టింగ్జీ, నానా జాగ్నిడ్జ్, సాంగ్ యుక్సిన్, టాన్ జోంగి టైబ్రేక్ మ్యాచ్‌లు ఆడనున్నారు.

## అంతర్జాతీయ రెజ్లింగ్ సర్క్యూట్‌లో..
# సుజీత్‌కు స్వర్ణ పతకం



**న్యూఢిల్లీ:** పాలియాక్ ఇమ్రే వర్గా జానోస్ మెమోరియల్ ర్యాంకింగ్ సిరీస్‌లో సంచలనాత్మక బంగారు పతక ప్రదర్శనతో భారత్‌కు చెందిన సుజీత్ కల్కల్ అంతర్జాతీయ రెజ్లింగ్ సర్క్యూట్‌లో తన వేగవంతమైన ఆరోహణను కొనసాగించాడు. ఎఫ్‌మెన్ 65 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో పోటీ పడుతున్న సుజీత్, అత్యున్నత గౌరవాలను గెలుచుకోవడమే కాకుండా, శుక్రవారం తెల్లవారుజామున ఒలింపిక్ పతక విజేత ఇస్లాం దుదేవ్‌పై అద్భుతమైన గెలుపుతో వార్తల్లో నిలిచాడు. ఫైనల్లో, సుజీత్ అజర్‌బైజాన్‌కు చెందిన, మూడుసార్లు యూరోపియన్ కాంస్య పతక విజేత అయిన అలీ రహీమ్‌జాదేను 5-1 స్కోరుతో ఓడించాడు. కానీ ఈరోజు ప్రీక్వార్టర్ ఫైనల్‌లో అల్బేనియాకు చెందిన ఇస్లాం దుదేవ్‌పై అతని ఆధిపత్య 11-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయం ప్రత్యేకంగా నిలిచింది. పారిస్ 2024 ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత అయిన దుదేవ్ పూర్తిగా వెనుకబడ్డాడు. బుడాపెస్ట్‌లో ఈ విజయం సీనియర్ సర్క్యూట్‌లో సుజీత్ సాధించిన అతిపెద్ద విజయాలలో ఒకటిగా నిలుస్తుంది. ఇటీవల జూన్‌లో తనరెండవ అండర్ 23 ఆసియా ఛాంపియన షిప్ టైటిల్‌ను గెలుచుకున్నాడు, మరో సాంకేతిక సుపీరియారిటీ ప్రదర్శనతో ఫైనల్‌ను గెలుచుకున్నాడు. 2024లో,అతను టిరానాలో జరిగిన అండర్23 ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో 70కిలోల విభాగంలో పోటీపడి కాంస్యంసాధించాడు. అదే సంవత్సరం, అతను వరుసగా రెండవ సీనియర్ జాతీయ టైటిల్‌ను కూడా కైవసం చేసుకున్నాడు.



## ఫ్రీస్టైల్ గ్రాండ్ స్లామ్‌లో..
## తొలి భారతీయునిగా
# అర్జున్ రికార్డు

**న్యూఢిల్లీ:** అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరిగిన ఫ్రీస్టైల్ గ్రాండ్‌స్లామ్ టూర్‌లో సెమీఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయుడిగా గ్రాండ్‌మాస్టర్ అరిగైసి అర్జున్ నిలిచాడు. ఫ్రీస్టైల్ ఫార్మాట్ చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ అర్జున్ తన ఘన ఫామ్‌ను కొనసాగించాడు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లోని మొదటి రెండు ఆటలలో అతను ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌ను ఓడించాడు, మొట్ట మొదటి ఫ్రీస్టైల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లోని ఈ నాల్గవ మరియు చివరి లెగ్‌లో టాప్‌నాలుగు స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. నోడిర్బెక్‌తో జరిగిన మ్యాచ్‌లో నల్ల పావులతో ఘనమైన డ్రాతో అర్జున్ రోజును ప్రారంభించాడు, ఆపై ఆటలో తన ఎక్స్ఛేంజ్ ప్రయోజనాన్ని మార్చుకున్న తర్వాత తెల్ల పావులతో బలంగా తిరిగి వచ్చి 1.5-0.5 విజయాన్ని నిర్ధారించాడు. సెమీఫైనల్లో అర్జున్ ఏకైక అమెరికన్యేతర ఆటగాడు అవుతాడు, తన మొట్టమొదటి ఫ్రీస్టైల్ గ్రాండ్ స్లామ్ ఫైనల్‌కు అర్హత సాధించాలని పట్టుదలతో ఉన్నాడు. మరోవైపు, గ్రాండ్ మాస్టర్ ఆర్ పర్గనంద తన 7గేమ్‌లో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అనుభవజ్ఞుడైన అమెరికన్ ఆటగాడు ఫాబియానో కరువానా చేతిలో టైబ్రేకర్లలో 3-4 తేడాతో ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నాడు. ఫ్రీస్టైల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో ప్రాగ్‌కు ఇది మొదటి క్వార్టర్ ఫైనల్, కానీ అతను దానిని విజయంగా మార్చలేకపోయాడు. అయినప్పటికీ, దిగువ బ్రాకెట్ ప్లేఆఫ్ మ్యాచ్‌ల ద్వారా అతను ఇప్పటికీ మూడవ స్థానాన్ని కొనసాగిస్తున్నాడు.

# ఉమెన్స్ గోల్ఫ్‌లో నేహా ఆధిక్యం
## 1 నుండి 9కి అమన్‌దీప్ పతనం



**న్యూఢిల్లీ:** భారత మహిళల సర్క్యూట్‌లో అత్యంత అనుభవజ్ఞులైన స్టార్లలో ఒకరైన నేహా త్రిపాఠి, క్లోవర్ గ్రీన్స్‌లో జరిగిన మహిళల ప్రో గోల్ఫ్ టూర్ తొమ్మిదవ లెగ్‌లో రెండవ రౌండ్ తర్వాత 7అండర్ 65తో అద్భుతమైన ప్రదర్శనను అందించింది, ఇది ఆమెను 3షాట్‌ల ఆధిక్యంలోకి నెట్టివేసింది. 33 ఏళ్ల నేహా అగ్రస్థానానికి చేరుకున్నప్పటికీ, ఓవర్‌నైట్ లీడర్ అమన్‌దీప్ డ్రాల్ 4 ఓవర్ల 76 రౌండ్‌తో పెద్ద పతనాన్ని చవిచూసింది, ఆమె మొదటి రౌండ్ కంటే ఏడు షాట్లు దారుణంగా ఉన్నాయి. దీంతో క్లోవర్ గ్రీన్స్ పార్ 72 లేఅవుట్‌లో అమన్‌దీప్ ఇప్పుడు మొదటి స్థానం నుండి తొమ్మిదో స్థానానికి పడిపోయింది. 2023 నుండి గెలవని నేహా, ఆ సంవత్సరంలో ఆమె మూడుసార్లు ట్రోఫీని ఎత్తింది, ఆమె 1అండర్ 71 లో తన మొదటి రౌండ్‌ను 65తో పూర్తి చేసింది, ఇందులో ఆరు బర్డీలు మరియు ఒక బోగీకి వ్యతిరేకంగా ఒక ఈగిల్ ఉన్నాయి. గత సీజన్‌లో గాయాలతో పోరాడి, తన సరైన ఫామ్ మరియు లయను కనుగొనడానికి ప్రయత్నిస్తున్న నేహా, కోర్సులో ముందు తొమ్మిది స్థానాల్లో నాలుగు బర్డీలను కలిగి ఉంది, వెనుక తొమ్మిది స్థానాల్లో, ఆమె ఒక ఈగిల్‌ను ల్యాండ్ దాని తర్వాత బర్డీలతో 65 పరుగులు చేసింది. బోగీ లేకుండా రెండవ రౌండ్ సాధించిన జాస్మిన్ శేఖర్ (72-67) కంటే నేహా మూడు షాట్ల ఆధిక్యంలో ఉంది. జాస్మిన్ ముందు తొమ్మిది స్థానాల్లో మూడు బర్డీలు కొట్టగా, వెనుక తొమ్మిది స్థానాల్లో మరో రెండు షాట్లు కొట్టింది. మూడవ స్థానంలో ఉన్న కృతి చౌహాన్, ప్రోగా మొదటి రౌండ్ 73 తర్వాత 69 పాయింట్లతో మంచి పురోగతి సాధించింది. అమెచ్యూర్ సాన్వి సోము (73-70) ఏకైక నాల్గవ స్థానంలో నిలిచింది. రిధిమా దిలావారి (74-71), లావణ్య జాడన్ (73-72), అమన్‌దీప్ డ్రాల్ (69-76) 1ఓవర్ 145 వద్ద తొమ్మిదో స్థానంలో నిలిచారు.

# మరోసారి ఆర్‌బిఐ నుంచి గుడ్‌న్యూస్!

**న్యూఢిల్లీ, జూలై 18:** ఈ ఏడాది అంచనాలకు మించి ఆనందాన్ని ఇచ్చిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆ సంతోషాన్ని మరికొంత కాలం పొడిగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఆగస్టులోనూ వడ్డీ రేట్ల కోత ఉండొచ్చని సమాచారం. వచ్చే నెలలో జరగనున్న ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్లు (0.25శాతం) తగ్గించే అవకాశం ఉన్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ అంచనా వేసింది. ప్రస్తుతం భారత్‌లో వృద్ధి అవుట్‌లుక్ మిశ్రమంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో వినిమయ డిమాండ్ బలహీనంగా ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం పటిష్టంగా కొనసాగుతోంది. అమెరికాకు ఎగుమతులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. కానీ, ఇతర ప్రాంతాలకు మాత్రం ఇంకా ఆశించిన స్థాయిలో ఎగుమతులు జరగట్లేదు. ఈ పరిణామాలతో పాటు ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకుంటే.. రేట్ల కోతకు ఆగస్టు సరైన సమయమని ఆర్‌బీఐ భావించే అవకాశం ఉంద్ధి అని ఐసీఐసీఐ తమ నివేదికలో పేర్కొంది. వచ్చే నెలలో జరిగే ఎంపీసీ సమావేశంలో రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించి.. 5.25 శాతానికి తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. గత ద్రవ్య పరపతి విధాన సమీక్ష తర్వాత నుంచి ద్రవ్యోల్బణం అంచనాలను మించి తగ్గుముఖం పట్టిందని, 202526 ఆర్థిక సంవత్సరంలో ఇది 2.9 శాతం ఉండొచ్చని ఐసీఐసీఐ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 3.7 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ గతంలో అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో 0.25శాతం చొప్పున కీలక రేట్లను తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి తెలిసిందే. అలా మూడు వరుస సమీ క్షల్లో కలిపి రెపోరేటు తగ్గింది. ఈ రేటు ఆధారంగా బ్యాంకులు గృహ, వాహన, ఇతర రుణాలపై వడ్డీరేట్ల సవరిస్తాయి. ఆర్‌బీఐ కల్పించిన ప్రయోజనాన్ని బ్యాంకులు పూర్తిగా తమ ఖాతాదార్లకు బదలాయిస్తే, సామాన్యులకు ఆయా రుణాలపై నెలవారీ కిస్తీల భారం తగ్గుతుంది. ఇప్పుడు వచ్చే నెలలోనూ రెపో రేటులో కోత ఉంటే.. ఈ రుణగ్రహీతలకు మరింత ఉపశమనం లభించనుంది.



## వివిపి ఇండస్ట్రీస్ అధిపతి సంచలన వ్యాఖ్యలు
### నా వ్యాపార సామ్రాజ్యంపై వారసులకు నిరాసక్తి..

**న్యూఢిల్లీ, జూలై 18:** ప్రముఖ లగేజీ కంపెనీ వివిపిఇండస్ట్రీస్ అధిపతి దిలీప్ పిరమల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. రూ.6,800 కోట్ల విలువైన కంపెనీలో ప్రమోటర్ల గ్రూప్ 32 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తమ సంస్థలో ఉన్న 51.73 శాతం వాటాలో 32 శాతం షేర్లను ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడిదారులు, ఇతరులకు విక్రయించేందుకు ప్రమోటర్ల గ్రూప్ సిద్ధమైందని స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో వీఐపీ ఇండస్ట్రీస్ వెల్లడించింది. ఈ ఫైలింగ్ అనంతరం దిలీప్ పిరమల్ మాట్లాడుతూ, మాది కుటుంబ యాజమాన్యంలో ఉన్న వ్యాపారం. తర్వాతి తరం దీనిని నడిపించడంలో ఆసక్తి చూపడం లేదు. ఐదు దశాబ్దాలుగా నడుస్తోన్న వ్యాపారంలో వీఐపీ మార్కెట్ లీడర్‌గా ఉంది. కానీ గత ఐదు సంవత్సరాల కాలంలో మేం మార్కెట్ వాటాను కోల్పోతున్నాం. గతఏడాది మేం నాలుగు త్రైమాసికాల్లో నష్టాలు చవిచూశాం. నిర్వహణ పరమైన సమస్యల కారణంగా మొదటి సారి మేం ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. రానున్న రెండు, మూడు సంవత్సరాల్లో మేం బాగా పని చేయాల్సిన అవసరం ఉంది. నా వరకు షేర్ హోల్డర్ల ప్రయోజనాలు కాపాడటం ముఖ్యం. కొత్త యాజమాన్య బృందాన్ని తీసుకురావడమే ఈసంస్థ ముందుకు సాగడానికి ఉన్న ఏకైక మార్గం. ఈ సంస్థ బలమైన పునాదులతో నిర్మితమై ఉంది. త్వర్లోనే వేగంగా పుంజుకుంటుంది. పెట్టుబడిదారులంతా సహనం వహించాలని కోరుతున్నాను. మేనేజ్‌మెంట్ మార్పు అంత సులభం కాదు అని అన్నారు. అలాగే తమ కుటుంబ సభ్యుల్లో ఒకరు బోర్డులో భాగంగాఉంటారని చెప్పారు. ఆ గ్రూప్‌లో దిలీప్ పిరమల్, కెంప్ అండ్ కంపెనీ లిమిటెడ్, డీజీపీ సెక్యూరిటీస్ లిమిటెడ్, కిడ్డీ ప్లాస్ట్‌లిమిటెడ్, పిరమల్ వైభతి ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్, ఆల్కన్‌ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్‌లిమిటెడ్ భాగం. ఈ విక్రయం తర్వాత వాటా విలువ 19.73 శాతానికి పడిపోనుంది.



## రిలయన్స్ రిటైల్ చేతికి కెల్వినేటర్

**న్యూఢిల్లీ, జూలై 18:** దేశీయ కన్జూమర్ డ్యూరబుల్ బ్రాండ్ కెల్వినేటర్‌ను కొనుగోలు చేసినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ శుక్రవారం ప్రకటించింది. ఎంత మొత్తానికి కొనుగోలు చేసింది మాత్రం వెల్లడించలేదు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ప్రీమియం హోమ్ అప్లయన్సెస్ మార్కెట్‌లో తమ వృద్ధికి ఈ కొనుగోలు ఉపయోగపడుతుందని రిలయన్స్ రిటైల్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇంట్లో వినియోగించే ఎలక్ట్రిక్ రిఫ్రిజిరేషన్ విభాగంలో కెల్వినేటర్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. దేశీయంగా అత్యాధునిక సాంకేతికత, మెరుగైన పనితీరు, నాణ్యత విషయంలో పేరెన్నికగన్న కెల్వినేటర్ 1970, 80ల్లో ది కూలెస్ట్ వన్ ట్యాగ్‌లైన్‌తో ఐకానిక్ బ్రాండ్ గుర్తింపు పొందింది. అలాంటి బ్రాండ్ దేశంలో విస్తృత రిటైల్ నెట్‌వర్క్ కలిగిన రిలయన్స్‌తో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని రిలయన్స్ వెంచర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ పేర్కొన్నారు. దీనివల్ల ప్రీమియం గృహోపకరణాల మార్కెట్‌లో కంపెనీ గణనీయమైన వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.




# వాణిజ్యం


## విద్యుత్ వాహనాల బ్యాటరీలపై చైనా ఆంక్షలు!

**చైనా, జూలై:** ప్రపంచ విద్యుత్తు వాహనాల మార్కెట్‌ను చైనా తన గుప్పిట బంధించే ప్రయత్నాన్ని వేగవంతం చేసింది. ఈక్రమంలో డ్రాగన్ ఈవీలకు గుండె వంటి బ్యాటరీ టెక్నాలజీలను బంధిస్తోంది. తాజాగా ఎనిమిది రకాల వాహన బ్యాటరీలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం చైనా సరిహద్దులు దాటకుండా ఆంక్షలు విధించింది. వాస్తవానికి ఆరు నెలల క్రితమే ఆ దేశం కొన్ని ఆంక్షలను అమల్లోకి తీసుకొచ్చింది. అయితే.. ఇప్పుడు ఆ టెక్నాలజీలను వాడి బ్యాటరీలను ఉత్పత్తి చేసేవారు వాటిని విదేశాలకు ఎగుమతి చేసే ముందు చైనా ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రకటన ప్రకారం, వాణిజ్యం, ఇన్వెస్ట్‌మెంట్, సాంకేతికత సహకారం రూపంలో ఇతర దేశాల్లోని సంస్థలకు టెక్నాలజీ బదిలీలకు కచ్చితంగా ప్రభుత్వం జారీ చేసే లైసెన్స్‌లు అవసరం అని వెల్లడించింది. చైనా ఆంక్షలు విధించిన టెక్నాలజీల్లో కొన్ని లిథియం అయాన్ బ్యాటరీలో కీలకమైన కాథోడ్స్ తయారీకి వినియోగిస్తారు. అదే శక్తి బ్యాటరీ పనితీరును నిర్ణయిస్తుంది. దీంతోపాటు కాథోడ్స్ తయారీ వినియోగించే కొన్ని పదార్థాలకు వాడే సాంకేతికతను కూడా చైనా అణిచిపెట్టింది. వీటిల్లో లిథియం అయాన్ పాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పీ), లిథియం మాగ్నెస్ ఐరన్ పాస్ఫేట్ (ఎల్ఎంఎఫ్‌పీ), ఇతర పాస్ఫేట్ ఆధారిత మెటీరియల్ తయారీకి వాడేవి, పనితీరు అంచనావేసే ప్రమాణాలు, ఇతర రసాయన సమ్మేళనాలపై ఆంక్షలు వర్తింపజేసింది. లిథియం ఉత్పత్తి, ప్రాసెసింగ్‌ను బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకొంది. ఇక సెమీకండెక్టర్ల తయారీ మెటీరియల్‌కు వినియోగించే గాలియం ఉత్పత్తి, ఐయాన్ ఎక్స్ఛేంజీ టెక్నాలజీని నియంత్రిస్తోంది. చైనాలోనే అత్యధిక విద్యుత్తు వాహనాల ఉత్పత్తి వాస్తవానికి ప్రపంచ విద్యుత్తు వాహనాల బ్యాటరీ పరిశ్రమలో చైనా ఆధిపత్యానికి ఈ ఆంక్షలే పునాదులుగా మారాయి. వీటిల్లో ముఖ్య పాత్రను కాథోడ్ టెక్నాలజీలే పోషిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఎల్ఎఫ్‌పీ, ఎల్ఎంఎఫ్‌పీ 95 శాతం ఉత్పత్తి సామర్థం చైనాలో ఉంది. ఇక ఎల్ఎఫ్‌పీ ఆధారిత 76.6శాతం విద్యుత్తు వాహనాలు ఇక్కడే ఉత్పత్తి అయ్యాయి.



## జియో ఫైనాన్స్ నికరలాభం రూ.325 కోట్లు

**ముంబై, జూలై 18:** డైవర్సిఫైడ్ దిగ్గజం ఆర్ఐఎల్ నుంచి విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలను సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్ మొదటి త్రైమాసికంలో నికర లాభం 4శాతం పెరిగి రూ.325 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో రూ.313 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.418 కోట్ల నుంచి రూ.619 కోట్లకు చేరింది. అయితే మొత్తంవ్యయాలు సైతం రూ.79 కోట్ల నుంచి రూ.261 కోట్లకు భారీగా పెరిగాయి. వడ్డీ ఆదాయం రూ.162 కోట్ల నుంచి రెట్టింపై రూ.363 కోట్లకు చేరింది. ఈ కాలంలో జియో పేమెంట్స్‌లో 14.96 శాతం వాటాకు సమానమైన 7.9 కోట్ల ఈక్విటీ షేర్లను ఎస్‌బిఐ నుంచి సొంతం చేసుకుంది. ఇందుకు రూ.104.54 కోట్లు వెచ్చించింది. వెరసి 2025 జూన్ 18 నుంచి జెపిబిఎల్ పూర్తి అను బంధ సంస్థగా అవత రించినట్లు వెల్లడించింది.




### సౌత్ ఇండియన్ బ్యాంకు లాభం రూ.322 కోట్లు

ప్రైవేట్ రంగ సంస్థ సౌత్ ఇండియన్ బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధిం చింది. ఏప్రిల్-జూన్ తొలి త్రైమాసికంలో నికర లాభం 10శాతం వృద్ధితో రూ.322 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో రూ.294 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ.2,736 కోట్ల నుంచి రూ.2,984 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.2,314 కోట్ల నుంచి రూ.2,362 కోట్లకు చేరింది. నిర్వహణ లాభం రూ.508 కోట్ల నుంచి రూ.672 కోట్లకు చేరింది.స్థూల మొండిబకాయిలు 4.5శాతం నుంచి 3.15శాతానికి, నికర ఎన్‌పిఎలు 1.44 శాతం నుంచి 0.68శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 18.11 శాతం నుంచి 19.48 శాతానికి మెరుగు పడింది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూలై 18:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ఈ వారాంతాన్ని ముగించాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఉదయం 82,193.62 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. క్రమంగా భారీ నష్టాల్లోకి వెళ్లింది. ఇంట్రాడేలో 650 పాయింట్ల నష్టంతో ఓ దశలో 81,608.13 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 501.51 పాయింట్ల నష్టంతో 81,757.73 వద్ద ముగిసింది. నిఫ్టీ 143.05 పాయింట్ల నష్టంతో 24,968.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.16గా ఉంది. యాక్సిస్ బ్యాంక్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.16 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,355 డాలర్ల వద్ద ట్రేడయింది. మే, జూన్ నెలల్లో మన మార్కెట్లకు దన్నుగా నిలిచిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు జులైలో సెల్లర్లుగా నిలవడం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. మే నెలలో రూ.19,860 కోట్లు, జూన్‌లో రూ.14,590 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసిన ఎఫ్ఐఐలు.. జులైలో మాత్రం ఇప్పటి వరకు నికరంగా రూ.2660 కోట్ల షేర్ల విక్రయాలు జరిపారు. యాక్సిస్ బ్యాంక్ నికర లాభంలో 3 శాతం క్షీణత నమోదు చేసింది.ఇంట్రాడేలో 6 శాతం మేర నష్టపోయిన యాక్సిస్ బ్యాంక్ షేరు చివరికి బీఎస్ఈలో 5.24 శాతం నష్టంతో 1099 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లపైనా పడింది. అమెరికాతో ట్రేడ్‌డీల్‌పై రోజులు గడుస్తున్నా స్పష్టత రాకపోవడం, అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ 70 డాలర్లకి చేరడం కూడా సూచీల పతనానికి కారణం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.